

TGTEL/25/A1713

# సూర్య రేఖ

తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

సమాజంలో మీ కోసం.. మీరు ప్రశ్నించాలని అనుకుంటున్నారా.. అన్యాయాలను అక్రమాలను వెలుగులోకి తీసుకురావాలి అనుకుంటున్నారా.. ఇంతే కాకుండా సామాజిక నైపు ణ్యం.. సాంస్కృతిక అవగాహన..మీ ద్వారా కల్పించాలనుకుంటున్నారా.. అయితే అక్షర పంజా విసరడానికి మీ ముందుకు వచ్చింది సూర్య రేఖ తెలుగు దినపత్రికకు మండలాల వారీగా రిపోర్టర్లు కావలెను. ఆసక్తి కలవారు క్రింది నంబరును సంప్రదించగలరు.

సీనియర్లకు ప్రాధాన్యం

సంప్రదించవలసిన నెం : 9397303326

రంగారెడ్డి | సంపుటి : 2 | సంచిక : 146 | పేజీలు : 14 | ఎడిటర్ : ఎం ప్రేమ్‌రాజ్ | బుధవారం 22 జూలై 2026 | వెల : 4/-



## పాక్ విక్టిమ్ కార్డ్ వ్యూహం విఫలం

- యథావిధిగా సింధు జలాల ఒప్పందం పునరుద్ధరణ సాధ్యం కాదు: భారత్
- పాక్ ఉగ్రవాదానికి స్వస్తి పలకాల్సిందే
- అప్పటి వరకు సింధు జలాల ఒప్పందం నిలిపివేస్తాం
- మరోసారి స్పష్టం చేసిన భారత్

# ప్రతి నెలా తనిఖీ చేస్తా

- నెలలో ఒకరోజు సైట్‌లోనే బస చేస్తా
- కొడంగల్ నియోజకవర్గంలో సీఎం రేవంత్‌రెడ్డి పర్యటన
- హకీంపేటలో నిర్మిస్తున్న ఎడ్యుకేషన్ హబ్‌ను పరిశీలించిన సీఎం
- పనుల్లో వేగం పెంచాలని అధికారులకు ఆదేశం
- నెలకు ఒకరోజు సైట్‌లోనే బస చేస్తానని స్పష్టీకరణ



హైదరాబాద్

హకీంపేటలోని ఎడ్యుకేషనల్ హబ్ నిర్మాణ పనుల్లో జాప్యాన్ని ఎట్టి పరిస్థితిలో సహించబోనని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. రెండు రోజుల పర్యటనలో భాగంగా సొంత నియోజకవర్గం కొడంగల్ చేరుకున్న ముఖ్యమంత్రి, దుద్యాల మండలం హకీంపేటలో అభివృద్ధి పనులను పరిశీలించారు. 248 ఎకరాల్లో చేపడుతున్న మెడికల్ కళాశాల, యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్, ఇంజినీరింగ్ కళాశాల, వెటర్నరీ పాలిటెక్నిక్ కళాశాల నిర్మాణాల - మిగతా3లో



## రాజకీయ నాటకాలు వద్దు

- కాంగ్రెస్‌పై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ నిరసనపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఆగ్రహం
- పార్లమెంటులో చర్చించకుండా రాజకీయం చేస్తున్నారని మండిపాటు
- వరుస ఎన్నికల్లో ఓడినా కాంగ్రెస్ తీరు మారడం లేదని వ్యాఖ్య
- బాధ్యతాయుత ప్రతిపక్షం కావాలి కానీ, నిరంతరం ఆందోళన చేసేది కాదంటూ హితవు

## విద్యార్థుల ఆవేదనను గౌరవించాలి



- ప్రభుత్వానికి కేంద్రమంత్రి సూచన
- విద్యార్థుల గొంతును అణచివేయడాన్ని సమర్థించను
- శాంతియుత నిరసనలు ప్రతి ఒక్కరి హక్కని వ్యాఖ్య
- సమస్యల పరిష్కారానికి చర్చలే ఉత్తమ మార్గమని హితవు
- ప్రభుత్వం ఎప్పుడూ చర్చలకు సిద్ధంగా ఉంటుందని వెల్లడి
- నిరసనలు హద్దులు దాటొద్దు


## బ్రిటన్‌లో నూతన శకం

- తొలి ఏఐ మంత్రిగా కనిష్క నారాయణ్
- నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ కేబినెట్లో ఇద్దరు భారత సంతతికి చోటు
- కనిష్క నారాయణ్‌తో పాటు లీసా నాండీకి మంత్రివర్గంలో చోటు



# ఢిల్లీలో ఉద్రిక్తత

- ప్రధాని మోదీ నివాసం వద్ద హైడ్రామా..
- రాహుల్ గాంధీ, ప్రియాంకలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నీట్ వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలపై మోదీ నివాసం వద్ద కాంగ్రెస్ నిరసన
- రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకున్న పోలీసులు
- విద్యాశాఖ మంత్రి రాజీనామాకు పట్టుబట్టడంతో విఫలమైన చర్చలు
- అమిత్ షా ప్రకటన చేయాలని డిమాండ్ చేసిన కాంగ్రెస్



### మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

- విద్యార్థులకు క్షమాపణ చెప్పాలి
- ప్రధాని నివాసం వద్ద కాంగ్రెస్ ధర్నా
- మోదీ ఇంటి ముందు రాహుల్ గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ ధర్నా
- విద్యార్థులపై జరిగిన లాఠీ ఛార్జీకి బాధ్యత వహిస్తూ మోదీ రాజీనామా చేయాలని డిమాండ్

## విద్యార్థుల వెంటే ప్రభుత్వం

- నీట్ పేపర్ లీక్ దోషులపై కఠిన చర్యలు
- ప్రశ్నాపత్రాల లీకేజీ దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశం
- మంగళ్ మిలన్' పేరుతో ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ భేటీ
- నీట్ పేపర్ లీక్ అంశాన్ని రాజకీయాలకు అతీతంగా చూడాలని ప్రధాని సూచన






### ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం

## ఆధార్ తప్పనిసరి కాదు

- ఓటర్ల జాబితా సవరణ: ఆధార్‌పై తెలంగాణ సీఈవో కీలక ప్రకటన
- ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియలో పాల్గొనాలని ప్రజలకు విజ్ఞప్తి
- ఇతర గుర్తింపు పత్రాలతో నమోదు చేసుకునేందుకు అవకాశం

# వచ్చే నెల నుంచి మళ్లీ ఉపాధి పనులు

- వర్షాభావ పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వ నిర్ణయం!
- ఎల్‌నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు
- రెండు నెలల విరామం లేకుండా నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయం
- ఎల్‌నినోను ఎదుర్కొనేందుకు జలసిరి కార్యక్రమం ఏర్పాటు



హైదరాబాద్

ఉపాధి హామీ పథకం జీ రాంజీలో భాగంగా వర్షాకాలంలో రెండు నెలలు పాటు పనులకు విరామం ఇచ్చారు. ఎందుకంటే వ్యవసాయ సీజన్‌లో కూలీలు అందుబాటులో ఉండేందుకు దీనిని నిలిపి వేయాల్సి ఉంటుందని కేంద్రం తెలిపింది. అయితే ఈసారి ఎల్?నినో కారణంగా రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడ్డాయి. దీనిని దృష్టిలో పెట్టుకుని ప్రభుత్వం ఓ నిర్ణయం తీసుకుంది. రెండు నెలల విరామం లేకుండా నిరంతరాయంగా కొనసాగించాలని నిర్ణయించింది. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వానికి లేఖ రాయనుంది. నిజానికి రాష్ట్రంలో వర్షాకాలం సీజన్ ఎప్పటిలాగే ఉంటే ఆగస్టు, సెప్టెంబర్ నెలల్లో జీరాంజీ పథకాన్ని నిలిపి వేయాల్సి ఉండేది. కానీ ఈసారి రాష్ట్రవ్యాప్తంగా మొత్తం సాగు విస్తీర్ణంలో 45 శాతమే రైతులు పంటలు వేయగలిగారు. అయితే వచ్చే అక్టోబర్ వరకు ఎల్?నినో పరిస్థితుల వల్ల వర్షాలు తగ్గుముఖం పడతాయని శాస్త్రవేత్తలు చెబుతున్నారు. వానాకాలంలో వర్షాభావ పరిస్థితులు ఇలాగే కొనసాగితే ఆ ప్రభావం యాసంగి మీద ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో జీరాంజీకి రెండు నెలల విరామం అమలు చేయటం కష్టమని అధికారులు గుర్తించారు. దీంతో 2026-27 ఆర్థిక సంవత్సరానికి - మిగతా3లో

# విద్యార్థుల వెంటే ప్రభుత్వం

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మొదటిసారిగా స్పందించారు. ఇది జాతీయ సమస్య అని, దోషులను కఠినంగా శిక్షించాలని అన్నారు. దిల్లీలోని పార్లమెంట్ లైబ్రరీ భవనంలోని జీఎంసీ బాలయోగి ఆడిటోరియంలో 'మంగళ్ మిలన్' పేరుతో జరిగిన ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశంలో పాల్గొన్న ప్రధాని మోదీ ఈ మేరకు వ్యాఖ్యలు చేశారు. సమావేశం అనంతరం ఎన్‌డీఏ నేతలకు, ఎంపీలకు ప్రధాని మోదీ చేసిన కీలక సూచనలను కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు మీడియాకు తెలిపారు. ఈ సమావేశంలో నీట్ పరీక్ష పేపర్ లీక్, స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలు (ఎఫ్‌టీఏలు), దేశ ఆర్థిక పురోగతి తదితర అంశాలపై మాట్లాడినట్లు తెలిపారు.

**'నీట్ పేపర్ లీక్ జాతీయ సమస్య'**

నీట్ పరీక్ష పేపర్ లీక్ వ్యవహారంపై ప్రధాని మోదీ స్పష్టమైన సందేశం ఇచ్చారని కిరణ్ రిజిజు తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల వెంటే నిలుస్తుందని, ప్రశ్నాపత్రాల లీకేజీ దేశవ్యాప్తంగా ఆందోళన కలిగించే అంశమని ప్రధాని పేర్కొన్నట్లు వెల్లడించారు. ఈ సమస్యను రాజకీయ కోణంలో చూడకుండా, జాతీయ సమస్యగా భావించి పరిష్కరించాలని ప్రధాని సూచించారని చెప్పారు. పేపర్ లీక్‌లకు బాధ్యులైన వారిపై అత్యంత కఠిన చర్యలు తీసుకోవాలని ప్రధాని మోదీ ఆదేశించినట్లు రిజిజు తెలిపారు. అవసరమైతే న్యాయ నిపుణులతో సంప్రదించి చట్టపరంగా కఠిన చర్యలు చేపట్టాలని సూచించారని చెప్పారు. కేంద్ర ప్రభుత్వంతో పాటు రాష్ట్ర ప్రభుత్వాలు కూడా తమ పరిధిలో జరిగే పేపర్ లీక్ ఘటనలపై రాజీ లేకుండా చర్యలు తీసుకోవాలని ప్రధాని స్పష్టం చేసినట్లు వెల్లడించారు.

**'మనందరి బాధ్యత అదే**

పార్లమెంట్‌లో నిర్మాణాత్మక చర్చలు జరిగేలా విపక్షాలు సహకరించాలని ప్రధాని మోదీ తెలిపినట్లు కిరణ్ రిజిజు పేర్కొన్నారు. రాజకీయంగా విభేదాలు ఉండొచ్చని, కానీ దేశ భవిష్యత్తు, యువత సంక్షేమం కోసం కలిసి పనిచేయాల్సిన బాధ్యత ఎంపీలందరిపై ఉందని ప్రధాని సూచించినట్లు తెలిపారు. పిల్లలను రెచ్చగొట్టొద్దని, తప్పుడు మార్గంలోకి వెళ్లడం సులభమని అన్నారు. కానీ తిరిగి సరైన మార్గంలోకి రావడం చాలా కష్టమని, వారు సరైన మార్గంలో వెళ్లేలా చూసుకోవడం మనందరి బాధ్యత అని పేర్కొన్నట్లు చెప్పారు. నీట్ పరీక్షలో అక్రమాలపై నివేదికలు అందిన వెంటనే కేంద్ర ప్రభుత్వం స్పందించి కఠిన చర్యలు తీసుకుందని, కిరణ్ రిజిజు తెలిపారు. ఈ వ్యవహారంలో 13 మందిని అరెస్టు చేసి జైలుకు పంపినట్లు చెప్పారు. విద్యార్థుల భవిష్యత్తుకు ప్రాధాన్యతనిస్తూ, ఎలాంటి జాప్యం లేకుండా రీ-ఎగ్జామ్‌ను విజయవంతంగా నిర్వహించి వెంటనే ఫలితాలను సైతం వెల్లడించామన్నారు.



**'రైతుల ప్రయోజనాలే ముఖ్యం'**

ఎన్‌డీఏ పార్లమెంటరీ పార్టీ సమావేశం ఎంతో ఫలవంతంగా జరిగిందని కిరణ్ రిజిజు తెలిపారు. ఇటీవల దేశం సాధించిన విజయాలు, వివిధ దేశాలతో కుదిరిన స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాలపై ప్రధాని, ఎంపీలకు వివరించారని చెప్పారు. వివిధ దేశాలతో కుదుర్చుకున్న ఎఫ్‌టీఏలపై మాట్లాడిన ప్రధాని, రైతుల ప్రయోజనాలకు ఎలాంటి భంగం కలగకుండా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని హామీ ఇచ్చినట్లు రిజిజు వెల్లడించారు. ఏ దేశంతో ఒప్పందం కుదుర్చుకున్నా రైతుల సంక్షేమమే ప్రభుత్వ తొలి ప్రాధాన్యమని, దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకునే నిర్ణయాలే తీసుకుంటామని ప్రధాని మోదీ స్పష్టం చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కొత్తగా రాజ్యసభకు ఎన్నికైన సభ్యులను కూడా సమావేశంలో స్వాగతించినట్లు పేర్కొన్నారు. నీట్ పరీక్షలో జరిగినట్లు ఆరోపణలు అవకతవకలు, పరీక్ష రద్దు అనంతరం విద్యార్థుల ఆత్మహత్యల అంశాలపై ప్రధాని మోదీ మౌనంగా ఎందుకు ఉంటున్నారంటూ విపక్షాలు విమర్శిస్తూ వచ్చాయి. ఈ ఘటనపై చర్యలు తీసుకోవాలని చర్యలు తీసుకోవాలని సీజేపీ నిరసనలు చేపట్టింది. కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలంటూ డిమాండ్ చేస్తోంది.

# 'మోదీ, అమిత్ షా రాజీనామా చేయాలి

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ వ్యవహారంపై దిల్లీలో ఆందోళన చేసిన విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నిరసనగా కాంగ్రెస్ నేతలు ప్రధాని మోదీ నివాసం వద్ద ధర్నాకు దిగారు. విద్యార్థులపై లాఠీఛార్జ్‌కు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున ఖర్గే సహా అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ, ఇతర ముఖ్యనేతలు ప్రధాని నివాసం వద్ద బైఠాయించి నిరసన తెలియజేశారు. అంతకుముందు దేశంలోని యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని, వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్ పరామర్శించారు. దిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ లో తమకు భవిష్యత్తే లేదన్న విద్యార్థుల ఆవేదన పూర్తిగా న్యాయమైనదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**కాంగ్రెస్ నేతలతో జితేంద్ర సింగ్ చర్చ**

మోదీ ఇంటి ముందు కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిరసనగా కాంగ్రెస్ నేతలు చేతులకు తాళ్లు కట్టుకొని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అదుపులోకి తీసుకొని అక్కడి నుంచి తరలిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం తమ వాదనను పార్లమెంటులో ఆలకించడం లేదని కాంగ్రెస్ నేతలు ఆరోపించారు. రహదారులపైకి వచ్చి ఆందోళన చేస్తుంటే పోలీసులు అడ్డుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనితో ఆందోళన చేస్తున్న కాంగ్రెస్ నేతలతో కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ చర్చలు జరుపుతున్నారు. మరోవైపు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా బలగాలను మోహరించారు.



**విద్యావ్యవస్థను నాశనం చేస్తున్నారు!**

అంతకుముందు దేశంలో యువత పట్ల కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు ఏమాత్రం సరికాదని రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. దేశంలో యువతకు అవకాశాలు పూర్తిగా సన్నగిల్లాయని, వారికి ఉన్న ఏకైక మార్గమైన పోటీ పరీక్షల వ్యవస్థను సైతం నాశనం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. జంతర్ మంతర్ వద్ద ఆందోళనల్లో గాయపడి రామ్‌మనోహర్ లోహియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విద్యార్థులను రాహుల్ పరామర్శించారు. దిల్లీలో విద్యార్థులపై దాడి ఘటనపై ప్రధాని ఎందుకు మౌనంగా ఉన్నారని రాహుల్ ప్రశ్నించారు. ఈ ఘటనపై ప్రధాని వెంటనే విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. భారత్ లో తమకు భవిష్యత్తే లేదన్న విద్యార్థుల ఆవేదన పూర్తిగా న్యాయమైనదేనని రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. ఈ పరిస్థితులకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని రాహుల్ గాంధీ డిమాండ్ చేశారు.

**అరెస్ట్ అయినవారి జాబితా కావాలి!**

మరోవైపు కాక్రోచ్ జనతా పార్టీ నిరసనలు చేపట్టిన నేపథ్యంలో, పోలీసులు అరెస్టు చేసి, ఎఫ్?ఐఆర్? నమోదు చేసిన నిరసనకారుల జాబితాను విడుదల చేయాలని ఆప్? అధినేత కేజ్రీవాల్ దిల్లీ పోలీసులను కోరారు. ఈ మేరకు మంగళవారం దిల్లీ డీసీపీకి ఆయన ఓ లేఖ రాశారు. చాలా మందిపై ఎలాంటి ఎఫ్?ఐఆర్ నమోదు చేయకుండానే అదుపులోకి తీసుకున్నట్లు తనకు తెలిసిందని అన్నారు. అందువల్ల బాధితులకు న్యాయ సహాయం చేసేందుకు వీలుగా ఎఫ్ఐఆర్ జాబితాను, అరెస్టు చేసిన నిరసనకారుల వివరాలను తక్షణం విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

## విద్యార్థుల ఆవేదనను గౌరవించాలి

ఢిల్లీలో విద్యార్థుల ఆందోళనల నేపథ్యంలో కేంద్ర మంత్రి, ఎల్‌జేపీ (ఆర్వీ) అధినేత చిరాగ్ పాశ్వాన్ కీలక వ్యాఖ్యలు చేశారు. విద్యార్థుల ఆవేదనను గౌరవించాలని, వారి గొంతును బలప్రయోగంతో అణచివేయడాన్ని తాను సమర్థించనని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారానికి చర్చలే ఉత్తమ మార్గమని, ప్రజాస్వామ్యంలో శాంతియుత నిరసనలు ప్రతి ఒక్కరి హక్కని అన్నారు. విద్యార్థుల నిరసనలపై సానుకూలంగా స్పందించిన తొలి మంత్రి పాశ్వాన్ కావడం గమనార్హం. విద్యార్థి ప్రతినిధులు చర్చలకు ముందుకొచ్చినప్పుడు కేంద్ర ఆరోగ్య మంత్రి జేపీ నడ్డా వారితో సమావేశమై సమస్యలపై చర్చించారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఎప్పుడూ చర్చలకు సిద్ధంగానే ఉంటుందని చెప్పారు. అయితే నిరసనలు హద్దులు దాటి శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే అధికారులు చర్యలు తీసుకోవాల్సి వస్తుందని, అయినప్పటికీ అలాంటి పరిస్థితులు రాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. నీట్ సహా పోటీ పరీక్షల్లో అక్రమాలపై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం విద్యార్థులు, సీజేపీ కార్యకర్తలు జంతర్‌మంతర్ నుంచి పార్లమెంట్ వైపు ర్యాలీ నిర్వహించగా, పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్న విషయం తెలిసిందే. ఈ ఘటన అనంతరం చిరాగ్ పాశ్వాన్ స్పందిస్తూ విద్యార్థుల భావోద్వేగాలను గౌరవించాలని కేంద్రానికి సూచించారు.

# బ్రిటన్‌లో నూతన శకం




బ్రిటన్ రాజకీయాల్లో ఒక కీలక పరిణామం చోటుచేసుకుంది. దేశపు మొట్టమొదటి కృత్రిమ మేధ (ఏఐ) మంత్రిగా భారత మూలాలున్న కనిష్క నారాయణ్‌ను నియమిస్తున్నట్లు నూతన ప్రధానమంత్రి ఆండీ బర్న్‌హామ్ ప్రకటించారు. శరవేగంగా విస్తరిస్తున్న ఏఐ సాంకేతికతలో ప్రపంచస్థాయి అగ్రగామిగా నిలవాలన్న యూకే ప్రభుత్వ లక్ష్యానికి ఈ నియామకం అద్దం పడుతోంది. ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా ప్రభుత్వాలు ఏఐతో ముడిపడిన అవకాశాలను, సవాళ్లను ఎదుర్కొంటున్నాయి. ఏఐ నియంత్రణ, నైతిక వినియోగం, ఆర్థిక వ్యవస్థతో దాని అనుసంధానం వంటి అంశాలపై విస్తృత చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో టెక్నాలజీ పాలసీ, ఆవిష్కరణల రంగంలో అపార అనుభవం ఉన్న కనిష్క నారాయణ్ నియామకాన్ని ఒక వ్యూహాత్మక అడుగుగా భావిస్తున్నారు. ఏఐ వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకుంటూనే, దానితో ముడిపడిన ముప్పులను నివారించడం ఆయన ప్రధాన బాధ్యత కానుంది. కనిష్క వేల్స్ నుంచి ఎంపీగా గెలుపొందారు. ప్రధాని ఆండీ బర్న్‌హామ్ భారత మూలాలున్న ఇద్దరికి తన కేబినెట్లో చోటు కల్పించారు. వారిలో కనిష్క నారాయణ్‌తో పాటు లీసా నాండీ ఉన్నారు. కనిష్క గతంలో కీర్ స్టార్మర్ ప్రభుత్వంలోనూ మంత్రిగా పనిచేశారు. అప్పట్లో ఆన్ లైన్ భద్రత, కృత్రిమ మేధ విభాగాలను పర్యవేక్షించిన ఆయన, ఇప్పుడు పూర్తిస్థాయిలో ఏఐ మంత్రిగా నియమితులయ్యారు. బీహార్‌లో జన్మించిన కనిష్క నారాయణ్, స్టాన్‌ఫోర్డ్ యూనివర్సిటీ నుంచి ఎంబీఏ పట్టా పొందారు. 2024 ఎన్నికల్లో ఎంపీగా విజయం సాధించిన ఆయన, 2025లో మంత్రిగా బాధ్యతలు స్వీకరించారు. ఇక లీసా నాండీ, కీర్ స్టార్మర్ ప్రభుత్వంలో సాంస్కృతిక శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. మాంచెస్టర్‌లో జన్మించిన ఆమె తండ్రి దీపక్ నాండీ పశ్చిమ బెంగాల్‌కు చెందిన వారు కాగా, తల్లి బ్రిటన్ జాతీయురాలు. లీసా 2010 నుంచి విగాన్ నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

## ఢిల్లీలో ఉద్రిక్తత



నీట్ పరీక్షల వివాదం, విద్యార్థులపై లాఠీచార్జి అంశాలు దేశ రాజధాని ఢిల్లీలో తీవ్ర రాజకీయ ఉద్రిక్తతకు దారితీశాయి. ప్రధాని నరేంద్ర మోదీ నివాసాన్ని ముట్టడించేందుకు యత్నించిన కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రాలను ఢిల్లీ పోలీసులు మంగళవారం అదుపులోకి తీసుకున్నారు. వారితో పాటు పలువురు సీనియర్ నేతలు, ఎంపీలను కూడా నిర్బంధంలోకి తీసుకుని అక్కడి నుంచి తరలించారు. ఈ ఘటనతో లోక్ కళ్యాణ్ మార్గ్ వద్ద తీవ్ర హైడ్రామా చోటుచేసుకుంది. నీట్ పరీక్షల్లో అవకతవకలపై పార్లమెంటులో చర్చకు, కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ పార్టీ ఆందోళన బాట పట్టింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నివాసంలో సమావేశమైన అనంతరం రాహుల్, ప్రియాంక, కేసీ వేణుగోపాల్, పవన్ ఖేరా వంటి సీనియర్ నేతల నేతృత్వంలో కాంగ్రెస్ ఎంపీలు ప్రధాని నివాసం వైపు పాదయాత్రగా బయలుదేరారు. అయితే, వారిని పోలీసులు బారికేడ్లతో అడ్డుకున్నారు. దీంతో కాంగ్రెస్ నేతలు రోడ్డుపై బైఠాయించి ధర్నాకు దిగారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో కేంద్ర ప్రభుత్వం చర్చలకు ప్రయత్నించింది. కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్, హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ నిరసన స్థలానికి చేరుకుని రాహుల్ గాంధీతో మాట్లాడారు. పార్లమెంటులో నీట్ అంశంపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని హామీ ఇచ్చారు. అయితే, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, కేంద్ర హోంమంత్రి అమిత్ షా పార్లమెంటులో ప్రకటన చేయాలని కాంగ్రెస్ నేతలు పట్టుబట్టడంతో చర్చలు విఫలమయ్యాయి.

చర్చలు కొలిక్కి రాకపోవడంతో, ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ (ఆర్ఏఎఫ్) సహా భారీగా మోహరించిన పోలీసులు చర్యలకు ఉపక్రమించారు. నిరసనకారులను బలవంతంగా అక్కడి నుంచి తరలించారు. ఈ క్రమంలో రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, ఛత్తీస్‌గఢ్ మాజీ సీఎం భూపేష్ బఘేల్, రణ్‌దీప్ సూర్జేవాలా, కె. సురేశ్, చరణ్‌జిత్ సింగ్ చన్నీ సహా పలువురు కాంగ్రెస్ నేతలను అదుపులోకి తీసుకుని సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ కూడా నిరసన స్థలానికి వచ్చి కాంగ్రెస్ నేతలకు మద్దతు తెలిపారు. నీట్ విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని, జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై జరిగిన పోలీసుల దాడిపై విచారణ జరపాలని కాంగ్రెస్ డిమాండ్ చేస్తోంది. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న తమ నేతలను అరెస్ట్ చేయడం ప్రభుత్వ నిరంకుశ వైఖరికి నిదర్శనమని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మరోవైపు, ప్రధాని నివాసం వంటి అత్యంత కీలకమైన, సున్నితమైన ప్రాంతంలో నిరసనలు చేపట్టడం భద్రతా నిబంధనలను ఉల్లంఘించడమేనని అధికార పక్షం విమర్శిస్తోంది. ఈ ఘటనతో నీట్ వివాదం మరింత వేడెక్కింది.

## పాక్ విక్టిమ్ కార్డ్ వ్యూహం విఫలం



సింధు జలాల ఒప్పందం ప్రస్తుత రూపంలో ఇక కొనసాగే అవకాశం లేదని భారత్ తేల్చిచెప్పింది. పాకిస్థాన్ ఉగ్రవాదానికి ఇచ్చే మద్దతును నమ్మదగిన విధంగా, శాశ్వతంగా నిలిపివేసే వరకు ఈ ఒప్పందాన్ని నిలిపివేసి ఉంచుతామని స్పష్టం చేసింది. 1960లో కుదిరిన ఈ ఒప్పందం గురించి మళ్లీ ఆలోచించాలన్నా, లేదా పునఃసమీక్షించాలన్నా పాకిస్థాన్ ఉగ్రవాదాన్ని ఆపడమే ప్రాథమిక షరతు అని, ఆ తర్వాతే చర్చలు సాధ్యమవుతాయని పేర్కొంది. విశ్వసనీయ సమాచారం ప్రకారం, తాము బాధితులమంటూ ప్రపంచవ్యాప్తంగా సానుభూతి పొందేందుకు పాకిస్థాన్ చేస్తున్న ప్రయత్నాలు ఏమాత్రం ఫలించడం లేదు. ఇటీవలే కెనడా విదేశాంగ మంత్రి పాకిస్థాన్‌లో పర్యటించినప్పుడు, ఈ అంశాన్ని లేవనెత్తాలని పాక్ పట్టుబట్టింది. అయితే ఏ దేశమూ పాక్ వాదనలను నమ్మడం లేదు. సింధు నదీ జలాల ఒప్పందం ప్రకారం, ఏదైనా వివాదం వస్తే దశల వారీగా పరిష్కరించుకోవాలి. మొదట రెండు ప్రభుత్వాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరగాలి. ఆ తర్వాత తటస్థ పరిశీలకులను (న్యూట్రల్ అబ్జర్వర్స్)ను సంప్రదించాలి. చివరి దశలో అంతర్జాతీయ న్యాయస్థానాన్ని ఆశ్రయించాలి. కానీ పాకిస్థాన్ ఈ నిబంధనలను ఉల్లంఘించి, నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. అందుకే ఈ న్యాయస్థానం తీర్పు, నిర్ణయాలు ఏవీ తమ నిర్ణయాన్ని మార్చలేవని భారత్ స్పష్టం చేసింది. అంతర్జాతీయ వేదికలపై కూడా ఈ ఒప్పందం గురించి మాట్లాడుతూ పాక్ నవ్వులపాలు అవుతోంది. వాస్తవానికి పాక్? తన భూభాగంలోని జలవనరులపై డ్యామ్‌లు నిర్మించుకోవడానికి లేదా నీటిని నిల్వ చేసుకోవడానికి ఎలాంటి ఆంక్షలు లేవు. కానీ పాక్ ఆ పనులేవీ చేకుండా, సమస్యలన్నింటికీ భారతదేశమే కారణమని ప్రపంచానికి చెప్పాలని విఫలయత్నం చేస్తోంది. అక్కడితో ఆగకుండా, భారత్? పరిధిలోకి వచ్చే తూర్పు నదులపై చేపడుతున్న పనులపై కూడా అనవసర ఫిర్యాదులు చేస్తోంది.

**అప్పుడు పాకిస్థానే వద్దని కోరింది!**

ఇండస్ వాటర్ ట్రీటీని పునఃసమీక్షించాలని 2023లో భారత్ కోరినప్పటికీ పాకిస్థాన్? దానిని నిరాకరించింది. 1960లో కుదిరిన ఈ ఒప్పందం 1950ల నాటి ఇంజినీరింగ్ సాంకేతికతపై ఆధారపడి ఉంది. గత ఆరు దశాబ్దాల్లో భారత్ జనాభా, అభివృద్ధి అవసరాలు, స్వచ్ఛమైన ఇంధనాల (క్లీన్ ఎనర్జీ) అవసరాలు, తాగునీరు, సాగు నీటి డిమాండ్, వాతావరణ మార్పుల వల్ల ఎదురవుతున్న సవాళ్లు, సాంకేతికి సమార్థ్యాలు పూర్తిగా మారిపోయాయి. ఈ వాస్తవాలను పాకిస్థాన్? ముందు ఉంచినప్పటికీ, వారు అప్పట్లో చర్చించడానికి నిరాకరించారు. పైగా అంతర్జాతీయ వేదికలపై సాంకేతికపరమైన సాకులు చూపుతూ భారత్ చేపట్టిన జల విద్యుత్? ప్రాజెక్టులను ఆలస్యం చేయడానికి పాక్? ప్రయత్నించింది.

**ఈ ఒప్పందాన్ని నిలిపివేయడానికి గల కారణమేంటి?**

కశ్మీర్?లోని పహల్గాంలో హిందూ పర్యటకులే లక్ష్యంగా పాక్? ఉగ్రవాదులు దాడి చేసి 26 మంది పౌరులను ఘోరంగా చంపేశారు. దీనితో 2025 ఏప్రిల్? 23న జరిగిన క్యాబినెట్? కమిటీ ఆన్? సెక్యూరిటీ (సీసీఎస్) సమావేశంలో ఈ సింధూ జలాల ఒప్పందాన్ని నిలిపివేయాలని భారత్ నిర్ణయించింది. పరస్పర నమ్మకం, సద్భావన, శాంతియుత సహజీవనం ఉన్నప్పుడు ఈ ఒప్పందం సాధ్యమని, కానీ పాక్ ఉగ్రచర్యల వల్ల ఆ వాతావరణం పూర్తిగా దెబ్బతిన్నదని పేర్కొంది. వాస్తవానికి ఈ ఒప్పందాన్ని భారత్? నిలిపివేసినప్పటికీ, మానవతా దృక్పథంతో వరదలు వచ్చినప్పుడు పాకిస్థాన్?కు? ముందస్తు సమాచారం అందిస్తోంది. గత వర్షాకాలంలో భారత్? ఏకంగా 23 సార్లు పాకిస్థాన్?కు వరద హెచ్చరికలు జారీ చేసింది.

**భారత్ చేపడుతున్న ప్రాజెక్టులు**

ప్రస్తుతం భారత్ తన పరిధిలోని సింధు జలాలను శాస్త్రీయంగా, గరిష్ఠంగా ఉపయోగించుకోవడంపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగా చీనాబ్ బేసిన్‌లో జల విద్యుత్ ప్రాజెక్టుల నిర్మాణాన్ని వేగవంతం చేయడానికి సన్నాహాలు చేస్తోంది. వీటిలో ప్రధానమైనవి: సవాల్‌కోట్ జలవిద్యుత్ ప్రాజెక్టు (1856 మెగావాట్లు), పకాల్ దుల్ ప్రాజెక్టు (1000 మెగావాట్లు), రాట్లే ప్రాజెక్టు (850 మెగావాట్లు) , కిరు ప్రాజెక్టు (624 మెగావాట్లు), క్వార్ ప్రాజెక్టు (540 మెగావాట్లు) ఉన్నాయి. వీటితోపాటు సలాల్?, బాగ్లిహార్ ప్రాజెక్టుల్లో పేరుకుపోయిన పూడికను తొలగించి, డ్యామ్ భద్రతను, సామర్థ్యాన్ని పెంచునున్నారు.

# రానున్న రోజుల్లో ఎల్‌నినో ప్రభావం
# మరింత పెరిగే అవకాశం



ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో వర్షాలు కురుస్తున్నాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ఉత్తర, ఈశాన్య తెలంగాణ జిల్లాల్లో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ అధికారి శ్రీనివాస్ రావు తెలిపారు. మూడు రోజుల క్రితం పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో తూర్పు కోస్తా తీరానికి సమీపంలో సగటు సముద్ర మట్టానికి 5 నుంచి 7 కిలోమీటర్ల ఎత్తులో ఒక ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. సాధారణంగా వర్షాకాలంలో ఇవి ఏర్పడిన సమయంలో దగ్గరలోని ప్రాంతాల్లో మేఘాలు అధికంగా ఏర్పడతాయి. గత మూడు రోజుల్లో ఇవే పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలోనే ఉత్తర తెలంగాణ జిల్లాల్లో విస్తృతంగా వర్షాలు కురిశాయి. మరి కొన్ని చోట్ల భారీ వర్షాలు నమోదయ్యాయి. మంచిర్యాల జిల్లాలో 12 సెంటీమీటర్ల కంటే ఎక్కువగా వర్షం కురిసింది. ముఖ్యంగా ఉత్తర, ఈశాన్య తెలంగాణలో గత రెండు రోజుల్లో విస్తారంగా వానలు కురిశాయి. దక్షిణ, మధ్య తెలంగాణలోని జిల్లాల్లో తేలికపాటి నుంచి సాధారణ వర్షపాతం 2 నుంచి 4 సెంటీమీటర్ల వరకు నమోదయ్యాయి. మేఘాలు ఇదే తరహాలో కొనసాగుతాయి.

ఇటీవల ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సోమవారం ద్రోణిగా ఏర్పడింది. అది తెలంగాణ మీదుగా ఈశాన్య అరేబియా సముద్రం వైపుగా ప్రయాణిస్తోంది. ఈరోజు కూడా ద్రోణి కొనసాగుతోంది. ఇది రాష్ట్రం నుంచి కాస్త పక్కకు జరిగి మధ్యప్రదేశ్? మీదుగా కొనసాగుతోంది. ఉత్తర తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం కనిపించే అవకాశం ఉంది. మధ్య తెలంగాణ, హైదరాబాద్ ప్రాంతంలో మేఘాలు కమ్ముకుంటాయి. అనేక చోట్ల తేలిక పాటి వర్షాలు, కొన్ని చోట్ల సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. బుధవారం నాటికి ఈ ద్రోణి ప్రభావం తగ్గుముఖం పడుతుంది. ఉత్తర తెలంగాణలోని కొన్ని ప్రాంతాల్లో మాత్రమే సాధారణ వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉంది. మూడోరోజు నుంచి ద్రోణి ప్రభావం పూర్తిగా తగ్గిపోయి, క్లౌడీనెస్? తగ్గుముఖం పడుతుంది. ఉష్ణోగ్రతలు పెరిగే అవకాశం ఉంది. ఈ ద్రోణి ఏర్పడక ముందు (జూన్? 1 నుంచి జులై 19) మనకు 33 శాతం లోటు ఉండేది. అయితే ఈ మూడు రోజులు కురిసిన వర్షాలతో ఈ లోటు 8 శాతం తగ్గింది. ప్రస్తుతం మనకు 25 శాతం లోటుంది. అయితే అనేక జిల్లాల్లో ఇంకా 55 శాతం లోటులో ఉన్న జిల్లాలు కూడా ఉన్నాయి. నైరుతి రుతుపవనాల సమయంలో ఇలాంటి ద్రోణులు ఏర్పడినప్పుడే వర్షాలు కురుస్తాయి. క్లౌడీనెస్? ఏర్పడుతుంది. అక్కడక్కడ వర్షాలు కురుస్తాయి. ద్రోణి, అల్పపీడనం, వాయుగుండం ఏర్పడినప్పుడు కనీసం 3 రోజుల వరకు వానలు కురుస్తాయి. అయితే గతంలో ఇవి ఏర్పడిన సమయంలో ఇంకా ఎక్కువ సమయం వర్షాలు కురిశాయి. అయితే ఇప్పుడు మాత్రం కొన్ని జిల్లాలకే ఈ భారీ వర్షాలు పరిమితమయ్యాయి. అంతర్జాతీయ వాతావరణ కేంద్రాల ప్రకారం ఎల్?నినో ప్రభావంతో రానున్న రెండు మూడు నెలల్లో దీని ప్రభావం పెరిగే అవకాశం ఉంది. ఐఎండీ మిడ్?టైం రివ్యూ మరో పదిరోజుల్లో పూర్తి కానుంది. దీనిలో భాగంగా ఓ నివేదిక వెల్లడించనున్నాం. ఈ నెలాఖరు నాటికి గత రెండు నెలలుగా లోటు వర్షపాతం ఎంత, రానున్న నెలల్లో పరిస్థితి ఏవిధంగా రూపాంతరం చెందుతుంది వంటి వివరాలు నివేదికలో పొందుపరుస్తాం.

# రోడ్డు ప్రమాదంలో మరణిస్తే
# రూ.2 లక్షలు, గాయాలకు రూ.50,000



తెలంగాణలో రోడ్డు ప్రమాదాల కారణంగా సంభవిస్తున్న మరణాలు అత్యంత ఆందోళనకరంగా మారాయి. ప్రతి రోజూ అనేక మంది ప్రాణాలు కోల్పోతున్నారు. ఈ ప్రమాదాలకు కారణమైన వారిని గుర్తించడంలో మాత్రం జాప్యం జరుగుతోంది. రోడ్డు ప్రమాద బాధితుల కుటుంబాలకు అండగా నిలిచేందుకు, కేంద్ర ప్రభుత్వం 2022లో హిట్? అండ్? రన్? పరిహార పథకాన్ని ప్రవేశపెట్టింది. ఈ పథకం కింద మరణాలకు రూ.2 లక్షలు, గాయాలకు రూ.50,000 పరిహారం అందిస్తారు. ఈ నిధులు నేరుగా బాధితుల కుటుంబాల బ్యాంక్ ఖాతాల్లో జమ చేస్తారు. అయితే, క్షేత్రస్థాయిలో ఈ పథకం సమర్థవంతంగా అమలు కావడం లేదు. ఫలితంగా రోడ్డు ప్రమాద బాధితులు, వారి కుటుంబ సభ్యులు ఈ ప్రయోజనాలను పొందలేకపోతున్నారు.

**ఇలా దరఖాస్తు చేసుకోవాలి**

రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి కుటుంబ సభ్యులు తమ జిల్లా కలెక్టరేట్‌లో దరఖాస్తు సమర్పించాలి. అప్లికేషన్?తోపాటు వ్యక్తిగత వివరాలు, ప్రమాదం జరిగిన ప్రదేశం, సమయం, గాయాల తీవ్రత, అలాగే ఎఫ్ఐఆర్, ఆధార్ కార్డు, బ్యాంక్ ఖాతా వివరాల కాపీలను జత చేయాలి. మరణం సంభవించినట్లయితే, కుటుంబ సభ్యులు తమ బ్యాంక్ ఖాతా వివరాలు, మరణ ధృవీకరణ పత్రం, పోస్ట్‌మార్టం నివేదికను పోలీసు, రెవెన్యూ అధికారులకు సమర్పించాలి. గాయపడిన వారు కూడా ఆర్థిక సహాయం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

**పోలీసు నివేదిక అత్యంత కీలకం**

గుర్తుతెలియని వాహనాల వల్ల జరిగే 'హిట్ అండ్ రన్' ప్రమాదాలపై పోలీసులు కేసులు నమోదు చేసి దర్యాప్తు చేస్తారు. వాహనాన్ని గుర్తించలేమని పోలీసులు నివేదిక సమర్పిస్తే, బాధితులు ఈ పథకానికి దరఖాస్తు చేసుకోవడానికి అర్హులవుతారు. పోలీసులు ఎఫ్ఐఆర్‌తో పాటు సమగ్ర వివరాలతో కూడిన నివేదికను రెవెన్యూ డివిజనల్ అధికారికి (=ఖా) సమర్పిస్తారు. ఆర్‌డీవో దరఖాస్తును పరిశీలించి, తుది నివేదికను జిల్లా కలెక్టర్‌కు సమర్పిస్తారు. పోలీసు నివేదిక అందిన 15 రోజుల్లోనే కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేస్తారు. ఈ పథకంపై సరైన అవగాహన లేకపోవడం కారణంగా అనేక మంది ప్రయోజనాలను పొందలేకపోతున్నారు.

**ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాల్సిందే**

రోడ్డు ప్రమాదాలను కేవలం పోలీసుల తనిఖీలతోనే పూర్తిగా నియంత్రించడం సాధ్యం కాదు. ప్రతి వాహనదారుడు బాధ్యతతో వ్యవహరించాలి. రోడ్డు భద్రత నిబంధనలు పాటించడం, కేవలం ఒకరి కర్తవ్యమే కాదు. వాహనాన్ని పార్కింగ్? చేసే సమయంలో రిఫ్లెక్టర్‌లు, హెచ్చరిక బోర్డులు తప్పనిసరిగా ఉపయోగించాలి. అలసటగా అనిపిస్తే సురక్షిత స్థలంలోనే ఆగాలి. అలాగే వేగ పరిమితులను కచ్చితంగా పాటించాలి.

**సురక్షిత ప్రయాణం కోసం జాగ్రత్తలు :**

రాత్రివేళల్లో హైబీమ్‌ను సరిగ్గా ఉపయోగించడం.

ముందున్న వాహనానికి తగినంత దూరంలో ప్రయాణం చేయాలి.

మద్యం తాగి వాహనాలు నడపరాదు.

రాత్రి వేళల్లో అతివేగంతో వాహనాలు నడపకూడదు.

సెల్?ఫోన్?, తోటి ప్రయాణికులతో మాట్లాడుతూ డ్రైవింగ్ చేయకూడదు.

సీట్‌బెల్ట్ ధరించడం వంటి నియమాలు తప్పనిసరిగా పాటించాలి. మరమ్మతులకు గురైన వాహనాలను రోడ్లపైనే వదిలేయకుండా వెంటనే పక్కకు తొలగించాలి. ముఖ్యంగా హైవేలపై పార్కింగ్ విషయంలో అత్యంత జాగ్రత్త అవసరం.

# రాష్ట్రంలో 24.59 లక్షల ఖాతాలు ఫ్రీజ్ అయ్యే ఛాన్స్

బ్యాంకింగ్ వ్యవస్థలో మోసాలను అరికట్టడం, నకిలీ ఖాతాలను గుర్తించడం, మనీలాండరింగ్ వంటి అక్రమ కార్యకలాపాలను నివారించడం కోసం రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) 'నో యువర్ కస్టమర్' (కేవైసీ) విధానాన్ని తప్పనిసరి చేసింది. ప్రతి ఖాతాదారుడి వ్యక్తిగత వివరాలు, చిరునామా, గుర్తింపు పత్రాలు ఎప్పటికప్పుడు తాజాగా ఉండేలా బ్యాంకులు చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ఈ నేపథ్యంలో రీ-కేవైసీ పూర్తి చేయని ఖాతాలపై కఠిన చర్యలు తీసుకునేందుకు ఆర్బీఐ సూచనలు జారీ చేసింది.

**రీ-కేవైసీ చేయకపోతే ఏమవుతుందంటే?**

బ్యాంకు నుంచి కేవైసీ నవీకరణకు సంబంధించిన సమాచారం వచ్చినప్పటికీ ఖాతాదారులు స్పందించకపోతే వారి ఖాతాలపై ఆంక్షలు విధించే అవకాశం ఉంటుంది. మొదట కొన్ని లావాదేవీలను పరిమితం చేసి, అవసరమైతే పూర్తిగా ఖాతాను ఫ్రీజ్ చేసే చర్యలు తీసుకోవచ్చు. ఫ్రీజ్ అయిన ఖాతా ద్వారా నగదు ఉపసంహరణలు, డబ్బు బదిలీలు, ఇతర బ్యాంకింగ్ సేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. అందుకే బ్యాంకు నుంచి వచ్చే కేవైసీ సందేశాలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే అవసరమైన పత్రాలు సమర్పించడం మంచిది.

ఖాతాలో జరిగే లావాదేవీల స్వభావాన్ని బట్టి బ్యాంకులు ఖాతాలను మూడు రకాలుగా వర్గీకరించాలని ఆర్బీఐ సూచించింది. ఒక్కోసారి రూ.50 వేలకుపైగా తరచుగా లావాదేవీలు జరిగే ఖాతాలను 'హై రిస్క్'గా గుర్తిస్తారు. వీరి కేవైసీ వివరాలను ప్రతి రెండేళ్లకోసారి తప్పనిసరిగా నవీకరించాలి. లావాదేవీలు మోస్తరు స్థాయిలో ఉండే ఖాతాలను 'మీడియం రిస్క్'గా పరిగణించి ఎనిమిదేళ్లకోసారి కేవైసీ చేయాలి. చాలా అరుదుగా లావాదేవీలు జరిగే ఖాతాలను 'లో రిస్క్'గా గుర్తించి ప్రతి పదేళ్లకోసారి రీ-కేవైసీ పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ విధానం ద్వారా ఖాతాలపై మరింత సమర్థవంతమైన పర్యవేక్షణ సాధ్యమవుతుందని ఆర్బీఐ భావిస్తోంది. తెలంగాణలో భారీ సంఖ్యలో పెండింగ్ కేవైసీ ఖాతాలు : తెలంగాణలో 2025-26 ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి మొత్తం 24,59,248 బ్యాంకు ఖాతాలు రీ-కేవైసీ పూర్తి చేయలేదు. వీటిలో 2,88,122 ఖాతాల్లో ఎలాంటి లావాదేవీలు జరగడం లేదని అధికారులు గుర్తించారు. ఒక ప్రధాన ప్రభుత్వ రంగ బ్యాంకులోనే దాదాపు 9.99 లక్షల ఖాతాలు, మరో పెద్ద బ్యాంకులో 4.13 లక్షల ఖాతాలు రీ-కేవైసీ కోసం పెండింగ్‌లో ఉన్నట్లు సమాచారం. ఈ గణాంకాలు ఖాతాదారుల నిర్లక్ష్యాన్ని స్పష్టంగా చూపిస్తున్నాయి. కేవైసీ తాజా సమాచారం అడిగినా ఇవ్వని వారి ఖాతాల ఫ్రీజింగ్ ప్రక్రియ వేగవంతం చేయాలని రిజర్వు బ్యాంకు పేర్కొంది. ఎప్పటికప్పుడు రీ-కేవైసీ, అవసరమైతే ఖాతాల ఫ్రీజింగ్ ప్రక్రియను సమీక్షిస్తున్నట్లు తెలిపింది.

**ఖాతాదారులు చేయాల్సిందేమిటంటే?**

ఖాతాదారులు తమ ఆధార్, పాన్, చిరునామా రుజువు, ఫొటో వంటి అవసరమైన పత్రాలను ఎప్పటికప్పుడు నవీకరించాలి. బ్యాంకు నుంచి కేవైసీకి సంబంధించిన ఎస్ఎంఎస్, ఇ-మెయిల్ లేదా ఫోన్ కాల్ వచ్చినప్పుడు ఆలస్యం చేయకుండా సమీప శాఖను సంప్రదించడం మంచిది. ప్రస్తుతం అనేక బ్యాంకులు మొబైల్ యాప్, ఇంటర్నెట్ బ్యాంకింగ్, వీడియో కేవైసీ వంటి సౌకర్యాల ద్వారా కూడా రీ-కేవైసీని పూర్తి చేసే అవకాశాన్ని కల్పిస్తున్నాయి. డిజిటల్ బ్యాంకింగ్ విస్తరిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో కేవైసీ అనేది కేవలం ఒక అధికారిక ప్రక్రియ మాత్రమే కాదు, ఖాతాదారుల భద్రతకు కూడా కీలకమైన అంశం. సరైన సమయంలో రీ-కేవైసీ పూర్తి చేయడం ద్వారా ఖాతా ఫ్రీజ్ వంటి ఇబ్బందులను నివారించవచ్చు. బ్యాంకు నుంచి వచ్చే సూచనలను నిర్లక్ష్యం చేయకుండా వెంటనే స్పందించడం ద్వారా లావాదేవీలు అంతరాయం లేకుండా కొనసాగించడంతో పాటు ఆర్థిక భద్రతను కూడా కాపాడుకోవచ్చు.

## ప్రతి నెలా తనిఖీ చేస్తా

-మొదటిపేజీ తరువాయి

పురోగతిపై ఆరా తీశారు. పనులు నెమ్మదిగా జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేసిన రేవంత్ రెడ్డి ఎడ్యుకేషన్ హబ్‌లోని ప్రతి ప్రాజెక్టు పనుల పురోగతిపై నెలవారీగా నివేదిక ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. పనులను ప్రతీనెలా తనిఖీ చేస్తానని, నెలకు ఒకరోజు సైట్‌లోనే బస చేస్తానని సీఎం స్పష్టం చేశారు. విధుల్లో అలసత్వం వహించిన వారిని సస్పెండ్ చేసేందుకు సైతం వెనకాడబోనని తేల్చి చెప్పారు. ఈ ప్రాజెక్టుల కింద భూముల కోల్పోయిన రైతులకు వచ్చే వారంలోగా ప్లాట్లు ఇవ్వాలని సీఎం ఆదేశించారు.

**భూ సేకరణ పూర్తి చేయాలి**

మక్తల్-నారాయణపేట- కొడంగల్ ఎత్తిపోతల పథకానికి సంబంధించి అదనపు పంపుల ఏర్పాటుకు అవసరమైన సివిల్ పనులన్నింటినీ వర్క్ ఆర్డర్ ఇచ్చి పూర్తి చేయాలని ఆదేశించారు. భూసేకరణకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని సెప్టెంబర్ లోగా ప్రక్రియ పూర్తి చేయాలని స్పష్టం చేశారు. అవసరమైతే ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేసి భూ సేకరణ పూర్తి చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.

## రాజకీయ నాటకాలు వద్దు

కాంగ్రెస్ పార్టీ తీరుపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. పార్లమెంటు సమావేశాల వేళ సభలో చర్చల్లో పాల్గొనకుండా, ప్రధానమంత్రి నివాసం వెలుపల నిరసనల పేరుతో రాజకీయ నాటకాలకు తెరలేపడం దురదృష్టకరమని ఆయన వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో ప్రతిపక్షాల బాధ్యత పార్లమెంటులో ప్రశ్నలు అడగటం, చర్చలు జరపడమే తప్ప, సభా కార్యకలాపాలకు విఘాతం కలిగించడం కాదని ఆయన హితవు పలికారు. సభలో చర్చకు ఆస్కారం లేకుండా పదేపదే అంతరాయం కలిగిస్తూ, వాయిదాలకు కారణమవుతున్న కాంగ్రెస్, బయటకు వచ్చి ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందంటూ నాటకాలాడుతోందని కిషన్ రెడ్డి మండిపడ్డారు. ఇది బాధ్యతాయుతమైన ప్రతిపక్షం చేయాల్సిన పని కాదని, ప్రజాస్వామ్యాన్ని అస్థిరపరిచే కుట్ర అని ఆయన ధ్వజమెత్తారు. గతంలో అధికారంలో ఉన్నప్పుడు అత్యవసర పరిస్థితి (ఎమర్జెన్సీ) విధించి ప్రజాస్వామ్యాన్ని కాలరాసిన కాంగ్రెస్ పార్టీ, నేడు ప్రజాస్వామ్యం విలువల గురించి మాట్లాడటం హాస్యాస్పదమని విమర్శించారు. మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, అసోం, పుదుచ్చేరి వంటి అనేక రాష్ట్రాల ఎన్నికల్లో ప్రజలు ఇప్పటికే కాంగ్రెస్‌ను తిరస్కరించారని కిషన్ రెడ్డి గుర్తు చేశారు. ఆ పార్టీ ప్రజాసేవ కంటే రాజకీయ అవకాశవాదానికే పెద్దపీట వేస్తుందని, ప్రజలు ఇప్పటికే వారి నిజస్వరూపాన్ని గుర్తించారని ఆయన పేర్కొన్నారు. నిరసనలో భాగంగా కాంగ్రెస్ నేతలు ప్రతీకాత్మకంగా చేతులకు సంకెళ్లు వేసుకోవడంపై ఆయన ఎద్దేవా చేస్తూ, ఆ పార్టీ రాజకీయ ఆకాంక్షలకు భారత ప్రజలు ఎప్పుడో సంకెళ్లు వేశారని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌కు నిజంగా వాదనలు వినిపించాలనే చిత్తశుద్ధి ఉంటే పార్లమెంటులో చర్చకు రావాలని ఆయన సవాల్ విసిరారు. దేశానికి బాధ్యతాయుతమైన ప్రతిపక్షం అవసరమే కానీ, నిరంతరం గందరగోళం సృష్టించే ప్రతిపక్షం కాదని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు.

## వచ్చే నెల నుంచి మళ్లీ 'ఉపాధి' పనులు

-మొదటిపేజీ తరువాయి

జీ రాంజీలో 2 నెలల విరామం సాధ్యం కాదని తెలుపుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి లేఖ రాయాలని భావిస్తోంది.

**రాష్ట్రవ్యాప్తంగా జలసిరి కార్యక్రమం**

ఇదిలా ఉండగా ఎల్?నినోను ఎదుర్కొనేందుకు వీలుగా రాష్ట్రప్రభుత్వం సిద్ధం అవుతోంది. దీంట్లో భాగంగా జల సంరక్షణ పనులు పెద్దఎత్తున చేపట్టాలని అనుకుంటుంది. దీంతో జీరాంజీ పథకాన్ని పూర్తిస్థాయిలో వినియోగించుకునేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ జలసిరి కార్యక్రమాన్ని చేపడుతోంది. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి దానకిశోర్ జలసిరి నిర్వహణపై అన్ని జిల్లాల కలెక్టర్లకు ఆదేశాలు జారీచేశారు.

**నీటి సంరక్షణ, భూగర్భ జలాల పెంపు**

ఎల్‌నినో కారణంగా సంభవిస్తున్న పరిస్థితులను సమర్థంగా ఎదుర్కొనేందుకు ఈ కార్యక్రమాన్ని చేపడుతోంది. జీరాంజీ పథకం కింద నీటిసంరక్షణ, భూగర్భజలాల పెంపు, కరవు నివారణ, గ్రామీణ కుటుంబాలకు ఉపాధి కల్పించనున్నారు. దీనికి సంబంధించిన కార్యచరణను ప్రభుత్వం సిద్ధం చేసింది. దీంట్లో భాగంగా మొత్తం 9.60 లక్షల ఇంకుడు గుంతలు, 5,000 బోర్?వెల్? రీఛార్జి నిర్మాణాలు, 5,000 ఊట కుంటల నిర్మాణాలు జరపనున్నారు. 25,000 సేద్యపు కుంటలను ఇప్పటికే మహిళా రైతుల కోసం మంజూరు చేశారు. దరఖాస్తులు వస్తే వాటిని కూడా మంజూరు చేయనున్నారు.

**అక్టోబర్ వరకు 4.5 కోట్ల పని దినాలు**

జీరాంజీ పథకం జులై 1న ప్రారంభమైంది. కాగా తొలి దశలో భాగంగా అక్టోబరు వరకు 4.5 కోట్ల పనిదినాలను సృష్టించేందుకు ఇప్పటికే ప్రణాళికలు రూపొందించింది. ప్రస్తుతం ఈ పథకం కింద రోజుకు సుమారు 2.5 లక్షల మంది కూలీలకు ఉపాధి లభిస్తోంది. అయితే రాష్ట్రంలో నెలకొన్న వర్షాభావ పరిస్థితుల నేపథ్యంలో జలసిరి కార్యక్రమాన్ని చేపట్టింది. దీంతో నీటి సంరక్షణ పనులను పెద్దఎత్తున చేపట్టనున్నారు. రోజూ 5 లక్షల పనిదినాల ద్వారా ఉపాధి కల్పించేందుకు నిర్దేశించారు.

## ఎన్యూమరేషన్ ఫామ్‌ల కోసం ఆధార్ తప్పనిసరి కాదు




తెలంగాణలో ఓటర్ల జాబితా సవరణకు సంబంధించి ఎన్యూమరేషన్ ఫామ్‌లు నింపడానికి ఆధార్ కార్డు తప్పనిసరి కాదని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి (సీఈవో) సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సంక్షిప్త సవరణ ప్రక్రియపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు ఆయన ఈ ప్రకటన విడుదల చేశారు.

రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ ముమ్మరంగా సాగుతోంది. అయితే, దరఖాస్తు ఫారాలు నింపే సమయంలో ఆధార్ వివరాలు సమర్పించడం తప్పనిసరి అని కొందరు భావిస్తుండటంతో సీఈవో ఈ విషయంపై స్పష్టతనిచ్చారు. ఆధార్ కార్డు లేని కారణంగా ఏ ఒక్క అర్హుడు కూడా ఓటు హక్కును కోల్పోకూడదనే ఉద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు వెల్లడించారు.

ఆధార్ కార్డు అందుబాటులో లేని అర్హులైన పౌరులు, భారత ఎన్నికల సంఘం నిర్దేశించిన ఇతర గుర్తింపు పత్రాలను సమర్పించి ఓటర్ల జాబితాలో మార్పులు, చేర్పులు లేదా కొత్తగా నమోదు చేసుకోవచ్చని అధికారులు సూచించారు. అర్హులైన ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, ఓటరు జాబితాలో తమ వివరాలు సరిగ్గా ఉన్నాయో లేదో సరిచూసుకోవాలని కోరారు.

ఎస్ఐఆర్ 2026 కార్యక్రమంలో భాగంగా, సుదర్శన్ రెడ్డి జీహెచ్ఎంసీ కమిషనర్‌తో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న జిల్లా ఎన్నికల అధికారులతో (డీఈఓలు) వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ వారాంతం నాటికి జిల్లాల్లో ఓటర్ల గణన ప్రక్రియ కనీసం 90 శాతం పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

ఇప్పటికే ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు సమర్పించిన ఓటర్లను బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) తిరిగి భౌతిక పత్రాలు కోరకూడదని, అలాగే ఆధార్ కార్డుల కోసం ఒత్తిడి చేయవద్దని స్పష్టం చేశారు. దరఖాస్తుల సమర్పణలో ఓటర్లకు పూర్తిస్థాయిలో సహకరించాలని, వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

## నాపై నమోదైన కేసును కొట్టేయండి-హైకోర్టులో ఉదయ్ కృష్ణారెడ్డి పిటిషన్



**రాజేంద్రనగర్,జులై21(సూర్యరేఖ)**ట్రైనీ ఐపీఎస్ ఉదయ్ కృష్ణారెడ్డి హైకోర్టును ఆశ్రయించారు.తనపై అత్తాపూర్ పోలీస్ స్టేషన్లో నమోదైన కేసును కొట్టివేయాలని ఆయన పిటిషన్ దాఖలు చేశారు.పిటిషన్లో ఉదయ్ కృష్ణారెడ్డి వాదన తనపై మోపబడిన ఆరోపణలన్నీ అబద్ధాలని, కావాలనే తప్పుడు కేసు బనాయించారని ఉదయ్ కృష్ణారెడ్డి తన పిటిషన్లో పేర్కొన్నారు.చట్టంపై తనకు పూర్తి విశ్వాసం ఉందన్న ఆయన,తనపై నమోదైన కేసును రద్దుచేయాలని కోరారు.దీనిపై ఉన్నత న్యాయస్థానం బుధవారం విచారణ చేపట్టనుంది. ఉదయ్ కృష్ణారెడ్డి లైంగిక వేధింపులకు గురిచేశాడంటూ తోటి మహిళా ట్రైనీ ఐపీఎస్ ఫిర్యాదు మేరకు అత్తాపూర్ పోలీసులు కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే.ఈ ఏడాది జూన్ 23నుంచి ఉదయ్ కృష్ణారెడ్డి అసభ్యకరమైన సందేశాలు పంపుతూ లైంగికంగా వేధించడం ప్రారంభించాడని బాధితురాలు తన ఫిర్యాదులో పేర్కొన్నారు.వేరే వారితో వివాహేతర సంబంధం అంటగట్టి ప్రచారం చేయడం,బలవంతంగా మొబైల్ లాక్కొని వ్యక్తిగత మెసేజ్లు చూసి ఇబ్బందికి గురిచేశాడని ఆరోపించారు.వ్యక్తిగత వీడియోలు చిత్రీకరించి భర్తకు పంపి బెదిరింపులకు పాల్పడ్డాడని ట్రైనీ మహిళా ఐపీఎస్ పేర్కొన్నారు.

## పార్సిగుట్టలో అక్రమ కట్టడాల జోరు..టౌన్ ప్లానింగ్ మౌనంపై పలు అనుమానాలు.

నిబంధనలకు విరుద్ధంగా అదనపు అంతస్తుల నిర్మాణాలపై స్థానికుల ఆందోళన..

సెట్‌బ్యాక్‌లు లేకుండా నిర్మాణాలు..ప్రజల భద్రతపై ఆందోళన వ్యక్తం

అక్రమ నిర్మాణాలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్






**ముషీరాబాద్,జూలై21(సూర్యరేఖ)** హైదరాబాద్‌లోని ముషీరాబాద్ సర్కిల్ పరిధి పార్సిగుట్ట బాపూజీ నగర్‌లో భవన నిర్మాణ నిబంధనలను ఉల్లంఘిస్తూ అక్రమ నిర్మాణాలు యథేచ్ఛగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. అనుమతులు ఒక విధంగా తీసుకుని, నిర్మాణాలు మాత్రం మరో విధంగా చేపడుతూ అదనపు అంతస్తులు నిర్మిస్తున్నారని వారు పేర్కొంటున్నారు.పట్టణ ప్రణాళిక (టౌన్ ప్లానింగ్)అధి,కారుల కంటిముందే ఈ నిర్మాణాలు సాగుతున్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు.మున్సిపల్ నిబంధనల ప్రకారం వదలాల్సిన సెట్‌బ్యాక్‌లు పాటించకుండా పిల్లర్లు నిర్మించడం,నాణ్యతా ప్రమాణాలు, ఇంజినీరింగ్ పర్యవేక్షణ లేకుండానే భవనాలు నిర్మిస్తున్నారని ఆరోపించారు.దీంతో భవిష్యత్తులో సమీప భవనాలు,ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సాధారణ ప్రజలు చిన్న ఇల్లు నిర్మించుకోవడానికే కఠిన నిబంధనలు అమలు చేసే అధికారులు, బాపూజీనగర్‌లో బహిరంగంగా జరుగుతున్న ఉల్లంఘనలపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి,నిబంధనలు ఉల్లంఘించిన భవనాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు బాధ్యులపై కూడా చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు

# నిరసన స్వరాలు వింటారా?

పార్లమెంటు వర్షాకాల సమావేశాల తొలిరోజైన సోమవారం ఢిల్లీ ఆకాశంలో నిరసన మబ్బులు దట్టంగా అలుముకున్నాయి. రాజవీధులన్నీ వేలాది యువగళాలతో హోరెత్తాయి. పన్నెండేళ్ల బాలిక మొదలుకొని అనేకమంది యువతీయువకులు పోలీసుల లాఠీచార్జిలో గాయపడి నెత్తురోడుతున్న, విలపిస్తూ నిలదీస్తున్న దృశ్యాలు చానెళ్లలో వీక్షించటం చాలామందికి కష్టంగా తోచింది. ఈ దశాబ్ద కాలంలో దేశ రాజధాని ఎన్నడూ చూడని దృశ్యాలివి. నీట్ ప్రశ్నపత్రాల లీక్‌పై గత నెల జూన్ 6 నుంచి కాక్రోచ్ జనతా పార్టీ(సీజేపీ) చేస్తున్న ఆందోళననూ, మూడు వారాలుగా కొనసాగుతున్న నిరశనలనూ మౌనంగా వీక్షిస్తూ ఉండిపోయిన ప్రభుత్వానికి సోమవారం నాటి 'చలో సంసద్' కళ్లు తెరిపించి ఉండాలి. అందుకే కావొచ్చు... కేంద్ర ఆరోగ్యమంత్రి జేపీ నడ్డా ఉద్యమ కార్యకర్తలను చర్చలకు పిలిచారు. అక్కడేమైంది, చివరకు ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకుందన్న సంగతలా ఉంచితే ముందు వినడం పాలకులు చేయాల్సిన పని.



పదిహేనేళ్ల క్రితం అన్నా హజారే నిరశన మొదలెట్టినప్పుడు ఆనాటి యూపీఏ ప్రభుత్వం మొదట్లో పట్టించుకోకున్నా, ఆ తర్వాత కేంద్ర మంత్రులతో ప్రతినిధి బృందాన్ని పంపింది. దాన్ని సంపూర్ణంగా సమర్థించి, క్రియాశీలంగా పాల్గొని దేశవ్యాప్తంగా ఆ ఉద్యమానికి ఊపూ ఉత్సాహాన్నీ తీసుకొచ్చింది బీజేపీయే. అందుమూలంగా ఇతోధికంగా లాభపడింది కూడా. కానీ అదే పార్టీ ఆధ్వర్యంలోని ఎన్డీయే ప్రభుత్వం ఇప్పుడు నిర్లిప్తంగా ఉండి పోవటం, సమస్యను ఇంత సంక్లిష్టం చేసుకోవటం దిగ్భ్రాంతికరం. ఈ ఆందోళనలో గాయపడిన వారిలో వందమంది వరకూ రాంమనోహర్ లోహియా ఆస్పత్రిలో చికిత్సకు చేరగా వారిలో తలలు పగిలినవారూ, కాళ్లూ చేతులూ విరిగినవారూ అనేకులున్నారని జాతీయ మీడియా కథనాలు చెబుతున్నాయి. అటు 118 మంది పోలీసులు గాయాలతో ఆస్పత్రుల్లో చేరారని ఢిల్లీ పోలీసులు ప్రకటించారు.

పాలకులుగా ఎవరుండాలో ఎన్నికలు చెబితే... వారి పాలన ఎలావుందో నిరసనలు చెబుతాయి. అసమ్మతి అనేది దేశభక్తికి అత్యున్నత రూపం అంటాడు అమెరికా రాజనీతి శాస్త్ర ఆచార్యుడు హోవార్డ్ జిన్. ప్రజాస్వామ్యంలో విభేదించేందుకూ, అభిప్రాయాలు వ్యక్తం చేసేందుకూ చోటివ్వడం ప్రభుత్వాల బాధ్యత. ఆ దిశగా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావటం విపక్షాల బాధ్యత కూడా. కానీ విషాదమేమంటే ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్ ఈ కర్తవ్య నిర్వహణలో విఫలమైంది. జూన్ 17న రాజస్థాన్‌లోని కోటలో కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఒకరోజు ధర్నా చేయటం మినహా చేసిందేమీ లేదు. అన్నా హజారే ఉద్యమ సమయంలో జరిగిందేమిటో గుర్తున్నా తాను చేయాల్సిందేమిటో ఆ పార్టీకి తెలిసేది. ఆ సంగతి ఆలస్యంగా గ్రహించి మంగళవారం ప్రధాని నరేంద్ర మోదీ నివాసం సమీపంలో రాహుల్, ప్రియాంక, ఇతర కాంగ్రెస్ ఎంపీలు ధర్నా చేశారు.

ఈ ఉద్యమానికి చెప్పుకోదగ్గ నాయకులంటూ ఎవరూ లేకపోవడం గమనించదగ్గది. నిరశనలో ఉన్న సోనమ్ వాంగ్‌చుక్‌ను పోలీసులు అరెస్టుచేసి ఆస్పత్రిలో చేర్చారు. సీజేపీ నాయకుడు అభిజీత్ దీప్కేను ప్రదర్శన ప్రారంభంలోనే పోలీసులు అరెస్టు చేశారని వార్తలొచ్చాయి. కానీ దాదాపు 50,000 మంది వరకూ ఉన్న ఆందోళనకారులు గుంపులుగా విడిపోయి పార్లమెంటువైపు దూసుకెళ్లే ప్రయత్నం చేయటం, చాలావరకూ సఫలీకృతం కావటం చిన్న విషయం కాదు. పటేల్ చౌక్, జన్‌పథ్ గేటు మెట్రో స్టేషన్‌ల వద్ద, అశోకా రోడ్, కన్నాట్‌ప్లేస్ సర్కిల్ వద్ద బైఠాయింపులు, మరో అయిదుచోట్ల వారిపై బాష్ప వాయు గోళాలు ప్రయోగించటం సమస్య తీవ్రతను వెల్లడిస్తుంది.

హింసకూ, దౌర్జన్యానికీ దిగినవారిని నియంత్రించటాన్ని ఎవరూ ప్రశ్నించరు. కానీ ఒక్కరిని చేసి ఏడెనమండుగురు పోలీసులు లాఠీలతో మోదటం, ఆడపిల్లలని కూడా చూడకుండా హింసించటం సబబేనా? 'మీ ఇంట్లో పిల్లలు లేరా? ఇంత దారుణంగా కొడతారా?' అని ఒక బాలిక ప్రశ్నించటం, తన దుస్తులు చించారని మరొకామె ఆరోపించటం ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచదు. పరీక్షపత్రాలు లీకవటం, కష్టపడి చదివేవారు దగాపడటం తొలిసారి కాదు. ఏళ్లతరబడి ఇలా జరగటంవల్లే పరిస్థితి ఇంతవరకూ వచ్చింది. ఇకనైనా విద్యార్థుల అభీష్టాన్ని వినటం, సానుకూలంగా స్పందించటం ప్రభుత్వ బాధ్యత. లేకుంటే సమస్య మరింత జటిలమవుతుంది.

# సాగు నీళ్లివ్వండి కన్నీళ్లు తుడవండి

'సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రివర్గ సహచరులు గోదావరి నదిలో అస్సలు నీళ్లే లేవని ప్రజలకు పచ్చి అబద్ధాలు చెప్పారు. కానీ, ఎప్పుడైతే బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ స్వయంగా వెళ్లి నీళ్లు ఉన్నాయని చూపించారో.. వెంటనే మాట మార్చి ఎన్‌డీఎస్ఏ రిపోర్ట్ అంటూ కొత్త పాట పాడుతున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టును బాగుచేసి, ఆ నీళ్లు గనుక పొలాలకు తెస్తే..ఎక్కడ మళ్లీ కేసీఆర్‌కు మంచి పేరొస్తుందోననే కదా మీ అసలు బాధ?'

సాధారణంగా సగం పాలనాకాలం పూర్తయ్యేసరికి ఏ ముఖ్యమంత్రికైనా రాష్ట్రంలోని ప్రాజెక్టులు, నీటి లభ్యత, వ్యవసాయంపై కనీస అవగాహన వస్తుంది. కానీ.. మన రేవంత్‌రెడ్డికి మాత్రం కాళేశ్వరం, మేడిగడ్డ, కన్నెపల్లి పంప్‌హౌస్‌ల గురించి ఇప్పటికీ ఏం తెలియకపోవడం ఈ రాష్ట్ర ప్రజల దౌర్భాగ్యం. ఒక రాష్ట్రానికి సీఎంగా ఉన్న వ్యక్తి అజ్ఞానాన్ని చూసి ఇవాళ మేధావులు, సామాన్యులే కాదు.. చివరకు ఆయన పక్కన ఉండే మంత్రులు సైతం జాలితో తలదించుకుంటున్నారు. మొన్నటికి మొన్న ప్రెస్‌మీట్‌లో సీఎం మాట్లాడుతూ..మేడిగడ్డ గేట్లు మూయకుండా కన్నెపల్లి మోటర్లు ఎలా ఆన్ చేస్తారు? అంటూ ఒక విచిత్రమైన మేధావితనాన్ని ప్రదర్శించారు. ముఖ్యమంత్రికి ప్రాజెక్టుల ఇంజినీరింగ్ గురించి కనీస అవగాహన లేకుండా అజ్ఞానంతో మాట్లాడుతున్నారని పక్కనే ఉన్న సాగునీటి శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి వెంటనే అర్థమైపోయింది. దీంతో ఆయన కంగారుగా మైక్ తీసుకొని.. 'గేట్లు మూయకుండా కూడా నదిలో ప్రవహించే నీళ్లను లిఫ్ట్ చేయొచ్చు' అని సీఎం అజ్ఞానాన్ని కప్పిపుచ్చే ప్రయత్నం చేశారు. సీఎం స్థానంలో ఉన్న ఒక వ్యక్తి ఇంతటి అజ్ఞానంతో మాట్లాడటం ఎంతవరకు సమంజసమో రాష్ట్ర ప్రజానీకమే ఆలోచించాలి.ఝుఎవం ఢ =అజవతీం ఒకవైపు ఎండలు మండిపోతున్నాయి, నీళ్లు లేక పంటలు ఎండిపోతున్నాయి. 'మేడిగడ్డ రిపేరు విషయం తర్వాత... ముందుగా కన్నెపల్లి మోటార్లు నడపండి.. రైతుల పొలాల్లో నీళ్లు పారించి మమ్మల్ని కాపాడండి' అని రైతులు, బీఆర్ఎస్ నాయకులు అడిగితే.. ముఖ్యమంత్రి నోటి నుంచి వచ్చే సమాధానం విని తెలంగాణ సమాజం అంతా షాక్‌కు గురైంది. 'బీఆర్ఎస్ నాయకులను కోసి, ఆ రక్తం పొలాల మీద చల్లితే పంట పండుతది' అంటారా? ఒక రాష్ట్ర సీఎం మాట్లాడే భాషేనా ఇది? రైతులు సాగునీరు అడుగుతుంటే..రేవంత్ మాత్రం రక్తం భాష, కక్షల భాష మాట్లాడుతున్నారు.



గడిచిన రెండున్నరేండ్లుగా రేవంత్ నోట ప్రజా సంక్షేమం మాటలు సరిగా వినబడలేదు. ఎప్పుడుచూసినా సమాజాన్ని కలుషితం చేసే అరాచక పదజాలమే వినబడుతున్నది. లాగుల తొండలు ఇడుస్తా.. పండబెట్టి తొక్కుతా! పేగులు తీసి మెడలో వేసుకుంటా..బీఆర్ఎస్ నేతల రక్తం పొలాలకు పారిస్తా! బీఆర్ఎస్ గద్దెలు కూల్చేయిస్తా.. మీ కనుగుడ్లు పీకి గోటీలాడుతా! మీకు బెల్ట్ ట్రీట్‌మెంట్ ఇస్తా! అని కూడా అంటడు. ఇదా ఒక ముఖ్యమంత్రి మాట్లాడే నైతిక భాష? ప్రజలకు, రైతులకు ఏ ఒక్క మంచి పనీ చేయలేదు గనుకనే ఇవాళ ప్రభుత్వంపై రాష్ట్రం అంతటా అన్నివర్గాల్లో వ్యతిరేకత బాగా పెరిగింది.

అది తట్టుకోలేకనే సీఎం ఫ్రస్టేషన్‌తో ప్రతిపక్షాలపై బూతులు మాట్లాడుతున్నారు, అధికారులను బెదిరిస్తున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయి. రేవంత్ పాలనలో తెలంగాణలో నేరాలు పెరిగిపోయాయి. నాడు కేసీఆర్ హయాంలో ప్రశాంతంగా ఉన్న హైదరాబాద్ నగరంతోపాటుగా, తెలంగాణ పల్లెలు... నేడు గంజాయి, హత్యలు, దందాలకు కేరాఫ్‌గా మారాయి. రైతులకు నీళ్లివ్వడం చేతకాదు, యూరియా ఇవ్వడం చేతకాదు. ఈ అరాచక, పాలనను సామాన్యులు, ప్రభుత్వ అధికారులు కూడా భరించలేకపోతున్నారుూశీశ్రీఱఱఎం

'బీఆర్ఎస్ తొమ్మిదిన్నరేండ్ల పాలనలో 48 లక్షల ఎకరాలకు కొత్తగా సాగునీరు అందించింది కేసీఆర్ కదా? మరి రేవంత్ రెండున్నరేండ్ల పాలనలో కనీసం ఒక్క ఎకరానికైనా కొత్తగా నీళ్లు ఇచ్చారా? 'గురుదక్షిణ కింద ఆంధ్రప్రదేశ్‌కు మన తెలంగాణ నీళ్లను అప్పనంగా వదిలేస్తున్నది ఇదే రేవంత్‌రెడ్డి కాదా?' 'మన నీళ్లను ఎందుకు వదిలేస్తున్నారు? సీఎంని ఇక్కడ నిలదీసేవాళ్లు, అడిగేవాళ్లు ఎవరూ లేరనుకున్నారా? ఎంతకాలం ఈ తప్పుడు ప్రచారాలు, దొంగ డ్రామాలు ఆడుతారు? ఇంకెంతకాలం రైతులను మాయచేస్తారు? తమ స్వార్థ రాజకీయాల కోసం ఇంకెంతకాలం రైతులను తప్పుదోవ పట్టిస్తారు? మొన్నటిదాకా రిటైర్డ్ ఇంజినీర్లను గొప్ప నిపుణులంటూ సీఎం ఆకాశానికెత్తారు.

కానీ, ఎప్పుడైతే అదే నిపుణులు కాళేశ్వరం నుంచి నీళ్లు వదలాలని సూచించారో.. వెంటనే మాట మార్చి వారిని జైల్లో పెడతానని బెదిరిస్తున్నారు. నిజాలు మాట్లాడినందుకు వారు ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీకి లొంగిపోయారని ఆరోపణలు చేస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. తెలంగాణ రాకముందు.. ఉమ్మడి రాష్ట్రంలో పదేండ్ల కాంగ్రెస్ పాలనలో కేవలం 6 లక్షల 64 వేల ఎకరాలకు మాత్రమే నీళ్లిచ్చారనే వాస్తవాన్ని మర్చిపోయారా? అదే బీఆర్ఎస్ పాలనలో.. ఏకంగా 48 లక్షల 74 వేల ఎకరాలకు రికార్డు స్థాయిలో సాగునీరు అందించామనే విషయాన్ని గుర్తుంచుకోవాల్సిన అవసరం ఉన్నది. ఇప్పటికైనా ముఖ్యమంత్రి స్పందించి కన్నెపల్లి, దేవాదుల మోటర్లను వెంటనే ఆన్ చేసి, యుద్ధప్రాతిపదికన నీళ్లను విడుదల చేయాలి. రైతులను కరువు బారి నుంచి తక్షణమే కాపాడాలి. లేనిపక్షంలో బాధ్యత గల ప్రతిపక్షంగా.. బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని రైతులందరినీ ఏకం చేస్తాం, కాంగ్రెస్ ప్రజా వ్యతిరేక విధానాలపై రాజీలేని పోరాటం చేస్తాం. మిమ్మల్ని ప్రజల ఎదుట దోషిగా నిలబెడతాం.. అన్నదాతల కడుపు మంట, ప్రజల ఆగ్రహం ఈ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గద్దె దించడం ఖాయం!

# క్షయవ్యాధిపై అప్రమత్తతే నివారణకు మార్గం..

మందులతో పాటు పౌష్టికాహారం తీసుకుంటే క్షయ వ్యాధి పూర్తిగా నయం..

వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి

మరిపెడ పీహెచ్‌సీలో 26మంది టీబీ రోగులకు పోషణ కిట్ల పంపిణీ..

మండల వ్యాప్తంగా 45కఫం నమూనాల సేకరణ..

ముందస్తు గుర్తింపుపై ప్రత్యేక దృష్టి..







**మరిపెడ,జూలై 21(సూర్యరేఖ)** క్షయవ్యాధిపై ప్రజలు అప్రమత్తంగా ఉంటేనే వ్యాధిని ప్రారంభ దశలో గుర్తించి పూర్తిగా నయం చేయవచ్చని మరిపెడ పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి అన్నారు.మహబూబాబాద్ జిల్లా కలెక్టర్,జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారుల ఆదేశాల మేరకు కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న టీబీ ముక్త్ భారత్ (క్షయ రహిత భారత్)కార్యక్రమంలో భాగంగా మంగళవారం మరిపెడ పీహెచ్‌సీలో టీబీ నిర్ధారణ అయిన 26 మంది రోగులకు డాక్టర్ గుగులోత్ రవి ఆధ్వర్యంలో పోషణ కిట్లను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ...క్షయవ్యాధి పూర్తిగా నయం అయ్యే వ్యాధి అని,ప్రజలు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా వైద్యులు సూచించిన విధంగా మందులను క్రమం తప్పకుండా వాడాలని సూచించారు.మందులతో పాటు ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని తీసుకోవడం వల్ల రోగనిరోధక శక్తి పెరిగి త్వరగా కోలుకునే అవకాశం ఉంటుందని తెలిపారు.చికిత్సను మధ్యలో నిలిపివేయడం వల్ల వ్యాధి మళ్లీ తీవ్రరూపం దాల్చే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.టీబీ నిర్మూలనలో ముందస్తు గుర్తింపు అత్యంత కీలకమన్నారు.మరిపెడ మండలంలోని వివిధ గ్రామాల నుండి అనుమానితుల యొక్క45కఫం (స్ఫూటం)నమూనాలను సేకరించినట్లు తెలిపారు.రెండు వారాలకు పైగా దగ్గు,జ్వరం,బరువు తగ్గడం,రాత్రిపూట చెమటలు పట్టడం వంటి లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయకుండా సమీప ప్రభుత్వ ఆసుపత్రిలో పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్ రవి సూచించారు.ఈ కార్యక్రమంలో పీహెచ్ఎన్ మంగమ్మ,హెల్త్ సూపర్‌వైజర్లు ఆచార్యులు,లక్ష్మీకుమారి,టీబీ ఎస్‌టీఎల్ఎస్ సందీప్,హెల్త్ అసిస్టెంట్లు వీరయ్య,నర్సయ్య,ఆశా ఆరోగ్య కార్యకర్తలు,వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలి ..

ఎస్ఎఫ్ఐ,తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం, సిఐటియు,రైతు సంఘం

**ఖమ్మం,జులై21(సూర్యరేఖ)**నీట్ ప్రశ్నాపత్రం లీకేజీ వ్యవహారంపై న్యాయం కోరుతూ శాంతియుతంగా ఢిల్లీలో పార్లమెంట్ మార్చ్ నిర్వహించిన విద్యార్థులు,యువజన సంఘాలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అమానుషమని రైతు సంఘం జిల్లా నాయకులు శీలం సత్యనారాయణ రెడ్డి,వ్యవసాయ కార్మిక సంఘం సత్తుపల్లి డివిజన్ అధ్యక్షులు తన్నీరు కృష్ణార్జునరావు,ఎస్ఎఫ్ఐ కార్యదర్శి భాను శ్రీకర్,లు తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రముఖ పర్యావరణవేత్త సోనం వాంగ్ చుక్ చేపట్టిన దీక్షకు, యువత చేపట్టిన ఉద్యమానికి సంఘీభావం తెలుపుతూ మంగళవారం విద్యార్థి,ప్రజాసంఘాల ఆధ్వర్యంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ముందు విద్యార్థులతో కలిసి నిరసన వ్యక్తం చేయడం జరిగింది.నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్ఐటి)నీ వెంటనే రద్దు చేయాలని,విద్యార్థులపై పెట్టిన కేసులను వెంటనే ఎత్తివేయాలని,లాఠీచార్జికి బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... విద్యార్థులు తమ భవిష్యత్తుకు సంబంధించిన న్యాయమైన డిమాండ్లతో శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తుంటే వారి గొంతులను అణిచివేసేందుకు పోలీసులు లాఠీచార్జ్ చేయటం,భాష వాయువు గోళాలు ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమన్నారు.నీట్ పరీక్షల నిర్వహణలో జరిగిన అవకతవకల వల్ల 22లక్షల మంది విద్యార్థులు వారి కుటుంబాలు తీవ్ర మానసిక ఆందోళనకు గురయ్యారని అన్నారు.20మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకోవటం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు.మోడీ ప్రభుత్వం దిగిరాకుంటే ఆందోళనలు మరింత ఉద్మృతం చేస్తామని మోడీ ప్రభుత్వాన్ని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు తాళ్ల వెంకటేశ్వరరావు,ఎస్ఎఫ్ఐ నాయకులు రామ్ చరణ్, సానియా,మనీషా,పూజిత,అమన్,శ్రీనివాస్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.




## యువతపై లాఠీ ఛార్జ్ అమానుషం..!

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ రాజీనామా చేయాలి..

కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య




**మరిపెడ,జూలై 21(సూర్యరేఖ)** ఢిల్లీలో పార్లమెంట్ ముట్టడి కార్యక్రమాని కి వచ్చిన యువత,విద్యార్థులపై జరిగిన లాఠీచార్జ్, బాష్పవాయు ప్రయోగం, ఘర్షణలు ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని కెవిపిఎస్ మహ బూబాబాద్ జిల్లా ఉపాధ్యక్షులు జిన్నా లచ్చయ్య తీవ్రంగా ఖండించారు. మంగళవారం మండలంలోని అబ్బాయిపాలెం గ్రామంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ...నీట్ సహా పలు పోటీ పరీక్షల్లో జరిగిన అవకతవకలు ,ప్రశ్నాపత్రాల లీకేజీలపై బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ యువజన,విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఢిల్లీలో కార్యక్రమం నిర్వహించగా,పోలీసులు అడ్డుకోవడంతో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయని పేర్కొన్నారు.ఈ ఘటనలో పోలీసులు లాఠీచార్జ్,బాష్పవాయు ప్రయోగం చేయడంతో పలువురు విద్యార్థుల తోపాటు పోలీసు సిబ్బంది కూడా గాయపడినట్లు తెలిపారు.ఢిల్లీలో నిరసనకారులపై బలప్రయోగం చేశారని, మహిళా విద్యార్థులపై సైతం మగ పోలీసులు తీవ్రంగా దాడి చేయడం చట్ట విరుద్ధమని ఆరోపిస్తున్నారు.గత కొన్ని వారాలుగా జంతర్‌మంతర్ వద్ద పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్ నిరాహార దీక్షకు మద్దతుగా యువత పెద్దఎత్తున ఉద్యమంలో పాల్గొంటున్నారని, ప్రజాస్వామ్యబద్ధంగా తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్న యువతతో ప్రభుత్వం చర్చలు జరపకుండా బలప్రయోగానికి దిగడం బాధాకరమని అన్నారు.దేశ భవిష్యత్తైన యువత ఉద్యోగాలు,పారదర్శక పరీక్షల నిర్వహణ,విద్యా వ్యవస్థలో ఉన్న లోపాలను సవరించాలని కోరుతూ పోరాడుతుంటే వారి సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారి గొంతు నొక్కే చర్యలకు పాల్పడడం సరైన విధానం కాదన్నారు.ఈ కార్యక్రమంలో కెవిపిఎస్ నాయకులు పాల్గొన్నారు.

## ఢిల్లీలో విద్యార్థులపై లాఠీచార్జ్‌ను ఖండించిన ఎంసీపీఐయూ పార్టీ




**బెల్లంపల్లి,జూలై21(సూర్యరేఖ)**ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద నిర్వహించిన చలో పార్లమెంట్ కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, యువతపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఎంసీపీఐయూ పార్టీ తీవ్రంగా ఖండించింది.ఈ మేరకు బెల్లంపల్లిలోని పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో జిల్లా సహాయ కార్యదర్శి పసులేటి వెంకటేష్ మాట్లాడారు.విద్యార్థులు శాంతియుతంగా ఆందోళన చేపట్టినప్పటికీ,వారి సమస్యలను పరిష్కరించే బదులు బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. విద్యార్థుల డిమాండ్లపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి, వారి ప్రతినిధులతో చర్చలు జరపాలని కోరారు.ప్రశ్నించే హక్కు ప్రతి పౌరుడికి రాజ్యాంగం కల్పించిన హక్కు అని,దానిని అణచివేయడం సరైంది కాదన్నారు.విద్యార్థులపై జరిగిన ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.సమావేశంలో బెల్లంపల్లి పట్టణ కార్యదర్శి ఆరెపల్లి రమేష్,ఆరెపల్లి సతీష్ వంశీ,తదితరులు పాల్గొన్నారు.

## వర్ష ప్రభావిత ప్రాంతాల్లో కమిషనర్ తన్నీరు రమేష్ విస్తృత పర్యటన..



**బెల్లంపల్లి,జూలై21(సూర్యరేఖ)**బెల్లంపల్లిలో రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షం నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ మంగళవారం ఉదయం పట్టణంలోని పలు వార్డుల్లో విస్తృతంగా పర్యటించి పరిస్థితులను ప్రత్యక్షంగా పరిశీలించారు.వర్షపు నీరు నిలిచిన ప్రాంతాలు,కాలువల ప్రవాహం,రహదారుల పరిస్థితి, పారిశుద్ధ్య నిర్వహణను క్షుణ్ణంగా పరిశీలిస్తూ అధికారులకు అవసరమైన సూచనలు చేశారు.వర్షాల కారణంగా ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని,నీటి నిల్వలు కనిపించిన వెంటనే తొలగించేలా ప్రత్యేక బృందాలు పనిచేయాలని కమిషనర్ ఆదేశించారు. కాలువల్లో చెత్త పేరుకుపోయిన ప్రాంతాలను వెంటనే శుభ్రం చేసి వర్షపు నీరు సాఫీగా వెళ్లేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులపై తక్షణమే స్పందించి సమస్యలను పరిష్కరించాలని సంబంధిత సిబ్బందిని ఆదేశించారు.ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యం ఇస్తూ వర్ష పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నామని కమిషనర్ తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో మున్సిపల్ సిబ్బంది అందుబాటులో ఉండి సేవలు అందించాలని, ఎలాంటి నిర్లక్ష్యానికి తావు ఇవ్వొద్దని స్పష్టం చేశారు.

## నెన్నెల,కుండపోత వర్షానికి కుప్పకూలిన ఇల్లు.. తృటిలో తప్పిన ప్రాణాపాయం



**బెల్లంపల్లి,జూలై21 (సూర్యరేఖ)** నెన్నెల మండలం కొనంపేటలో సోమవారం రాత్రి కురిసిన కుండపోత వర్షానికి రాంటెంకి జైరాం గూనపెంకుల ఇల్లు కుప్పకూలింది.ఘటనలో ఇంట్లో ఉన్న టేబుల్, ధాన్యం,కందులు, జొన్నలు,టీవీ,గ్యాస్ సిలిండర్‌తో పాటు ఇతర గృహోపకరణాలు దెబ్బతిని భారీ నష్టం వాటిల్లింది.ప్రమాదం జరిగిన సమయంలో కుటుంబ సభ్యులు ఇంట్లో లేకపోవడంతో తృటిలో ప్రాణాపాయం తప్పింది.విషయం తెలుసుకున్న స్థానికులు సంఘటన స్థలాన్ని పరిశీలించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.ప్రభుత్వం వెంటనే స్పందించి బాధిత కుటుంబానికి తక్షణ ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి..

వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి

బాల వికాస సంస్థ ఆధ్వర్యంలో మరిపెడలో ఉచిత వైద్య శిబిరం..

సుమారు 150మందికి ఆరోగ్య పరీక్షలు..ఉచితంగా మందుల పంపిణీ..





**మరిపెడ,జూలై 21(సూర్యరేఖ)** వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వేగంగా వ్యాపించే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండి వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాలను కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలని మరిపెడ ప్రభుత్వ వైద్యాధికారి డాక్టర్ గుగులోత్ రవి అన్నారు. మంగళవారం మరిపెడ గ్రామంలో బాలవికాస సంస్థ ఆధ్వర్యంలో ఉచిత ఆరోగ్య శిబిరం ఏర్పాటు చేశారు.ఈ శిబిరానికి డాక్టర్ గుగులోత్ రవి,డాక్టర్ కిరణ్ కుమార్ హాజరై ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు.ఈ సందర్భంగా డాక్టర్ గుగులోత్ రవి మాట్లాడుతూ...వర్షాకాలంలో వైరల్ జ్వరాలు,డెంగ్యూ,మలేరియా,టైఫాయిడ్ వంటి వ్యాధులు ప్రబలే ప్రమాదం ఎక్కువగా ఉంటుందని తెలిపారు.ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూసుకోవడం,దోమల నివారణ చర్యలు చేపట్టడం,మరిగించిన నీటిని తాగడం,పోషకాహారం తీసుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని సూచించారు.శిబిరంలో సుమారు 150 మందికి ఉచిత ఆరోగ్య పరీక్షలు నిర్వహించి రోగులకు అవసరమైన మందులను ఉచితంగా పంపిణీ చేయడంతో పాటు ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు.రక్తపోటు,మధుమేహం తదితర సాధారణ ఆరోగ్య పరీక్షలు కూడా నిర్వహించి,తగిన వైద్య సలహాలు అందించారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగమణి,బాల వికాస సంస్థ సెంటర్ మేనేజర్ గంధసిరి ఉపేంద్ర,సహ కోఆర్డినేటర్లు జుజ్జూరి ఉపేంద్ర,గుగులోత్ కవిత,ఆశ కార్యకర్తలు శ్రీదేవి,అనసూర్య,వినోద్,గ్రూప్ సభ్యులు,మహిళలు,గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ఈతమొక్కలు నాటిన ప్రొహిబిషన్ ఎక్సైజ్ శాఖ





**కామారెడ్డి,జూలై21(సూర్యరేఖ)** వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా కామారెడ్డి జిల్లా ప్రొహిబిషన్‌డఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో కామారెడ్డి మండలంలోని చిన్న మల్లారెడ్డి గ్రామంలో ఈతమొక్కల నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి జిల్లా ప్రొహిబిషన్ డఎక్సైజ్ అధికారి ముకుంద్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఈతమొక్కలను నాటారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...పర్యావరణ పరిరక్షణ, పచ్చదనం పెంపొందించడం,భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ప్రభుత్వం చేపడుతున్న వనమహోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడంలో ప్రజలందరూ భాగస్వాములు కావాలని,నాటిన ప్రతి మొక్కను సంరక్షించడం ద్వారా పర్యావరణ పరిరక్షణకు తమ వంతు సహకారం అందించాలని పిలుపునిచ్చారు. అలాగే,రాష్ట్రంలో ఈత చెట్ల పెంపకం గౌడ కుల వృత్తిదారుల జీవనోపాధికి ఎంతో ఉపయోగకరమని, ఈతమొక్కల పెంపకాన్ని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతో పాటు గ్రామీణ జీవనోపాధికి కూడా తోడ్పాటు అందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఎస్ అరుణ్ చంద్ర,సర్కిల్ ఇన్‌స్పెక్టర్ సంపత్ కృష్ణ,సబ్ ఇన్‌స్పెక్టర్లు విక్రమ్ కుమార్,శ్రీనివాసరావు,ఏపీఓ అన్నపూర్ణ,హెడ్ కానిస్టేబుళ్లు జాన్, ఫరీద్,కానిస్టేబుళ్లు ఘోరీ,రాజు, దినేష్,శరత్,పవన్,బాబుతో పాటు గ్రామ సర్పంచ్ భీమయ్యల లక్ష్మీరాజు,ఉపసర్పంచ్ లక్ష్మీ నారాయణ,మార్కెట్ కమిటీ చైర్మన్ రాజుగౌడ్,గౌడ సంఘం అధ్యక్షుడు ధర్మగోని కిషన్ గౌడ్,ట్రెజరర్ రాజేందర్ గౌడ్,సంఘ సభ్యులు శ్రీకాంత్ గౌడ్,రాజాగౌడ్ ,అంజాగౌడ్, శ్యామగౌడ్, ప్రశాంత్ గౌడ్,నర్సాగౌడ్ తదితరులు పాల్గొని ఈతమొక్కలను నాటి కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# వెంకటసాయినగర్ కాలనీ సీసీ రోడ్లకు ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి చొరవ..

కాలనీ సమస్యలపై వినతిపత్రం అందజేసిన కాలనీ అధ్యక్షుడు ఏ.విజయేందర్ రెడ్డి



**రామంతపూర్,జూలై21(సూర్యరేఖ)** వెంకటసాయినగర్ కాలనీలో పెండింగ్‌లో ఉన్న సీసీ రోడ్లను తక్షణమే మంజూరు చేసి నిర్మాణ పనులు చేపట్టాలని కోరుతూ కాలనీ అధ్యక్షుడు, ఏ. విజయేందర్ రెడ్డి ఉప్పల్ ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా విజయేందర్ రెడ్డి కాలనీలోని పలు అంతర్గత వీధులు ఇప్పటికీ మట్టి రోడ్లుగానే ఉండటంతో స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.వర్షాకాలంలో రోడ్లు పూర్తిగా బురదమయంగా మారి చిన్నారులు,వృద్ధులు, మహిళలు నిత్యావసర పనుల కోసం బయటకు వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. అత్యవసర పరిస్థితుల్లో అంబులెన్స్,అగ్నిమాపక వాహనాలు,ఇతర సేవా వాహనాలు కాలనీలోకి సులభంగా చేరుకోలేని పరిస్థితి నెలకొన్నదని వివరించారు.అదేవిధంగా రోడ్లు సరిగా లేకపోవడంతో దుమ్ము, బురద కారణంగా ప్రజల ఆరోగ్యంపై కూడా ప్రతికూల ప్రభావం పడుతోందని పేర్కొన్నారు. కాలనీలో నివసిస్తున్న వందలాది కుటుంబాలు సంవత్సరాలుగా సీసీ రోడ్ల కోసం ఎదురుచూస్తున్నాయని తెలిపారు. వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే బండారు లక్ష్మారెడ్డి సమస్యను సానుకూలంగా పరిశీలించి వెంటనే స్పందించారు. కాలనీలో సీసీ రోడ్ల పనులకు సంబంధించిన ప్రతిపాదనలను వేగవంతం చేయాలని కోరుతూ సంబంధిత జోనల్ కమిషనర్‌కు వాట్సాప్ ద్వారా తన సిఫారసు లేఖను పంపించారు.కాలనీ మొత్తం రోడ్లకు సమగ్ర ఎస్టిమేషన్‌ను త్వరితగతిన పూర్తి చేసి, పరిపాలనా అనుమతులు మంజూరు చేసేలా అవసరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు.ప్రజలకు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వ ప్రాధాన్యత అని ఎమ్మెల్యే పేర్కొంటూ,కాలనీలోని ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని హామీ ఇచ్చారు.సంబంధిత శాఖల అధికారులతో సమన్వయం చేసి సీసీ రోడ్ల మంజూరు ప్రక్రియను వేగవంతం చేసేలా ప్రత్యేకంగా పర్యవేక్షిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ సీనియర్ నాయకులు గంధం నాగేశ్వరరావు,ఎండి జాంగిర్,కాలనీ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## జంతర్ మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్యంపై దాడి..

జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి



**ఉప్పల్,జూలై21(సూర్యరేఖ)** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని ఉప్పల్ నియోజకవర్గ సీనియర్ కాంగ్రెస్ నాయకుడు జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి తీవ్రంగా ఖండించారు.జంతర్ మంతర్ ప్రాంతంలో నిరసనల సందర్భం గా పోలీసులు లాఠీచార్జ్‌కు దిగినట్లు జాతీయ మీడియా నివేదించింది.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...విద్యార్థుల సమస్యలను పరిష్కరిం చాల్సిన ప్రభుత్వం వారిపై బలప్రయోగానికి పాల్పడటం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.ప్రజల గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని,విద్యార్థుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం వెంటనే చర్చలు జరిపి సానుకూల నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు.లాఠీచార్జ్‌కు బాధ్యులైన అధికారులపై తక్షణ చర్యలు తీసుకోవాలని,గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్యం అందించి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.విద్యార్థులు దేశ భవిష్యత్తుకు మూలస్తంభాలని,వారి సమస్యలను అణచివేతతో కాకుండా చర్చల ద్వారా పరిష్కరించడం ప్రభుత్వ బాధ్యత అని జనుంపల్లి వెంకటేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.

## “సర్” ప్రక్రియ సాఫీగా సాగేలా సహాయ కేంద్రాలు పని చేయాలి..

కాంగ్రెస్ శ్రేణులకు మందుముల రజిత పరమేశ్వర్ రెడ్డి పిలుపు




**ఉప్పల్,జూలై21(సూర్యరేఖ)** సర్ ప్రక్రియ సాఫీగా,వేగవంతంగా సాగేలా ప్రతి కాంగ్రెస్ కార్యకర్త పని చేయాలని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి పేర్కొన్నారు.ఉప్పల్ కచ్చిర్ స్కూల్ వద్ద కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు ఈగ ఆంజనేయులు ముదిరాజ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సర్ సహాయ కేంద్రాన్ని ఉప్పల్ డివిజన్ మాజీ కార్పొరేటర్ మందుముల రజితపరమేశ్వర్ రెడ్డి మంగళవారం పరిశీలించారు.నిజమైన ఓటర్లకు సర్ ప్రక్రియతో ఎలాంటి నష్టం లేకుండా చూడాలని ఈ సందర్భంగా రజిత పరమేశ్వర్ రెడ్డి అన్నారు.బీఎల్ఓతో సమన్వయం చేసుకుంటూ ఓటర్లకు సేవలు అందించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఈగ ఆంజనేయులు ముదిరాజ్, బజారు జగన్నాథ్ గౌడ్,తుమ్మల దేవిరెడ్డి,సల్లా ప్రభాకర్ రెడ్డి,మంద మురళికృష్ణరెడ్డి,మాశెట్టి రాఘవేందర్,భూత్కూరి మదన్ గౌడ్,కన్నమైన నరేష్,భాస్కర్ రెడ్డి,గోరిగ మహేష్.అలుగుల అనిల్. బచ్చా రాము,రాంరెడ్డి,రంగుల శేఖర్,ముదిగొండ రవి,ప్రశాంత్ రెడ్డి,మినంపల్లి కిషోర్,చంద్రశేఖర్ రెడ్డి,విజయ్,ఆసిఫ్,బట్కిరి కుమార్,తైసిన్, మోసిన్, అతిఫ్,వహీద్ మరియు ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## వరి సాగు తగ్గించి ప్రత్యామ్నాయ పంటల వైపు మళ్లండి..

వ్యవసాయశాఖ విజ్ఞప్తి



**నిజాంపేట, జూలై21(సూర్యరేఖ)**ఎల్ నినో ప్రభావం నేపథ్యంలో సంభవించే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు వరి సాగును తగ్గించి ,ప్రత్యామ్నా య పంటలైన కందులు, మినుములు ,పెసలు, ఆముదం సాగును పెంచుకోవాలని వ్యవసాయశాఖ అధికారులు విజ్ఞప్తి చేశారు.ఒక ఎకరం వరి సాగుకు సుమారు 1,200 మిల్లీమీటర్ల నీరు అవసరమవుతుందని,అదే నీటి వనరుతోపై పేర్కొన్న ప్రత్యామ్నాయ పంటలను 2 నుంచి 3ఎకరాల వరకు సాగు చేయవచ్చని తెలిపారు.ఎల్ నినో పరిస్థితులు కొనసాగితే భూగర్భ జలాలు మరింత తగ్గే అవకాశం ఉందని,దీంతో వరి పంట అత్యవసర దశ (క్రిటికల్ స్టేజ్)లో నీటి కొరతను ఎదుర్కొని దిగుబడులు గణనీయంగా తగ్గే ప్రమాదం ఉందన్నారు.అందువల్ల రైతులు తమ అనుభవాన్ని ఉపయోగించి రాబోయే వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళికలు రూపొందించి,తక్కువ నీటితో సాగు చేయగల ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవడం ద్వారా నష్టాలను నివారించాలని వ్యవసాయశాఖ సూచించింది.

# కబ్జా కోరల్లో హైదర్ చెరువు..







### రియల్ ఎస్టేట్ వ్యాపారి ఇష్టారాజ్యం..!

**నిజాంపేట,జూలై21(సూర్యరేఖ)** ప్రభుత్వ ఆస్తులను పరిరక్షించాల్సిన అధికారుల నిర్లక్ష్యం ఆక్రమణదారులకు వరంగా మారిందనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి.నిజాంపేట మండలం నార్లాపూర్ శివారులోని హైదర్ చెరువు కబ్జాదారుల కోరల్లో చిక్కుకుపోతోందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.గ్రామస్థుల కథనం ప్రకారం,ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి చెరువు పరిధిలో యథేచ్ఛగా మట్టి నింపడం,స్థలాలను చదును చేయడం వంటి పనులు చేపడుతున్నారని ఆరోపిస్తున్నారు.ఇరిగేషన్ శాఖ అధికారులు నిర్వహించిన పరిశీలనలో సుమారు 5ఎకరాల వరకు చెరువు భూమి ఆక్రమణకు గురైనట్లు గుర్తించినట్లు సమాచారం..చెరువు హద్దులను




చెరిపేస్తూ ప్రభుత్వ భూమిని ప్రైవేటు స్థలంగా మార్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని గ్రామస్థులు ఆరోపించారు. చెరువుల పరిరక్షణపై ప్రభుత్వం పెద్దఎత్తున ప్రచారం చేస్తున్నప్పటికీ,క్షేత్రస్థాయిలో మాత్రం ఆక్రమణలు నిరాటంకంగా కొనసాగుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఈ విషయంపై స్పందించిన రెవెన్యూ,ఇరిగేషన్ అధికారులు కబ్జాకు గురైన భూమిని పరిశీలించి,నిబంధనల ప్రకారం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. హైదర్ చెరువుకు పూర్తి స్థాయి సర్వే నిర్వహించి, హద్దులను నిర్ధారించి,ఆక్రమణలను తొలగించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకుంటామని అధికారులు వెల్లడించారు.

**అంజయ్య,రైతు నార్లాపూర్..**

హైదర్ చెరువుతో పాటు చుట్టుపక్కల రైతుల పొలాలను కూడా రియల్ ఎస్టేట్ వ్యాపారి వెంకటరమణారెడ్డి ఆక్రమించేందుకు ప్రయత్నిస్తూ, ప్రశ్నించిన రైతులను బెదిరిస్తున్నారని అంజయ్య ఆరోపించారు.తమ పొలం విషయంలో ప్రశ్నించగా దురుసుగా ప్రవర్తించాడని,సంబంధిత అధికారులు స్పందించి తమకు న్యాయం చేయాలని ఆయన కోరారు.

## చల్మెడలో ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించిన తహసీల్దార్ శ్రీనివాస్



**నిజాంపేట,జూలై21(సూర్యరేఖ)** మండల పరిధిలోని చల్మెడ గ్రామంలో మంగళవారం తహసీల్దార్ శ్రీనివాస్ ఎస్ఐఆర్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ ప్రక్రియ పురోగతిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఇంకా ఎస్ఐఆర్ పూర్తి చేయని అర్హుల నుంచి దరఖాస్తులను త్వరితగతిన స్వీకరించి,ప్రక్రియను పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు.ప్రభుత్వం నిర్దేశించిన గడువులోగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేసి నివేదిక సమర్పించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మల్లేశం,ఉపసర్పంచ్ ఆకుల మహేందర్, కార్యదర్శి శ్యామల,కరో బార్ రమేష్, పాల్గొన్నారు.

## మల్లవ్వకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కు అందజేత..



**నిజాంపేట,జూలై21(సూర్యరేఖ)**మండల పరిధిలోని రాంపూర్ గ్రామానికి చెందిన దొంతర పోయిన మల్లవ్వ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో,ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ రావు చొరవతో సీఎం రిలీఫ్ ఫండ్ కింద రూ.38,500ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా రాంపూర్ మాజీ సర్పంచ్ జె.లక్ష్మణ్ గౌడ్,గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు అనుప్ రాజు, వైస్ ప్రెసిడెంట్ రాములు,ఎండీ సులేమాన్,కన్న తిరుపతి గౌడ్,యాడారం చంద్రగౌడ్,ఎండీ హుస్సేన్ సాబ్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారాసీత్లాభవాని పూజలో పాల్గొన్న కాంగ్రెస్ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి



**హబ్సిగూడ,జూలై21(సూర్యరేఖ)**వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు బాగా పండాలని, పశుసంపద వృద్ధి చెందాలని,ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షిస్తూ బంజారా గిరిజనులు నిర్వహించే సీత్లాభవాని పూజలు హబ్సిగూడలో ఘనంగా జరిగాయి.హబ్సిగూడ వెలుగుగుట్టలోని శ్రీసీత్లాదేవి ఆలయంలో నిర్వహించిన ఈ పూజా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హబ్సిగూడ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు కంది శ్రవణ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా బంజారా సోదరులు ఆయనకు శాలువాతో ఘన స్వాగతం పలికారు.అనంతరం కంది శ్రవణ్ కుమార్ రెడ్డి కొబ్బరికాయ కొట్టి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి ఆశీస్సులు పొందారు.అలాగే గిరిజనుల సాంప్రదాయ నృత్యాలను తిలకిస్తూ వారి సంస్కృతి, సంప్రదాయాలను అభినందించారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్టీ సెల్ అధ్యక్షుడు గణేష్ నాయక్,సీనియర్ నాయకులు మాలు నాయక్,రాజు నాయక్,యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు వాసునాయక్, గుండు రాజన్న,సుమన్ నాయక్‌తో పాటు బంజారా గిరిజన సోదర సోదరీమణులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఓటరు జాబితాలో ప్రతి అర్హుడి పేరు నమోదయ్యేలా కృషి..

### మాదాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ నగేష్




**శేరిలింగంపల్లి,జులై21 (సూర్యరేఖ)**మాదాపూర్ డివిజన్ శేరిలింగంపల్లి నియోజకవర్గం పరిధిలో నిజమైన ఓటర్ల హక్కులను పరిరక్షించే సూత్రాలకు కట్టుబడి,ఎన్యూమరేషన్ ఫారమ్ నమోదు శాతాన్ని 100 శాతానికి పెంచడానికి పూర్తిస్థాయిలో కృషి చేస్తున్నామని మాదాపూర్ డివిజన్ ప్రెసిడెంట్ నగేష్ తెలిపారు.మంగళవారం ఆయన ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ...ఎన్యూమరేషన్ ఫారమ్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవాలని కోరారు. మాదాపూర్ డివిజన్ వార్డు కార్యాలయంలో అధికారులు అందుబాటులో ఉన్నారని,ఫారమ్‌లను నింపడంలో మీకు సహాయపడేందుకు బిఎల్వోలు అందుబాటులో ఉంటారని తెలిపారు.

## నగరం గ్రామానికి ప్రత్యేక ఫీడర్ లైన్ ఏర్పాటుకు స్థల పరిశీలన..




**నిజాంపేట,జూలై21(సూర్యరేఖ)** మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి నగరం గ్రామానికి ప్రత్యేక ఫీడర్ లైన్ ఏర్పాటు చేయనున్న నేపథ్యంలో విద్యుత్ శాఖ ఏఈ గణేష్, నగరం గ్రామ సర్పంచ్ చలిమెట్టి నరేందర్ ఆధ్వర్యంలో విద్యుత్ స్తంభాల ఏర్పాటుకు అవసరమైన స్థలాలను పరిశీలించారు.గ్రామానికి నిరంతరాయంగా,నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు ఈ ప్రత్యేక ఫీడర్ లైన్ ఉపయోగపడుతుందని అధికారులు తెలిపారు.ఈ సందర్భంగా ప్రతిపాదిత మార్గాన్ని పరిశీలించి, స్తంభాల ఏర్పాటు కోసం అనుకూల ప్రదేశాలను గుర్తించారు.

## గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించిన నాచారం విద్యార్థి జూపల్లి కృత్విక్‌కు ఘన సన్మానం



**నాచారం,జూలై21 (సూర్యరేఖ)**విజన్ మార్షల్ ఆర్ట్స్ అకాడమీ మరియు జె.ఆర్. ఇంటర్నేషనల్ తైక్వాండో అకాడమీ(భారతదేశం) సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ప్రపంచంలోనే అతిపెద్ద కరాటే ప్రదర్శన విజయవంతంగా జరిగింది. ఈ ప్రతిష్ఠాత్మక కార్యక్రమంలో మొత్తం1,212మంది మార్షల్ ఆర్ట్స్ క్రీడాకారులు పాల్గొని తమ ప్రతిభను చాటుకున్నారు.ఈ కార్యక్రమంలో కోచ్ రాజశేఖర్ రెడ్డి శిక్షణలో నాచారం డివిజన్‌కు చెందిన విద్యార్థి జూపల్లి కృత్విక్ పాల్గొని అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు.విశిష్ట ప్రదర్శన చేసిన ఎంపికైన క్రీడాకారులకు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సర్టిఫికెట్లు ప్రదానం చేయగా,జూపల్లి కృత్విక్ కూడా ఆగౌరవాన్ని దక్కించుకుని గోల్డ్ మెడల్ సాధించి నాచారం డివిజన్‌కు గర్వకారణంగా నిలిచారు.కృత్విక్ సాధించిన ఈ అరుదైన విజయాన్ని పురస్కరించుకుని నాచారం డివిజన్ మాజీ కార్పొరేటర్ శాంతిసాయిజెన్ శేఖర్ ఆయనను శాలువాతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.భవిష్యత్తులో జాతీయ,అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి తెలంగాణతో పాటు దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో జూపల్లి కృత్విక్ తండ్రి జూపల్లి బాలరాజ్,తల్లి జూపల్లి అనిత, సుతిక్షతో పాటు కుటుంబ సభ్యులు,మార్షల్ ఆర్ట్స్ శిక్షకులు,క్రీడాభిమానులు పాల్గొన్నారు.

## కాశీంపూర్ తాండలో నూతన ఫామ్ పాండ్‌కు భూమిపూజ..



**నిజాంపేట,జూలై21(సూర్యరేఖ)**మండల పరిధిలోని కాశీంపూర్ తాండ గ్రామపంచాయతీలో వీబీ గ్రామ్(వీబీ గ్రామ) కార్యక్రమంలో భాగంగా రైతు ధరావత్ విట్టల్ వ్యవసాయ పొలంలో నూతన ఫామ్ పాండ్ (ఫార్మ్ పోండి)నిర్మాణానికి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్ రామ్‌చందర్ నాయక్ మాట్లాడుతూ...రైతులకు నీటి సంరక్షణ, సాగునీటి సౌకర్యం మెరుగుపడేందుకు ఫామ్ పాండ్‌లు ఉపయోగపడతాయని వారు తెలిపారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి ప్రశాంత్,మేట్ భాస్కర్,రైతు ధరావత్ విట్టల్ పాల్గొన్నారు.

## హెచ్ సిఏ లీగ్ లో మైలార్ దేవ్ పల్లి కుర్రాడి ప్రతిభ..

### ఆరు వికెట్లతో మ్యాచ్ ను తిప్పేసిన చరణ్ తేజ్ యాదవ్



**రాజేంద్రనగర్,జూలై 21(సూర్యరేఖ)**హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న బిడివిజన్ టూ డేస్ లీగ్ అండర్-19 ఛాంపియన్షిప్,లో రాజేంద్ర నగర్ నియోజకవర్గం మైలార్ దేవ్ పల్లికి చెందిన యువకుడు బల్ల చరణ్ తేజ్ యాదవ్ అద్భుత ప్రతిభ కనబరిచాడు.17ఏళ్ల వయసులోనే అండర్-19జట్టులో చోటు దక్కించుకున్న చరణ్ తేజ్ యాదవ్ ప్రస్తుతం లెగ్ స్పిన్ బౌలర్‌గా అద్భుత ప్రతిభ కనబరుస్తున్నాడు. బిడివిజన్ టు డేస్ లీగ్ ఛాంపియన్షిప్,లో హైదరాబాద్ బ్లూస్ జట్టుపై ఆరు వికెట్లు తీసుకొని కాంటినెంటల్ జట్టును ఒంటి చేత్తో గెలిపించాడు.పదేళ్ల వయస్సు నుంచి క్రికెట్ ఆడటం మొదలు పెట్టిన చరణ్ తేజ్ అనతి కాలంలోనే అద్భుత ప్రతిభ కనబరుస్తూ హెచ్సీఏ అండర్-16,అండర్-17లకు ప్రాతినిత్యం వహించాడు.మైలార్ దేవ్ పల్లికి చెందిన ఈ యువ క్రికెటర్ శివరాంపల్లిలోని సెంటర్ ఫర్ క్రికెట్ ఎక్సలెన్స్(సీహెచ్ సీ)కోచింగ్ సెంటర్ లో తర్ఫీదు పొందుతున్నాడు. గతంలో జరిగిన హెచ్సీఏ లీగ్లలో సైతం తన ప్రతిభతో అందరినీ ఆకట్టుకున్నాడు. మంగళవారం జరిగిన మ్యాచ్ లో చరణ్ తేజ్ యాదవ్ 10ఓవర్లు బౌలింగ్ చేసి ఆరు వికెట్లు తీసుకొని కాంటినెంటల్ జట్టును గెలిపించాడు. మ్యాచ్ లో అత్యధిక వికెట్లు తీసి మ్యాన్ అఫ్ ది మ్యాచ్ గా నిలిచాడు.ఈ ప్రతిభతో హైదరాబాద్ జట్టుకు ప్రాతినిధ్యం వహించే రోజులు దగ్గరలోనే ఉన్నాయని అందరూ విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

# ఎల్ నీనో నేపథ్యంలో కూరగాయలు ముద్దు..వరి వద్దు:







### ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండా రాజిరెడ్డి

**రాజేంద్రనగర్,జూలై21(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటికే మొదలైన ఎల్ నీనో ప్రభావం నేపథ్యంలో కూరగాయలే ముద్దని, బోరుబావుల కింద ఎట్టి పరిస్థితిలోనూ వరి సాగుకు రైతులు ముగ్గు చూపొద్దని శ్రీకొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సర్ డాక్టర్ దండా రాజిరెడ్డి కోరారు.హైదరాబాదులోని రవీంద్రభారతిలో ఏర్పాటుచేసిన ఎల్ నీనో నేపథ్యంలో పసిఫిక్ సముద్రం వేడెక్కడం నుండి తెలంగాణ సంసిద్ధత అనే అంశంపై ఏర్పాటు చేసిన సెమినార్లో ఆయన మాట్లాడారు.బోరుబావుల కింద ప్రస్తుతం ఆముదం,కందులు సాగు చేసుకోవచ్చన్నారు.తెలంగాణ ఇతర రాష్ట్రాల నుంచి 4వేల కోట్ల రూపాయలు విలువైన కూరగాయల దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో రైతులకు ఇన్సెంటివ్స్ ఇచ్చి,కూరగాయల సాగును ప్రోత్సహించాలని కోరారు.ఎల్ నీనో నేపథ్యంలో ఇప్పటికే ఉద్యాన విశ్వవిద్యాలయం ప్రత్యామ్నాయ పంటల ప్రణాళిక విడుదల చేసిందని,అన్ని ఉద్యాన పంటల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు కూడా వివరించడం జరిగిందని అన్నారు.ఉద్యాన శాస్త్రవేత్తలు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని గ్రామసభల్లో పాల్గొంటూ,సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా పంటల ప్రణాళిక సంబంధించి రైతులకు వివరిస్తున్నారని తెలిపారు.స్వల్ప కాలిక కూరగాయ పంటలు అయితే ఇంకా మేలని ఈ సందర్భంగా సూచించారు.గత పది సంవత్సరాలుగా అవసరానికి మించి ఎరువులు వాడుతున్న నేపథ్యంలో,కనీసం ఎల్నీనో కాలంలోనైనా ఈ రసాయన ఎరువులు తగ్గించాలని కోరారు.ప్రభుత్వంతో కలిసి ఎన్ నీనో ప్రభావం తీవ్రత సాగు రైతులపై ఉండకుండా శాస్త్రవేత్తలు,విశ్వవిద్యాలయం పనిచేస్తుందని డాక్టర్ రాజిరెడ్డి తెలిపారు.

# రోడ్డుపై భారీ గుంతలు... వాహనదారులకు చుక్కలు







### మేడ్చల్ చెక్‌పోస్ట్--మజీద్‌పూర్ ప్రధాన రహదారిపై దయనీయ పరిస్థితి..

### వర్షాలతో మరింత ప్రమాదకరంగా మారిన రహదారి-- వెంటనే మరమ్మతులు చేపట్టాలని ప్రజల డిమాండ్

**మేడ్చల్,జూలై21(సూర్యరేఖ)** మేడ్చల్ చెక్‌పోస్ట్ నుండి మజీద్‌పూర్ వెళ్లే ప్రధాన రహదారి భారీ గుంతలతో అధ్వానంగా మారింది. ప్రతిరోజూ వేలాది మంది వాహనదారులు, ఉద్యోగులు,విద్యార్థులు ఈ రహదారిపై ప్రయాణిస్తుండగా,అడుగడుగునా ఏర్పడిన గుంతలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయి.రోడ్డంతా చిన్నా, పెద్దా గుంతలతో నిండిపోవడంతో వాహనదారులు నెమ్మదిగా ప్రయాణించాల్సి వస్తోంది.ద్విచక్ర వాహనదారులు అదుపు తప్పి ప్రమాదాలకు గురయ్యే పరిస్థితులు తరచూ ఎదురవుతున్నాయని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**వర్షాలతో మరింత ప్రమాదకరం..**

వర్షపు నీరు గుంతల్లో నిల్వ ఉండటంతో వాటి లోతు కనిపించక ప్రమాదాల ముప్పు పెరిగింది.ముఖ్యంగా రాత్రి వేళల్లో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెబుతున్నారు.గుంతల కారణంగా వాహనాల సస్పెన్షన్,టైర్లు,ఇతర విడిభాగాలు దెబ్బతింటున్నాయని,తరచూ మరమ్మతులకు భారీ ఖర్చు చేయాల్సి వస్తోందని వాహనదారులు వాపోతున్నారు.

**అధికారులు స్పందించాలని విజ్ఞప్తి..**

ప్రజల ప్రాణాలకు ముప్పుగా మారిన ఈ రహదారిపై సంబంధితశాఖ అధికారులు వెంటనే స్పందించి గుంతలను పూడ్చి,శాశ్వత మరమ్మతులు చేపట్టి సురక్షిత ప్రయాణానికి చర్యలు తీసుకోవాలని స్థానికులు,వాహనదారులు కోరుతున్నారు.

# ఘనంగా బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు పూడూరి జితేందర్‌రెడ్డి జన్మదిన వేడుకలు




**ఉప్పల్,జూలై21(సూర్యరేఖ)** ఉప్పల్ బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు పూడూరి జితేందర్‌రెడ్డి(ఉప్పల్ పీజేఆర్)జన్మదిన వేడుకలు సోమవారం ఉప్పల్ హనుమసాయి నగర్‌లో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ మల్కాజ్‌గిరి పార్లమెంట్ ఇన్‌చార్జి రాగిడి లక్ష్మారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కేక్ కట్ చేయించి జితేందర్‌రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.ఈ సందర్భంగా రాగిడి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ...పార్టీ బలోపేతానికి పూడూరి జితేందర్‌రెడ్డి ఎన్నో సంవత్సరాలుగా కృషి చేస్తున్న అంకితభావం కలిగిన నాయకుడని కొనియాడారు. ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ,పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ కార్యకర్తలకు ఆదర్శంగా నిలుస్తున్నారని పేర్కొన్నారు. ఆయనకు ఆయురారోగ్యాలు,దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు.అనంతరం జితేందర్‌రెడ్డిని పూలమాలలు వేసి,శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యకర్తలు కేక్ కట్ చేసి,మిఠాయిలు పంచుకుంటూ సంబరాలు జరుపుకున్నారు. "హ్యాపీ బర్త్‌డే పీజేఆర్","జై తెలంగాణ","జై బీఆర్ఎస్" అంటూ నినాదాలతో కార్యక్రమ ప్రాంగణం మార్మోగింది.ఈ వేడుకలకు బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,ఉప్పల్,బీరప్పగడ్డ, చిలుకానగర్ డివిజన్లకు చెందిన యువకులు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరై జితేందర్‌రెడ్డికి పుష్పగుచ్ఛాలు అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.పలువురు ఆయన ప్రజాసేవా కార్యక్రమాలను కొనియాడుతూ భవిష్యత్తులో మరింత ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ఆకాంక్షించారు.కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఉత్సాహభరితంగా సాగగా,స్థానిక బీఆర్ఎస్ నాయకులు,ప్రజాప్రతినిధులు, అభిమానులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేశారు.

# జంతర్ మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్యానికి విరుద్ధం:

### కాంగ్రెస్ సీనియర్ నాయకులు ఇర్షాద్ ఖాన్(ఉప్పల్ ఖాన్)



**ఉప్పల్,జూలై21(సూర్యరేఖ)**న్యూఢిల్లీ జంతర్ మంతర్ వద్ద వివిధ నియామక పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు,ఉద్యోగాల భర్తీలో జాప్యం, నిరుద్యోగ సమస్యలపై శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత దురదృష్టకరమని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు ఇర్షాద్ ఖాన్ (ఉప్పల్ ఖాన్)తీవ్రంగా ఖండించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని అన్నారు.తమ భవిష్యత్తు కోసం న్యాయం కోరుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.యువత ప్రశ్నలకు సమాధానాలు ఇవ్వాల్సిన ప్రభుత్వం ,వారిపై లాఠీలు ఎత్తడం బాధాకరమైన పరిణామమని విమర్శించారు .దేశవ్యాప్తంగా వరుసగా జరుగుతున్న ప్రశ్నాపత్రాల లీకులు, నియామకా ల్లో జాప్యం,నిరుద్యోగ సమస్యలపై యువత తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని ఆయన ఆరోపించారు.విద్యార్థుల సమస్యలను పరిష్కరించకుండా అణచివేత చర్యలకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. జంతర్ మంతర్ ఘటనపై ప్రభుత్వం వెంటనే పూర్తి వివరాలు వెల్లడించి, గాయపడిన విద్యార్థులకు మెరుగైన వైద్య సహాయం అందించాలని డిమాండ్ చేశారు.అలాగే ప్రశ్నాపత్రాల లీకులపై కఠిన చర్యలు తీసుకుని,పారదర్శకంగా నియామక ప్రక్రియలు నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి ప్రశ్నించే హక్కు ఉందని, యువత గొంతును అణచివేయడం ద్వారా సమస్యలు పరిష్కారం కావని ఉప్పల్ ఖాన్ స్పష్టం చేశారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను గౌరవించి,వారికి న్యాయం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.

# అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండాలి..

### ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీదొడ్ల వెంకటేష్ గౌడ్



**శేరిలింగంపల్లి,జులై21(సూర్యరేఖ)** అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవా లని ఆల్విన్ కాలనీ డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీదొడ్ల వెంకటేష్ గౌడ్ సూచించారు. ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను అధికారులు సమర్థవంతంగా నిర్వహించి విజయవంతం చేయాలని కోరారు. మంగళవారం ఆల్విన్ కాలనీ డివిజన్ పరిధిలోని వెస్ట్ సాయినగర్ కాలనీలో కేంద్రాల్లో జరుగుతున్న ఎస్ఐఆర్ ప్రక్రియను డివిజన్ మాజీ కార్పొరేటర్ శ్రీదొడ్ల వెంకటేష్ గౌడ్ స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు.సందర్భంగా పోలింగ్ కేంద్రాల వద్ద ఓటర్లతో మాట్లాడి ఎన్యూమరేషన్ ఫారాల నమోదు, వివరాల పరిశీలన,దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియపై ఆరా తీశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న సర్ కార్యక్రమంలో ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా భాగస్వామి కావాలని కోరారు. బిఎల్ఓలు అందజేసే ఎమ్యూనరేషన్ ఫారంలో తమ పూర్తి వివరాలను సక్రమంగా నమోదు చేసి ఓటు హక్కును పరిరక్షించుకోవాలని సూచించారు.బూతు లెవెల్ అధికారులు సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని సూచించారు.అదేవిధంగా ఒకే వ్యక్తికి రెండు చోట్ల ఉన్న ఓట్లను గుర్తించి తొలగించేందుకు బిఎల్ఓలు కృషి చేయాలని,నకిలీ ఓట్లను పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు .ప్రజాస్వామ్య వ్యవస్థను మరింత బలోపేతం చేయాలంటే ప్రతి అర్హత కలిగిన పౌరుడు ఓటరుగా నమోదు కావడం అత్యంత ముఖ్యమని పేర్కొంటూ,స్థానిక నాయకులు,కార్యకర్తలు ప్రజలకు అవగాహన కల్పించి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో రాజేష్ చంద్ర,పోశెట్టిగౌడ్,సంతోష్ బిరాదర్, బిఎల్ఓలు తదితరులు పాల్గొన్నారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713

# కాంగ్రెస్ పథకాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలి...





**ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్**

**ఎమ్మెల్యేను సన్మానించిన పడమటి శ్రీధర్ రెడ్డి**

**రాజేంద్రనగర్,జూలై21(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా నూతనంగా నియమితులైన పడమటి శ్రీధర్ రెడ్డి మంగళవారం ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలుసుకొని ఘనంగా సన్మానించారు.ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డిని ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్ శాలువాతో సత్కరించారు.అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ ప్రజా సంక్షేమం కోసం చేపడుతున్న పథకాలను ప్రజల్లోకి ఎప్పటికప్పుడు తీసుకు వెళ్తూ పార్టీని బలోపేతం చేయాలని సూచించారు.అర్హులైన లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేయాలని వెల్లడించారు.రాజేంద్రనగర్ డివిజన్లో సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించేలా చూడాలన్నారు. ప్రజల సమస్యలను తెలుసుకుని ప్రభుత్వ పథకాల అమలులో కార్యకర్తలు కీలక పాత్ర పోషించాలని సూచించారు.పట్టణ స్థాయిల్లో పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు.కాంగ్రెస్ మళ్లీ అధికారంలోకి రావాలంటే అంకితభావంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు.బీఆర్ఎస్ పాలనతో పోలిస్తే రెండున్నరేళ్లలో కాంగ్రెస్ ప్రభుత్వం రైతు సంక్షేమం, మహిళా సాధికారత,యువత ఉపాధి,విద్యారంగ అభివృద్ధిలో గణనీయ పురోగతి సాధించిందని చెప్పారు.ఎమ్మెల్యేను కలిసిన వారిలో గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బండారి శంకర్, మాదూరి ప్రభాకర్ రెడ్డి,పిట్టల లక్ష్మణ్ ముదిరాజ్,చెరుకుపల్లి రణదీర్ రెడ్డి,మహమ్మద్ సీరాజ్,బద్దం శ్రీధర్ రెడ్డి,మామిడి సంజీవరెడ్డి,రాము,పోరెడ్డి ధర్మారెడ్డి, పెండ్యాలసాయిమాలిక్, రడగడంపల్లి శ్రవణ్,కరుణాకర్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

**రాజేంద్రనగర్ కాంగ్రెస్ అధ్యక్షుడిగా పడమటి శ్రీధర్ రెడ్డి**

రాజేంద్రనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా శివరాంపల్లి బస్తీకి చెందిన పడమటి శ్రీధర్ రెడ్డి నియమితులయ్యారు.ఈ మేరకు సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షుడు చల్ల నరసింహారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.ఈ సందర్భంగా శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ...కాంగ్రెస్ పార్టీ విధానాలను ప్రతి ఇంటికి తీసుకెళ్లి ప్రజా ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో కృషి చేస్తానని తెలిపారు.కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కట్టుబడి పనిచేస్తానని పేర్కొన్నారు.తన నియామకానికి సహకరించిన రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చల్లా నరసింహారెడ్డి,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,లకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

# నాణ్యమైన విద్యుత్‌ను అందించడమే రైతు పొలం బాట-రైతు ప్రజా బాట లక్ష్యం..

**విద్యుత్ సమస్యల పరిష్కారానికి విద్యుత్ శాఖ నిరంతరం కృషి..**

**రైతుల సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరిస్తున్నాం..**

**మరిపెడ ఏడీఈ ఎం.శ్రీనివాసరావు గుర్రప్పతండాలో 100కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్ ప్రారంభం..**






**మరిపెడ,జూలై 21(సూర్యరేఖ)** రైతులకు నాణ్యమైన,నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించడంతో పాటు వారు ఎదుర్కొంటున్న విద్యుత్ సమస్యలను క్షేత్రస్థాయిలోనే గుర్తించి సత్వర పరిష్కారం అందించడమే రైతు పొలంబాట-రైతు ప్రజాబాట కార్యక్రమం ప్రధాన లక్ష్యమని మరిపెడ విద్యుత్ శాఖ ఏడీఈ ఎం. శ్రీనివాసరావు తెలిపారు.మరిపెడ విద్యుత్ శాఖ సబ్‌డివిజన్ పరిధిలోని మరిపెడ,ఎల్లంపేట, నర్సింహులపేట సెక్షన్లలో రైతుల సమస్యల పరిశీలన, పరిష్కారం కోసం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో మంగళవారం రైతు పొలంబాట -రైతు ప్రజాబాట కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ సందర్భంగా రైతులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకురావడం జరిగింది.ఈ కార్యక్రమంలో భాగంగా ఎల్లంపేట,గుర్రప్పతండా గ్రామాల్లో అధికారులు రైతులను నేరుగా కలిసి విద్యుత్ సరఫరా,లో వోల్టేజ్,ట్రాన్స్‌ఫార్మర్లు,విద్యుత్ లైన్ల నిర్వహణకు సంబంధించిన సమస్యలను తెలుసుకుని పరిష్కార చర్యలు చేపట్టారు.ఈ సందర్భంగా గుర్రప్పతండాలో ఏర్పాటు చేసిన 100 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏడీఈ ఎం.శ్రీనివాసరావు ప్రారంభించారు.దీంతో ఆ ప్రాంత రైతులకు మెరుగైన విద్యుత్ సరఫరా అందుతుందని ఆయన తెలిపారు.అనంతరం శ్రీనివాస రావు మాట్లాడుతూ...రైతులు విద్యుత్ సరఫరా విషయంలో ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించేందుకే ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు.రైతులు విద్యుత్ సంబంధిత సమస్యలు ఎదురైనప్పుడు సంబంధిత అధికారులను నేరుగా సంప్రదించాలని, అలాగే వారి సమస్యల పరిష్కారానికి 1912టోల్‌ఫ్రీ నంబర్ సంప్రదించవచ్చని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఏఈలు ఎస్డి.మహమ్మద్,ఎండి. రూబీనా, విద్యుత్ శాఖ సిబ్బంది వేమన,ఏకాంతాచారి,మహేష్, వీరన్న, రవీందర్,స్థానిక రైతులు బానోతు వెంకన్న,మంగ్య,వీరన్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులపై లాఠీచార్జ్ ప్రజాస్వామ్యానికి విరుద్ధం:

**మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ**



**మేడ్చల్,జూలై21(సూర్యరేఖ)** న్యూఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద వివిధ నియామక పరీక్షల్లో ప్రశ్నాపత్రాల లీకులు,ఉద్యోగాల భర్తీలో జాప్యం,నిరుద్యోగ యువత సమస్యలపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేడ్చల్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు,మాజీ కౌన్సిలర్ కొడే మహేష్ కురుమ తీవ్రంగా ఖండించారు.ఈ ఘటనలో పలువురు విద్యార్థులు గాయపడినట్లు,కొందరికి రక్తస్రావం జరిగినట్లు వస్తున్న వార్తలు ఆందోళన కలిగిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు.తమ భవిష్యత్తు కోసం న్యాయం కోరుతున్న విద్యార్థులపై బలప్రయోగం చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు.దేశ వ్యాప్తంగా ప్రశ్నాపత్రాల లీకులు, నియామకాల్లో జాప్యం ,నిరుద్యోగ సమస్యలపై యువత తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నప్పటికీ,కేంద్ర ప్రభుత్వం సమర్థవంతమైన చర్యలు తీసుకోవడంలో విఫలమైందని విమర్శించారు.విద్యార్థుల సమస్యలను వినకుండా అణచివేత చర్యలకు పాల్పడటం సరైన విధానం కాదన్నారు. ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం పూర్తి వివరాలు వెల్లడించి,గాయపడిన విద్యార్థులకు తక్షణమే మెరుగైన వైద్య సహాయం అందించాలని ఆయన డిమాండ్ చేశారు.అలాగే ప్రశ్నాపత్రాల లీకులపై కఠిన చర్యలు తీసుకొని,పారదర్శకంగా నియామక ప్రక్రియలు నిర్వహించి నిరుద్యోగ యువతకు న్యాయం చేయాలని కోరారు.

## టేకు కలప బహిరంగ వేలం..



**ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా బ్యూరో,జూలై21(సూర్యరేఖ)** మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలో గల కలప డిపోలో గురువారం 23వ తేదీన కడప బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు జన్నారం ఎఫ్డిఓ రామ్మోహన్, జన్నారం ఫారెస్ట్ రేంజ్ అధికారులు తెలిపారు.ఈ వేలంలో మొత్తం204 కలప వేలం లాట్లు ఉన్నట్లు వారు తెలిపారు.ప్రారంభ వేలం ధర నుంచి 20శాతం తగ్గింపుతో వేలం నిర్వహిస్తున్నట్లు ఈ వేలంలో కొనుగోలుదారుడు ఈ అవకాశాన్ని వినియోగించుకుని మన కవ్వాల్ టైగర్ జోన్ ప్రాంతంలో ఉండేటటువంటి విలువైన టేకుకల్పను కొనుగోలు చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వారు తెలిపారు

## తప్పులు లేకుండా సర్ ఫారం నింపి సకాలంలో సమర్పించండి..

**అంబటి శ్రీనివాస్**



**నాంపల్లి,హైదరాబాద్,జూలై21(సూర్యరేఖ)** దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాను మరింత ఖచ్చితంగా,పారదర్శకంగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ సమగ్ర ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ కొనసాగుతోంది.ఈ నేపథ్యంలో ఫారం ఎలా నింపాలి,స్వయంగా ఆన్లైన్లో ఎలా సమర్పించాలి,ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి,దరఖాస్తు నమోదు అయ్యిందో లేదో ఎలా తెలుసుకోవాలి వంటి అంశాలపై ఓటర్లలో అనేక సందేహాలు ఉన్నాయని వాటిని నివృత్తి చేస్తూ..వాటికి సంబంధించిన పూర్తి వివరాలను ప్రజలకు వివరిస్తూ బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు అంబటి శ్రీనివాస్ బిఎల్ఓలతో కలిసి ఎస్ఐఆర్ ఫామ్స్ ను రాస్తూ ప్రజలకు సహాయం చేయడం జరిగింది.ఈ సందర్భంగా గుడిమల్కాపూర్ డివిజన్ తాళ్లగడ్డ అశోక్ విహార్ భగవాన్ దాస్ తదితర బస్తీలకు సంబంధించిన ఓటర్ బూతులో ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంపై ప్రజల అపోహలను నివృత్తి చేశారు.ఈ సందర్భంగా అంబటి శ్రీనివాస్ మాట్లాడుతూ...రేషన్ కార్డు కట్ అవుతుందని సోషల్ మీడియాలో జరుగుతున్నటువంటి అసత్య వదంతులను నమ్మవద్దని,ఓటర్స్ ఎలాంటి ఆందోళన చెందే అవసరం లేకుండా వారి ఓటు ఇతర సమాచారని ఎలా నమోదు చేసుకోవాలో సూచన సలహాలు ఇస్తున్నమని అంబటి శ్రీనివాస్ తెలిపారు.

## ప్రజలకు కనీస వసతులు కల్పించడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలం:



**మేడ్చల్,జూలై21(సూర్యరేఖ)**రాష్ట్రంలో ప్రజలకు కనీస వసతులు కూడా కల్పించలేని పరిస్థితి నెలకొందని,కాంగ్రెస్ ప్రభుత్వం పాలనలో అన్ని రంగాల్లో వైఫల్యం స్పష్టంగా కనిపిస్తోందని బీజేపీ నాయకుడు జాకట ప్రేమ్ దాస్ విమర్శించారు.సోమవారం ఉదయం బీజేపీ పార్టీ కార్యాలయ ంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టారని, ప్రజల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించారని ఆరోపించారు.ప్రస్తుతం రెండున్నర సంవత్సరాలుగా అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ప్రజల సమస్యలను పరిష్కరించడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు.ఇప్పుడు బీఆర్ఎస్ నాయకులు తిరిగి ప్రజల మధ్యకు వచ్చి నిరసనల పేరుతో రాజకీయ నాటకాలు ఆడుతున్నారని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల హామీల పేరుతో ప్రజలను నమ్మించి మోసం చేస్తోందని ఆరోపించిన ప్రేమ్ దాస్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పిస్తున్నామని చెబుతూనే ఇతర ప్రయాణికులపై అదనపు భారం మోపుతున్నారని విమర్శించారు. 200యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ పేరుతో ప్రచారం చేస్తూ,ఆ పరిమితి దాటిన తర్వాత అధిక చార్జీలు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.అలాగే ఇందిరమ్మ ఇళ్ల పథకంలో పారదర్శకత లేదని, అర్హులైన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు.గ్రామాలను మున్సిపాలిటీలు,కార్పొరేషన్లుగా మార్చినప్పటికీ అభివృద్ధి పనులు జరగడం లేదని తెలిపారు.ప్రజా సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం తక్షణమే దృష్టి సారించాలని డిమాండ్ చేశారు.

## తలసేమియా,సికిల్ సెల్ బాధితుల కోసం ఆరోగ్యశ్రీ సమగ్ర సవరణ చేయాలి..

**ముఖ్యమంత్రికి రాష్ట్ర తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ వినతి**

**మంచిర్యాల,జూలై21(సూర్యరేఖ)**తెలంగాణ రాష్ట్రంలో తలసేమియా,సికిల్ సెల్ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు ఆరోగ్యశ్రీ పథకాన్ని సమగ్రంగా సవరించాలని రాష్ట్ర తలసేమియా వెల్ఫేర్ సొసైటీ ఉపాధ్యక్షుడు కాసర్ల శ్రీనివాస్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలోని వేలాది మంది తలసేమియా,సికిల్ సెల్ బాధితులు జీవితాంతం ప్రతి 15రోజులకు ఒకసారి రక్త మార్పిడి చేయించుకోవాల్సిన పరిస్థితుల్లో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు.మంచిర్యాల ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి పరిధిలోని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నడుస్తున్న రక్త మార్పిడి కేంద్రంపై ఉమ్మడి ఆదిలాబాద్,కరీంనగర్, వరంగల్ ప్రాంతాలకు చెందిన పది జిల్లాల నుంచి సుమారు 700మంది రోగులు ఆధారపడుతు న్నారని తెలిపారు.గత మూడు సంవత్సరాలుగా రెడ్ క్రాస్ సొసైటీకి ఆరోగ్యశ్రీ కింద రావాల్సిన దాదాపు రూ.3 కోట్ల నిధులు పెండింగ్‌లో ఉండటంతో వైద్య సేవల కొనసాగింపుపై అనిశ్చితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు.మానవతా దృక్పథంతో ఆనిధులను వెంటనే విడుదల చేయాలని ముఖ్యమంత్రిని కోరారు. తలసేమియా బాధితులకు అత్యవసరంగా అవసరమయ్యే డెస్ఫెరల్ ఇంజెక్షన్లు,ఇన్ఫ్యూజర్ పంపులు, 27నెంబర్ బటర్‌ఫ్లై నీడిల్స్,డిస్పోజబుల్ సిరంజీలు,ల్యూకోసైట్ ఫిల్టర్లు,ఇతర ప్రాణాధార ఇంజెక్షన్లు,వ్యాక్సిన్లను ఆరోగ్యశ్రీ పరిధిలో ఉచితంగా అందుబాటులోకి తీసుకురావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్ర ప్రభుత్వ నేషనల్ హెల్త్ అథారిటీ మార్గదర్శకాల మేరకు 0నుంచి 40సంవత్సరాల వయస్సు గల వారందరికీ ఉచిత హెచ్‌పీఎల్‌సీ స్క్రీనింగ్ నిర్వహించి,వ్యాధిగ్రస్తులు,క్యారియర్లకు ప్రత్యేక డిజిటల్ ఐడీ కార్డులు జారీ చేయాలని కోరారు. అలాగే వివాహపూర్వ జన్యు కౌన్సెలింగ్,గర్భిణీలకు అవసరమైన జన్యు పరీక్షలు అమలు చేయాలని సూచించారు.అదేవిధంగా కోల్ ఇండియా తలసేమియా బాల్ సేవా యోజన,సింగరేణి, ఎన్టీపీసీ,టీజీఎస్‌జెన్‌కో,టీజీఎస్‌ఆర్టీసీ తదితర ప్రభుత్వ రంగ సంస్థల సీఎస్ఆర్ నిధులను అనుసంధానం చేసి నిమ్స్‌తో పాటు గుర్తింపు పొందిన కార్పొరేట్ ఆసుపత్రుల్లో నిరుపేదలకు ఉచిత బోన్ మ్యారో మార్పిడి(బీఎంటీ)చికిత్స అందించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ జనరల్, ఏరియా ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ కింద 'డేకేర్ ట్రాన్స్‌ఫ్యూషన్ సర్వీసెస్' ప్రారంభించడంతో పాటు, ఒక సీనియర్ హిమటాలజీ వైద్య నిపుణుడి ఆధ్వర్యంలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి తలసేమియా,సికిల్ సెల్ బాధితుల సంక్షేమానికి సమగ్ర కార్యాచరణ రూపొందించాలని కాసర్ల శ్రీనివాస్ ముఖ్యమంత్రిని కోరారు.అలాగే వినతిపత్రంపై ప్రభుత్వం తీసుకునే నిర్ణయాలను లిఖితపూర్వకంగా తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## జంతర్ మంతర్‌లో విద్యార్థులపై లాఠీచార్జ్ అప్రజాస్వామికం..

**కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు రాఘవేందర్ గౌడ్**



**మేడ్చల్,జూలై21(సూర్యరేఖ)** కేంద్ర ప్రభుత్వం నియంతృత్వ పోకడలను అవలంబిస్తూ ప్రజాస్వామ్య హక్కులను కాలరాస్తోందని మేడ్చల్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రామన్నగారి రాఘవేందర్ గౌడ్ తీవ్రంగా విమర్శించారు.ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద విద్యార్థులు చేపట్టిన శాంతియుత నిరసనపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ...కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ తమ సమస్యల పరిష్కారం కోసం విద్యార్థులు చేపట్టిన నిరసనను బలప్రయోగంతో అణచివేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు.విద్యార్థులపై అమానుషంగా లాఠీచార్జ్ చేయడం కేంద్ర ప్రభుత్వ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని విమర్శించారు. విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను వెంటనే పరిష్కరించాలని,వారితో చర్చలు జరిపి సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.అలాగే లాఠీచార్జ్ ఘటనకు బాధ్యులైన అధికారులపై తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ప్రజాస్వామ్య దేశంలో నిరసన తెలిపే హక్కు ప్రతి పౌరుడికి ఉందని,ఆ హక్కును అణచివేసే చర్యలను కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని రాఘవేందర్ గౌడ్ స్పష్టం చేశారు.

# భీమారంలోని లంబాడి తండాలో పోలీసుల కార్డన్ అండ్ సెర్చ్..







**చెన్నూర్,జూలై21(సూర్యరేఖ)** భీమారంలోని లంబాడి తండాలో మంగళవారం తెల్లవారుజా మున పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా,ఐపీఎస్ ఆదేశాల మేరకు, మంచిర్యాల డీసీపీ ఎ.భాస్కర్,ఐపీఎస్, జైపూర్ ఏసీపీ ఎ.వెంకటేశ్వర్ సూచనలతో,జైపూర్ సీఐ కె.నవీన్ కుమార్ ఆధ్వర్యంలో ఈ తనిఖీలు చేపట్టారు.ఆపరేషన్‌లో భాగంగా అనుమానాస్పద వ్యక్తులను విచారించడంతో పాటు ఇళ్లలో,పరిసర ప్రాంతాల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. వాహనాల తనిఖీల్లో సరైన పత్రాలు,నంబర్ ప్లేట్ లేని 45వాహనాలను సీజ్ చేశారు.ప్రభుత్వం నిషేధించిన గుడుంబాను స్వాధీనం చేసుకుని సంబంధిత కేసు నమోదు చేశారు.ఈ సందర్భం గా సీఐ కె.నవీన్ కుమార్ మాట్లాడుతూ... తల్లిదండ్రులు తమ పిల్లలపై నిరంతరం నిఘా ఉంచి గంజాయి,మద్యం తదితర మాదకద్రవ్యాల కు దూరంగా ఉండేలా చూడాలని సూచించారు. యువత ఆన్‌లైన్ గేమింగ్‌కు బానిస కాకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు.సైబర్ నేరాలు, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని,ప్రతి ఇంటికి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు నేరస్థులను గుర్తించడంలో ఉపయోగపడుతుందని వివరించారు.ఈ కార్యక్రమంలో జైపూర్ ఎస్ఐ భూమేష్,భీమారం ఎస్ఐ ఎ.రాజేందర్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు అర్పిద్దాం..

**జూలై 26న మరిపెడ కార్గిల్ స్తూపం వద్ద ఘనంగా కార్గిల్ విజయ్ దివస్ వేడుకలు..**

**జిల్లా ప్రజలందరూ పాల్గొని అమరవీరుల త్యాగాలను స్మరించాలి..**

**కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ గాదె (కార్గిల్)రాంబాబు**





**మరిపెడ,జూలై 21(సూర్యరేఖ)** 1999 కార్గిల్ యుద్ధంలో భారత మాత రక్షణ కోసం తమ ప్రాణాలను అర్పించిన అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ ఈ నెల 26వ తేదీ (ఆదివారం)ఉదయం 10.30 గంటలకు మరిపెడ మండలంలోని కార్గిల్ సెంటర్‌లోని కార్గిల్ స్తూపం వద్ద కార్గిల్ విజయ్ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ గాదె (కార్గిల్)రాంబాబు మంగళవారం తెలిపారు.ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ...దేశం కోసం ప్రాణత్యాగం చేసిన అమరవీరులను స్మరించుకోవడం ప్రతి భారతీయుడి ధర్మమని అన్నారు.కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా నిర్వహించే దేశభక్తి సభలో అమరవీరులకు పుష్పాంజలి ఘటించి,వారి త్యాగస్ఫూర్తిని భావితరాలకు తెలియజేయనున్నట్లు చెప్పారు.మహబూబాబాద్ జిల్లాకు గర్వకారణమైన కార్గిల్ స్తూపాన్ని 2003లో కార్గిల్ రాంబాబు కార్గిల్ అమరవీరుల శాశ్వత జ్ఞాపకార్థం నిర్మించారని తెలిపారు.అనంతరం2005లో కార్గిల్ విజయ్ దివస్ సెలబ్రేషన్స్ కమిటీని ఏర్పాటు చేసి,అప్పటి నుంచి ప్రతి ఏడాది ఎలాంటి విరామం లేకుండా కార్గిల్ విజయ్ దివస్‌ను నిర్వహిస్తూ అమరవీరుల సేవలను ప్రజలకు చాటుతున్నట్లు పేర్కొన్నారు.

**కమిటీ సభ్యులు:**

గాదె ఉషాలతారెడ్డి-ఉపాధ్యక్షురాలు,లోహిరెడ్డి వర్కింగ్ ప్రెసిడెంట్,బాలుగూరి శ్రీనివాస్ రెడ్డి,పెంటయ్య(కురవి),చిలుకూరి వెంకన్న (పెద గూడూరు),దారా ఇందు భారతి (మహబూబాబాద్),భూక్య సుధాకర్ నాయక్ (మరిపెడ రూరల్),కరుణాకర్ (పడమటిగూడెం --నర్సింహులపేట),గుండగాని భరత్ కుమార్ (అగపేట,దంతాలపల్లి),జక్కుల సురేష్ నాయక్ (మరిపెడ రూరల్), గణేష్ నాయక్ (డోర్నకల్),మాచర్ల నరేష్ (చిన్న గూడూరు), రాంబాబు (వెన్నారం),పల్లె సందీప్ (మహబూబాబాద్),జనార్ధన్ (మరిపెడ), హుస్సేన్ నాయక్ (మరిపెడ),గోపీ నాయక్ భూక్య,రాములు నాయక్,జగన్ లు కమిటీ సభ్యులు.ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు,జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి ప్రజాప్రతినిధులు, సామాజికవేత్తలు,దేశభక్తులు పాల్గొననున్నట్లు తెలిపారు.జై జవాన్--జై హింద్...వందే మాతరం నినాదాలతో కార్గిల్ అమరవీరులకు ఘన నివాళులు అర్పించి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కార్గిల్ సోల్జర్స్ మెమోరియల్ సొసైటీ చైర్మన్ గాదె (కార్గిల్) రాంబాబు పిలుపునిచ్చారు.

## భావితరాల కోసం ఆలోచించే పార్టీ జనసేన..

**జనసేన నేత శ్రీనివాస్**

**నిజామాబాద్,జులై21(సూర్యరేఖ)** రేపటి భావితరాల కోసం నిరంతరం శ్రమించే పార్టీ జనసేన పార్టీ అని నిజామాబాద్ రూరల్ జనసేన పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ అన్నారు. భావితరాల కోసం జనసేన పార్టీలోకి యువత, మేధావులు,డాక్టర్లు,లాయర్లు,సామాజిక నిపుణులు, విద్యావంతులు,పార్టీలోకి రావాలని శ్రీనివాస్ పిలుపునిచ్చారు.2014 నుండి జనసేన పార్టీ నిజామాబాద్ రూరల్ లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తూ నిరంతరం ప్రజా సమస్యలపై పోరాడుతున్నామని ఆయన తెలిపారు.త్వరలో నిజామాబాద్ పార్లమెంటరీ నియోజకవర్గంలో పార్టీ నాయకులు పర్యటిస్తారని శ్రీనివాస్ ప్రకటించారు. 2014నుండి కష్టపడ్డ ప్రతి కార్యకర్తకు న్యాయం జరుగుతుందని ఆశిస్తున్నట్లు శ్రీనివాస్ తెలిపారు.



జనసేన అధినేత ఆంధ్ర ప్రదేశ్ ఉపముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ఆశయాల మేరకు పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి నిజామాబాద్ రూరల్ లో పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని శ్రీనివాస అన్నారు. నిజామాబాద్ జిల్లాలో గుండా సంతోష్ నేత నాయకత్వంలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తామని వెల్లడించారు.

# సోనమ్ వాంగ్చుక్ అరెస్టు,' చలో పార్లమెంట్' లాఠీచార్జిపై ఆగ్రహం..



**సికింద్రాబాద్/నాచారం,జూలై21(సూర్యరేఖ)** ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద శాంతియుతంగా ఆమరణ నిరాహార దీక్ష చేపట్టిన ప్రముఖ సామాజిక కార్యకర్త సోనమ్ వాంగ్చుక్ అరెస్టును నిరసిస్తూ, అలాగే 'చలో పార్లమెంట్' కార్యక్రమంపై పోలీసులు జరిపిన లాఠీచార్జిని ఖండిస్తూ సిఐటియు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు నాచారంలో మంగళవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు.రోడ్ నెం-14లోని తెలంగాణ ఫుడ్స్ బస్టాండ్ వద్ద సిఐటియు నాచారం డివిజన్ కార్యదర్శి పి.గణేష్ నాయకత్వంలో కార్మికులు,ప్రజా సంఘాల నాయకులు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు.ఈ సందర్భంగా పి.గణేష్ మాట్లాడుతూ... దేశంలోని విద్యా వ్యవస్థను కేంద్ర ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు.నీట్ పరీక్ష పేపర్ లీక్ కారణంగా విద్యార్థులు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నారని,దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తక్షణమే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.నీట్ పేపర్ లీక్ నేపథ్యంలో ఆత్మహత్యలకు పాల్పడిన విద్యార్థుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.1కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని,భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కఠినమైన చట్టాలు తీసుకురావాలని కోరారు. అలాగే ఢిల్లీలో శాంతియుతంగా చేపట్టిన 'చలో పార్లమెంట్' కార్యక్రమంపై పోలీసులు లాఠీచార్జి చేయడం,బాష్పవాయు గోళాలు ప్రయోగించడం, వందలాది మందిని అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను కాలరాయడమేనని ఆయన విమర్శించారు.గత 20 రోజులుగా జంతర్ మంతర్ వద్ద దీక్ష చేస్తున్న సోనమ్ వాంగ్చుక్‌ను అరెస్టు చేయడం కూడా ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.విద్యార్థుల న్యాయమైన డిమాండ్లు నెరవేరే వరకు కార్మిక వర్గం మరింత ఉధృతంగా ఉద్యమాలు కొనసాగిస్తుందని హెచ్చరించారు. ఈ నిరసన కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఈ.రమేష్,స్వామిగౌడ్,ప్రభాకర్,కిరణ్,నరేష్, చంద్రశేఖర్, మార్క ండేయ ,ప్రవీణ్ రెడ్డి తదితరులు, కార్మికులు మరియు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొని సంఘీభావం తెలిపారు.

# సర్ ప్రక్రియను విజయవంతం చేస్తాం..బీజేపీ అడ్డంకులను అధిగమిస్తాం


**మాజీ డిసిసి హరివర్ధన్ రెడ్డి**

**అర్హులైన ప్రతి ఓటరికి సర్ ఫారాలు అందించాలని పార్టీ శ్రేణులకు పిలుపు**



**మేడ్చల్,జూలై 21(సూర్యరేఖ)** సర్ ప్రక్రియను కేంద్ర ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా క్లిష్టతరం చేస్తోందని,ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసేందుకు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో మరింత చురుకుగా పనిచేయాలని మాజీ డీసీసీ అధ్యక్షులు,ఏఐసీసీ అధికార ప్రతినిధి సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి పిలుపునిచ్చారు.మేడ్చల్ సర్కిల్ పరిధిలోని గుండ్లపోచంపల్లి డివిజన్ గౌడవెల్లి లో నిర్వహించిన కాంగ్రెస్ కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా సీనియర్ నాయకులు సర్ ప్రక్రియపై తమ అభిప్రాయాలు,సూచనలు వెల్లడించారు. హరివర్ధన్ రెడ్డి మాట్లాడుతూ ...ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ వర్గాల ఓటర్లను కాంగ్రెస్‌కు దూరం చేయాలనే ఉద్దేశంతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సర్ ప్రక్రియలో ఇబ్బందులు సృష్టిస్తోందని విమర్శించారు.అయినప్పటికీ పార్టీ శ్రేణుల సమన్వయంతో సర్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేస్తామని తెలిపారు.గుండ్లపోచంపల్లి సర్కిల్‌లో ఇప్పటివరకు 43.6శాతం సర్ ప్రక్రియ పూర్తయిందని,గడువు ముగిసేలోపు ఈ శాతాన్ని మరింత పెంచేందుకు ప్రతి కార్యకర్త బాధ్యతగా పనిచేయాలని సూచించారు.అర్హులైన ప్రతి ఓటరికి సర్ ఫారాలు అందించి,వాటిని పూర్తిగా నింపించి సంబంధిత బీఎల్ఓలకు అప్పగించేలా చర్యలు తీసుకోవాలని కోరారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్, గుండ్లపోచంపల్లి డివిజన్ అధ్యక్షుడు గరిసెల సురేందర్ ముదిరాజ్,మేడ్చల్ డివిజన్ అధ్యక్షుడు చాపరాజు,కిష్టాపూర్--పూడూరు డివిజన్ అధ్యక్షుడు మల్లేష్ గౌడ్,సీనియర్ నాయకులు వేముల శ్రీనివాస్ రెడ్డి,రమణారెడ్డి,బాల్ రెడ్డి,రాఘవేందర్ గౌడ్,ఓబీసీ సెల్ అధ్యక్షుడు గువ్వ రవి,మాజీ వైస్ చైర్మన్ చీర్ల రమేష్,మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ సత్యనారాయణ,మాజీ కౌన్సిలర్ మహేష్,కౌన్సిలర్లు విఘ్నేశ్వర్ రెడ్డి,ముత్యాల గౌడ్,నాయకులు బేరి ఈశ్వర్,పానుగంటి మహేష్,రంజిత్,తదితరులు పాల్గొన్నారు.

## వివాహం ఆలస్యం..మనస్తాపంతో యువకుడు బలవన్మరణం



**మందమర్రి,జూలై 21(సూర్యరేఖ)** వివాహం ఆలస్యమవుతుండటంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఓయువకుడు ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న విషాద ఘటన మందమర్రి మండలంలోని అందగులపేటలో చోటుచేసుకుంది.ఈ ఘటనపై ఎస్సై గోపతి నరేష్ తెలిపిన వివరాల ప్రకారం..అందగులపేట గ్రామానికి చెందిన కొమ్ము మల్లయ్య కుమారుడు కొమ్ముురాజు (32)ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తు న్నాడు. పలుమార్లు వివాహ సంబంధాలు చూసినప్పటికీ ఏదీ కుదరకపోవడంతో కొంతకాలంగా తీవ్ర ఆవేదనలో ఉన్నట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. మంగళవారం ఉదయం కుటుంబ సభ్యులు ఇంటి బయట ఉండగా,రాజు ఇంట్లోకి వెళ్లి తలుపులు లోపల నుంచి మూసుకున్నాడు.కొంతసేపటి వరకు బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన తల్లి పలుమార్లు పిలిచినా స్పందన లేకపోయింది. అనంతరం కిటికీ ద్వారా చూడగా రాజు ఉరివేసుకుని కనిపించాడు. స్థానికుల సహాయంతో తలుపులు పగులగొట్టి లోపలికి వెళ్లగా అప్పటికే రాజు మృతి చెందినట్లు గుర్తించారు.మృతుడి తమ్ముడు కొమ్ము సాగర్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి,మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.ఘటనపై పూర్తి స్థాయిలో దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు ఎస్సై గోపతి నరేష్ వెల్లడించారు.

## గోల్కొండ జగదాంబికా ఎల్లమ్మ దేవాలయంలో భక్తుల కానుకల హుండీ ఆదాయం రూ.3,70,465 లక్షలు



**నాంపల్లి,హైదరాబాద్,జూలై 21(సూర్యరేఖ)** గోల్కొండలోని శ్రీజగదాంబికా ఎల్లమ్మ దేవాలయంలో బోనాల సందర్భంగా భక్తులు సమర్పించిన కానుకల హుండీ లెక్కింపు కార్యక్రమం మంగళవారం నిర్వహించడం జరిగింది.ఈ సందర్భంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వసంత,ఇన్స్పెక్టర్ రాజరాజేశ్వరిల పర్యవేక్షణలో ఆలయ చైర్మన్ ఆకుల చంద్రశేఖర్,ట్రస్ట్ సభ్యులు ఆధ్వర్యంలో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా వచ్చిన మొత్తం రూ.3,70,465లక్షలు లెక్కించారు.ఈ సందర్భంగా ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వసంత,ఇన్స్పెక్టర్ రాజరాజేశ్వరి,లు మాట్లాడుతూ.. అమ్మవారి కృప ఎల్లప్పుడూ భక్తులందరిపై ఉండాలని కోరుకుంతున్నామని తెలిపారు.ఈ లెక్కింపు కార్యక్రమంలో పాలకవర్గ సభ్యులు నాగులపల్లి శ్రీకాంత్,కాసాల శివశంకర్,తదితర మహిళా సేవకులు పాల్గొన్నారు.

## పచ్చని భవిష్యత్తు కోసం ఏరియాలో బృహత్ వృక్షారోపణ..

**'ఏక్ పేడ్ మా కే నామ్'లో భాగంగా ఒకే రోజు 500 మొక్కల నాటారు..**



**మందమర్రి,జూలై21(సూర్యరేఖ)** పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యం ఇస్తూ సింగరేణి మందమర్రి ఏరియాలో మంగళవారం బృహత్ వృక్షారోపణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. భారత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన "ఏక్ పేడ్ మా కే నామ్"కార్యక్రమంలో భాగంగా కేంద్ర బొగ్గు మంత్రిత్వ శాఖ,కోల్ కంట్రోలర్ ఆర్గనైజేషన్ (సీసీఓ) మార్గదర్శకాల మేరకు నిర్వహించిన ఈ కార్యక్రమంలో ఏరియా నర్సరీ ప్రాంగణంలో ఒకే రోజు 500 మొక్కలను నాటారు.ఈ కార్యక్రమాన్ని మందమర్రి ఏరియా జనరల్ మేనేజర్ ఎన్. రాధాకృష్ణ మొక్క నాటి ప్రారంభించారు.అనంతరం ఆయన మాట్లాడుతూ...బొగ్గు ఉత్పత్తిలోనే కాకుండా పర్యావరణ పరిరక్షణలో కూడా సింగరేణి సంస్థ దేశానికి ఆదర్శంగా నిలుస్తోందని పేర్కొన్నారు.బొగ్గు తవ్వకాలతో పాటు హరితవనాల అభివృద్ధికి సంస్థ ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని,ప్రకృతి సమతుల్యతను కాపాడేందుకు ప్రభుత్వం చేపడుతున్న హరిత కార్యక్రమాలకు సింగరేణి పూర్తిస్థాయిలో సహకరిస్తోందన్నారు.ఈ కార్యక్రమంలో ఎస్ఓ టు జీఎం జి.ఎల్. ప్రసాద్,ఎస్కే ఏజెంట్ సంతోష్ కుమార్, కేకే ఏజెంట్ ఖాదిర్,ఐఈడీ (డీజీఎం)కిరణ్ కుమార్, అటవీశాఖ అధికారి నవీన్,పర్యావరణ అధికారి వెంకట్ రెడ్డి,వివిధ విభాగాల అధికారులు,కార్మిక సంఘాల ప్రతినిధులు,ఉద్యోగులు,కార్మికులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తమ వంతు బాధ్యతను చాటిచెప్పారు. ఈ కార్యక్రమం హరిత సందేశాన్ని చాటుతూ విజయవంతంగా ముగిసింది.

## గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ బలోపేతంపై నేతలతో వేముల మహేష్ గౌడ్ సమీక్ష..



**మేడ్చల్,జూలై21(సూర్యరేఖ)**మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేముల మహేష్ గౌడ్ గుండ్లపోచంపల్లి కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సాయిపేట శ్రీనివాస్,మాజీ సర్పంచ్ బండారి నరేందర్ ముదిరాజ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి పార్టీ బలోపేతంపై విస్తృతంగా చర్చించారు.ఈ సందర్భంగా గుండ్లపోచంపల్లి డివిజన్ లో కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత పరిస్థితి,పార్టీని మరింత బలోపేతం చేసేందుకు చేపట్టాల్సిన కార్యాచరణ ,క్షేత్రస్థాయిలో నాయకులు,కార్యకర్తల సమన్వయం వంటి అంశాలపై సమీక్ష నిర్వహించారు. డివిజన్‌లో పార్టీ విస్తరణకు అందరూ సమష్టిగా కృషి చేయాలని వేముల మహేష్ గౌడ్ పిలుపునిచ్చారు .అదేవిధంగా, ప్రత్యేక ఓటరు జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం డివిజన్‌లో ఎలా కొనసాగుతోందనే విషయాన్ని సాయిపేట శ్రీనివాస్‌ను అడిగి తెలుసుకు న్నారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవం తంగా నిర్వహించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై కూడా చర్చించారు. అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా పనిచేయాలని సూచించినట్లు తెలిసింది.ఈ సమావేశంలో మాజీ సర్పంచ్ బండారి నరేందర్,మాజీ అధ్యక్షులు,మాజీ జిల్లా పరిషత్ ప్రాదేశిక సభ్యులు,మాజీ కౌన్సిలర్ సాయిపేట శ్రీనివాస్,ఎస్సీ విభాగం అధ్యక్షులు కుండ భానుచందర్,కార్మిక విభాగం అధ్యక్షులు కావలి భాస్కర్,లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం డైరెక్టర్లు ఉదయ్ గౌడ్,బండారి అనిల్,షబ్బీర్, సోను,మాధవ్ రెడ్డి,సంపత్ గౌడ్,కండ్లకోయ వెంకట్,సత్తన్న ,ప్రసాద్, సురేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సుప్రీంకోర్టు మార్గదర్శకాల మేరకు రోడ్డు భద్రత చర్యలను పకడ్బందీగా అమలు చేయాలి..







జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్

**మంచిర్యాల,జూలై21(సూర్యరేఖ)** సుప్రీంకోర్టు జారీ చేసిన మార్గదర్శకాల మేరకు జిల్లాలో రోడ్డు భద్రతకు సంబంధించిన అన్ని చర్యలను సమర్థవంతంగా అమలు చేసి రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు.మంగళవారం జిల్లాలోని నస్పూర్ లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ సమావేశానికి డి.సి.పి. ఎ.భాస్కర్,అధికారులతో కలిసి హాజరయ్యారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ...సుప్రీంకోర్టు మార్గదర్శకాల ప్రకారం ప్రతిశాఖ బాధ్యతాయుతంగా పని చేయాలని తెలిపారు.జాతీయ,రాష్ట్ర రహదారులపై అనుమతించిన లే-బైలు,వే-సైడ్ సౌకర్య కేంద్రాలు మినహా ఇతర ప్రాంతాలలో భారీ, వాణిజ్య వాహనాల పార్కింగ్‌ను పూర్తిగా నిషేధిస్తూ కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు .దాబాలు, హోటళ్లు,వాణిజ్య సంస్థల సమీపంలో అక్రమంగా నిలిపే భారీ వాహనాల వల్ల ప్రమాదాలు పెరుగుతున్నందున ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని,రహదారులపై ప్రమాదాలకు గురయ్యే బ్లాక్ స్పాట్లను గుర్తించి అక్కడ వీధి దీపాలు,సి.సికెమెరాలు,హెచ్చరిక బోర్డులు,రిఫ్లెక్టర్లు, స్పీడ్ కంట్రోల్ చర్యలు,రంబుల్ స్ట్రిప్‌లు,స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలని సంబంధిత శాఖలను ఆదేశించారు.ఇందారం వంతెన నుంచి గోదావరి వంతెన వరకు వీధి దీపాల ఏర్పాటు,ప్రధాన కూడళ్లలో ట్రాఫిక్ నిర్వహణ,యూ-టర్న్‌ల పున: వ్యవస్థీకరణ,రహదారుల షోల్డర్ల అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని తెలిపారు.రహదారి హక్కు పరిధిలో కొత్త దాబాలు,వాణిజ్య నిర్మాణాలకు అనుమతులు ఇవ్వకూడదని, ఇప్పటికే ఉన్న అనధికార నిర్మాణాలను తొలగించి రహదారుల భద్రతకు ఆటంకం కలిగించే ఆక్రమణలను నివారించాలని సూచించారు.రహదారుల సమీప భూవినియోగాన్ని నిబంధనల ప్రకారం నియంత్రించి ప్రమాదాలకు దారితీసే పరిస్థితులను అరికట్టాలని అధికారులకు సూచించారు.పాఠశాలలు, కళాశాలలు,విద్యాసంస్థలు,గ్రామాలు,పట్టణాలలో రోడ్డు భద్రతపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించి ట్రాఫిక్ నిబంధనల పట్ల ప్రజలలో బాధ్యత పెంపొందించాలని తెలిపారు.ఈ సందర్భంగా డి.సి.పి.మాట్లాడుతూ...రహదారి భద్రతను మరింత బలోపేతం చేసేందుకు పోలీసు, రవాణా శాఖల ఆధ్వర్యంలో ప్రత్యేక హైవే సర్వైలెన్స్ బృందాలను ఏర్పాటు చేసి 24గంటల పర్యవేక్షణ నిర్వహిస్తామని తెలిపారు.డ్రంక్ అండ్ డ్రైవ్, అతివేగం,హెల్మెట్,సీట్‌బెల్ట్ వినియోగం,రాంగ్ రూట్ డ్రైవింగ్, ఓవర్‌లోడ్ వాహనాలు,అక్రమ పార్కింగ్ వంటి ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలపై నిరంతర డ్రైవ్‌లు నిర్వహించి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు .ప్రమాద బాధితులకు సహాయం చేయడానికి ప్రజలు భయపడకుండా ముందుకు రావాలని,సమయానికి అందించే సహాయం అనేక ప్రాణాలను కాపాడగలదని తెలిపారు.ఈ కార్యక్రమంలో రవాణా,జాతీయ రహదారుల, రోడ్లు భవనాల,పోలీసు శాఖల అధికారులు,మున్సిపల్, పంచాయతీరాజ్,వైద్య ఆరోగ్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

# గోల్కొండ కోట బోనాల్లో విస్తృత ట్రాఫిక్ బందోబస్తు..







మునుపెన్నడూ లేని విధంగా డ్రోన్ల ద్వారా ట్రాఫిక్ నిర్వహణ

**నాంపల్లి,హైదరాబాద్,జూలై21(సూర్యరేఖ)** నగరంలోని గోల్కొండ ట్రాఫిక్ జోన్ పరిధిలో శ్రీజగదాంబికా అమ్మవారి బోనాల మహోత్సవాలు ఈ నెల16న ప్రారంభమై ఆగస్టు13వరకు అత్యంత వైభవంగా జరిగే ఉత్సవాలలో హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వి.సి.సజ్జనార్ ఉత్తర్వుల మేరకు ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా విస్తృత స్థాయి బందోబస్తు ఏర్పాట్లు చేయడం జరిగింది.భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని గోల్కొండ కోట పరిసర ప్రాంతాల్లో వాహనాల రాకపోకలు సుగమం చేయడానికి హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ శాఖ మొదటిసారిగా డ్రోన్ సర్వేలెన్స్ డ్రోన్ల నిఘా వ్యవస్థను అందుబాటులోకి తెచ్చింది.డ్రోన్ల సహాయంతో పార్కింగ్ స్థలాలు,ప్రధాన ట్రాఫిక్ మళ్లింపు పాయింట్లను ఎప్పటికప్పుడు ఆకాశ మార్గం ద్వారా పర్యవేక్షిస్తూ ట్రాఫిక్ జామ్లను తక్షణమే నివారించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరిస్తున్నారు. డ్రోన్ సర్వేలెన్స్ ప్రాముఖ్యత..ట్రాఫిక్ మళ్లింపు పాయింట్ల పర్యవేక్షణ: ముందస్తుగా ప్రకటించిన రూట్ డైవర్షన్ల ప్రకారం వాహనాలు సజావుగా సాగేలా అన్ని ప్రధాన మళ్లింపు పాయింట్లను డ్రోన్ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. పార్కింగ్ నిర్వహణ... గోల్కొండ కోటకు సమీపంలో ఉన్న కేటాయించిన పార్కింగ్ స్థలాలలో వాహనాల రద్దీని అంచనా వేయడానికి,అనధికార పార్కింగ్,ని నిరోధించడానికి మరియు భక్తులకు ఖాళీగా ఉన్న పార్కింగ్ స్థలాలను సూచించడానికి డ్రోన్లను ఉపయోగిస్తున్నారు. రద్దీ నివారణ చర్యలు.. కోటకు వెళ్లే ప్రధాన రహదారులు,అంతర్గత మార్గాలు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో సమకూరే ప్రాంతాలలో ట్రాఫిక్ ఆటంకాలను తక్షణమే గుర్తించి, వెంటనే క్షేత్రస్థాయి సిబ్బంది ద్వారా నియంత్రణ చర్యలు చేపడుతున్నారు.ఈ ఆధునిక డ్రోన్ సాంకేతికత వినియోగం వల్ల క్షేత్రస్థాయి ట్రాఫిక్ పరిస్థితిపై సమగ్ర అవగాహన ఏర్పడి,బోనాల ఉత్సవాల సందర్భంగా భక్తులకు మరియు సాధారణ ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా సురక్షితమైన ,వేగవంతమైన ప్రయాణాన్ని అందించడానికి ఎంతగానో తోడ్పడుతోంది.ఈ బందోబస్తును ట్రాఫిక్ జాయింట్ సిపి డి.జోయెల్ డేవిస్ ప్రత్యక్ష పర్యవేక్షణలో,ట్రాఫిక్ డిసిపి శ్రీమతి కాజల్,గోల్కొండ జోన్ ట్రాఫిక్ ఏసిపి డి.ధనలక్ష్మి,లు నిరంతరం సమీక్షిస్తున్నారు.

## మంచిర్యాల పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీసీపీ భాస్కర్




**మంచిర్యాల,జూలై21(సూర్యరేఖ)** రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలోని మంచిర్యాల జోన్ డీసీపీ ఎ.భాస్కర్ మంగళవారం మంచిర్యాల పట్టణ పోలీస్ స్టేషన్‌ను సందర్శించి తనిఖీలు నిర్వహించారు.పోలీస్ స్టేషన్ పరిసరాలు, సీసీ కెమెరాల పనితీరు,రిసెప్షన్, స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఆయన పోలీసు సిబ్బందితో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో విధులు నిర్వహిస్తున్న అధికారులు,సిబ్బంది వివరాలు,నమోదవుతున్న నేరాల స్వరూపం,రౌడీ షీటర్ల వివరాలు, అనుమానితుల ప్రస్తుత పరిస్థితిపై ఇన్‌స్పెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు.అలాగే బ్లూ కోల్ట్స్,పెట్రో కార్ల సిబ్బంది విధుల నిర్వహణ ,పెట్రోలింగ్ సమయాలపై సమీక్ష నిర్వహించారు.అనంతరం అధికారులకు పలు కీలక సూచనలు చేసిన డీసీపీ,తెలంగాణ ప్రభుత్వం,డీజీపీ ఆదేశాల మేరకు ప్రతి కేసు వివరాలను సీసీటీఎన్ఎస్ లో సకాలంలో నమోదు చేయాలని,సాక్ష్యాధారాలను డిజిటల్ రూపంలో అప్‌లోడ్ చేయాలని ఆదేశించారు.వీడియో ఆధారిత దర్యాప్తుకు ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు సంఘటన స్థలాల వీడియో చిత్రీకరణ,సాక్షుల వాంగ్మూలాల వీడియో రికార్డింగ్ ద్వారా కేసుల్లో శిక్షలు పడే అవకాశాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు. నేరాల నియంత్రణలో విజిబుల్ పోలీసింగ్ కీలకమని పేర్కొన్న డీసీపీ,పోలీసులు నిరంతరం పెట్రోలింగ్ నిర్వహించడంతో పాటు ఆకస్మిక వాహన తనిఖీలు చేపట్టాలని సూచించారు. బ్యాంకులు,ఏటీఎంలు, బంగారు ఆభరణాల దుకాణాలు,ఆర్థిక సంస్థల వద్ద పగలు,రాత్రి వేళల్లో ఆయుధాలతో ప్రత్యేక పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి..

**మరిపెడ,జూలై21(సూర్యరేఖ)** ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు.ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల పరిధిలో మంగళవారం జరిగింది.మరిపెడ ఎస్ హెచ్ ఓ గంద్రాతి సతీష్ తెలిపిన వివరాల ప్రకారం...ఖమ్మం జిల్లా తిరుమలాయపాలెం మండలం హైదర్ సాయిపేటకు చెందిన షేక్ సలీం(40)బ్యాటరీ మెకానిక్ గా పనిచేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు.ఈ నేపథ్యంలోనే ఈనెల18వ తేదీన పని నిమిత్తం సూర్యాపేట జిల్లా నూతనకల్ మండలం వెళ్లారు.పని ముగించుకొని అనంతరం తిరిగి వస్తుండగా మరిపెడ సమీపంలోని దేశ్య తండా వద్ద సూర్యాపేట వైపునకు వెళ్తున్న కారు అతివేగంగా,అజాగ్రత్తగా ఆటోను ఓవర్ టేక్ చేస్తూ బైకును వేగంగా ఢీకొట్టింది.ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సలీంను హైదరాబాదులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం తెల్లవారుజామున మృతి చెందాడు.ఘటనకు బాధ్యుడైన కారు డ్రైవర్ పెద్దపులి రాజేందర్ పై మృతుడి కుటుంబ సభ్యులు చేసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ హెచ్ఓ గంద్రాతి సతీష్ తెలిపారు.

## ధర్మ పరిరక్షణ కోసం శ్రీవారాహి అమ్మవారి మూలమంత్ర మహాహోమం..

**కామారెడ్డి,జూలై21(సూర్యారేఖ)**




ప్రజలు సుఖశాంతులు ఆయురారోగ్యాలు సమృద్ధి ధర్మ పరిరక్షణ కోసం గురువారం తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ కార్యాలయంలో శ్రీగణపతి సహిత శ్రీవారాహి అమ్మవారి మూల మంత్ర మహాహోమం నిర్వహిస్తున్నట్లు పార్టీ వర్గాలు తెలిపాయి.కావున గురువారం కామారెడ్డి జిల్లాలోని అందుబాటులో ఉన్న జనసైనికులు హాజరై మహాహోమం విజయవంతం చేయాలని జనసేన పార్టీ సీనియర్ నాయకుడు జాజారి దినేష్ ఒక ప్రకటనలో తెలిపారు

## శ్రీభద్రకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్..

రాష్ట్ర ప్రజలఆయురారోగ్యాలు,
సుఖసంతోషాలు,రాష్ట్ర అభివృద్ధి కోసం ప్రత్యేక పూజలు..
భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కులు సమర్పించిన డోర్నకల్ ఎమ్మెల్యే రామచంద్ర నాయక్..





**మరిపెడ, జూలై21 (సూర్యరే ఖ)**ప్రభు త్వ విప్,డోర్న కల్ శాసనస భ్యులు డాక్టర్ జాటోత్ రామచం ద్ర నాయక్ మంగళ వారం వరంగల్ లోని ప్రసిద్ధ పుణ్యక్షేత్ర మైన శ్రీ భద్రకాళి అమ్మవారి ఆలయాన్ని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఆలయ అర్చకులు వేదమంత్రోచ్చారణల మధ్య ఆయనకు పూర్ణకుంభ స్వాగతం పలికి అమ్మవారి దర్శనం కల్పించారు.ఈ సందర్భంగా ఆయన అమ్మవారికి ప్రత్యేక పూజలు,అర్చనలు నిర్వహించారు.అనంతరం ఆలయ అర్చకులు ఆయనకు అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేసి వేదాశీర్వచనం అందించారు.రాష్ట్ర ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాల తోజీవించాలని,రాష్ట్రంలోశాంతి, సుభి క్షం నెలకొనాలని ప్రార్థించారు. తెలంగాణ రాష్ట్రం అన్ని రంగాల్లో మరింత అభివృద్ధి సాధించాలని ,రైతులు,కార్మికులు, విద్యార్థులు,యువత,మహిళలు అన్ని విధాలుగా అభివృద్ధి చెందాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమం లో డాక్టర్ పులి అనిల్ కుమార్,పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ,భక్తులు పాల్గొన్నారు.

# జాతీయ స్థాయి శిక్షణలో ప్రతిభ చాటిన క్రాఫ్ట్ టీచర్ రజిని



**బెల్లంపల్లి,జూలై21(సూర్యరేఖ)** జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో క్రాఫ్ట్ టీచర్ గా విధులు నిర్వహిస్తున్న రజిని జూన్ 8 నుండి 17వరకు మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని దామోహ్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి శిక్షణ కార్యక్రమంలో పాల్గొని ప్రతిభ కనబరిచారు. పది రోజులపాటు నిర్వహించిన ఈ శిక్షణలో దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన 51మంది ఉపాధ్యాయులు పాల్గొన్నారు.ఇందులో భాగంగా ఒక రోజు నిర్వహించిన ప్రాంతీయ సాంస్కృతిక ప్రదర్శనలో తెలంగాణ సంస్కృతి,సంప్రదాయాలను ప్రతిబింబించే బతుకమ్మ,బోనాలు, పోతురాజు, కొమురం భీమ్,గద్దర్, భద్రాచలం శ్రీరాముడి వైభవాన్ని ప్రతిబింబించే కళారూపాలను ప్రదర్శించారు.ఈ సందర్భంగా రజిని బతుకమ్మ, బోనాల ప్రదర్శనల్లో ఉత్సాహంగా పాల్గొని తెలంగాణ సంస్కృతిని దేశస్థాయిలో చాటిచెప్పారు. శిక్షణ ముగింపు సందర్భంగా రజిని స్వయంగా రూపొందించిన చేతిపనుల నమూనాల దస్త్రాన్ని ప్రదర్శించగా,శిక్షణ నిర్వహణ బృందం ఆమె ప్రతిభను,సృజనాత్మకతను ప్రత్యేకంగా అభినందించింది.ఈ శిక్షణలో మట్టితో కళాఖండాలు, వెదురుతో ఉపయోగకరమైన వస్తువులు, జనపనారతో బొమ్మలు,రాఖీలు తదితర హస్తకళల తయారీతో పాటు వాటిని విద్యార్థులకు సులభంగా బోధించే విధానాలపై సమగ్ర శిక్షణ అందించారు. విద్యార్థులు కేవలం పుస్తక జ్ఞానానికే పరిమితం కాకుండా,చేస్తూ నేర్చుకునే విధానంలో సృజనాత్మకతను పెంపొందించుకోవడం, భారతీయ సంస్కృతి, సంప్రదాయాల విలువలను తెలుసుకొని వాటిని ఆచరించేలా తీర్చిదిద్దడం ఈ శిక్షణ ప్రధాన లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.శిక్షణ ముగింపు సందర్భంగా జూన్ 17న పాల్గొన్న 51మంది ఉపాధ్యాయులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. అనంతరం శిక్షణ నిర్వహణ అధికారులను తెలంగాణ ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది.మన ప్రాంతానికి చెందిన రజిని జాతీయ స్థాయి శిక్షణలో పాల్గొని ప్రతిభ కనబరచడం మంచిర్యాల జిల్లా ప్రజలకు,తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణమని పలువురు ఉపాధ్యాయులు, విద్యావేత్తలు,ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

# ఏఐటీయూసీ జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలి..

### మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు



**రాజేంద్రనగర్,జులై21(సూర్యరేఖ)** ఏఐటీయూసీ మహాసభలను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు.ఆగస్టు నెలలో ఈ మహాసభలు ఉండనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విస్తృతంగా సమాచారాన్ని చేరవేసి సభలకు పెద్ద ఎత్తున తరలివచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగనున్న నేపథ్యంలో ఆ మహాసభల గోడపత్రికలను శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ...రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లా పరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయని అన్నారు.కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సమ్మెలు అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ నరేంద్రమోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా లేబర్ కోడులను అమలు చేస్తున్నదని విమర్శించారు.జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యలపైన తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు.కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానికంగా నిర్మాణం చేయాలని ఆయన మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు.పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్,మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ,కే.చందు యాదవ్,డిహెచ్ పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటస్వామి,జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి, మంజుల రాములు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా ఏర్పాటు చేసిన షాపులను తొలగించి ట్రాఫిక్ సమస్యలకు పరిష్కారం చూపాలి..

### రాజేంద్రనగర్ జోనల్,డిప్యూటీ కమిషనర్లను కోరిన వర్తక వ్యాపార సముదాయ సభ్యులు





**రాజేంద్రనగర్,జులై21(సూర్యరేఖ)**రాజేంద్రనగర్ జోన్ పరిధిలో ఆయా షాపుల నిర్వాహకులు ఫుట్ పాత్,ముందు భాగాలు ఆక్రమించి అక్రమంగా దుకాణాలను నడుపుతున్నారని,దీని కారణంగా వాహనాలను రోడ్లపై నిలపడంతో ట్రాఫిక్ సమస్యలు ఎదురవుతున్నాయని అత్తాపూర్ హైదర్‌గూడ వర్తక వ్యాపార సముదాయ సభ్యులు అన్నారు.ఈ మేరకు రాజేంద్రనగర్ జోనల్ కమిషనర్ సోలిపేట శ్రీనివాస్ రెడ్డి,డిప్యూటీ కమిషనర్,లను కలిసి సమస్యలను వివరించారు.ఈ సందర్భంగా వారు వినతిపత్రాన్ని సమర్పించారు.అనంతరం వారు మాట్లాడుతూ...కొందరు రోడ్డుకు ఇరువైపులా దుకాణాలకు ముందు భాగం,ఫుట్ పాత్ లు ఆక్రమించారన్నారు. అక్రమ దుకాణాల కారణంగా షాపులకు పార్కింగ్ స్థలం లేకుండా పోతుందని,దీంతో రోడ్లపై ట్రాఫిక్ సమస్యలు తీవ్రంగా మారాయన్నారు.ఈ విషయంపై అధికారులు స్పందించి సమస్యకు పరిష్కారం చూపాలని,అక్రమంగా ఏర్పాటు చేసిన దుకాణాలను తొలగించాలని కోరారు.ఈ మేరకు అధికారులు సానుకూలంగా స్పందించినట్లు వివరించారు.

## శంషాబాద్ మండల కాంగ్రెస్ అధ్యక్షులుగా చిలకమర్రి మహేందర్ ముదిరాజ్



**శంషాబాద్,జులై21(సూర్యరేఖ)** రాజేంద్రనగర్ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని శంషాబాద్ మండల్ కాంగ్రెస్ అధ్యక్షులు చిలకమర్రి మహేందర్ ముదిరాజ్ అన్నారు.శంషాబాద్ మండల కాంగ్రెస్ కమిటీ అధ్యక్షునిగా మహేందర్ ముదిరాజ్ ను తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ) అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్ నియమించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్,రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డికి,నరేందర్ లకు ధన్యవాదాలు తెలిపారు.తనపై నమ్మకంతో అధిష్టానం గౌరవప్రదమైన బాధ్యతను అప్పగించడం సంతోషంగా ఉందని,ఈ మేరకు కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి, నాయకులకు,కార్యకర్తలకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని వివరించారు.ఈ పదవి తన జవాబుదారితనాన్ని పెంచుతుందని అన్నారు.కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేయడానికి,పార్టీ సిద్ధాంతాలను నిలబెట్టడానికి,ప్రజా సంక్షేమాన్ని నిర్ధారించడానికి,పార్టీ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండటానికి తాను శాయశక్తులా నిజాయితీగా పనిచేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. ప్రోత్సహించి,అభినందించిన పెద్దలకు,నాయకులకు,పార్టీ కార్యకర్తలకు, అభిమానులకు కృతజ్ఞతలు తెలిపారు.

## ప్రధాని నివాసం ఎదుట ధర్నాలో పాల్గొన్న ఎంపీ వంశీకృష్ణ

### దేశ యువతపై లాఠీచార్జ్‌కు నిరసన..





**మంచిర్యాల,జూలై21(సూర్యరేఖ)**దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత చేపడుతున్న ఆందోళనల సందర్భంగా లాఠీచార్జ్,టియర్ గ్యాస్ ప్రయోగాలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం ప్రధానమంత్రి నివాసం ఎదుట నిర్వహించిన ధర్నాలో పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు.కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో జరిగిన ఈ నిరసనలో పలువురు కాంగ్రెస్ ఎంపీలు,సీనియర్ నాయకులు, కార్యకర్తలు హాజరయ్యారు.ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ...తమ హక్కులు, భవిష్యత్తు కోసం శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థులు,యువతపై లాఠీచార్జ్ చేయడం, టియర్ గ్యాస్ ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని విమర్శించారు.ప్రజాస్వామ్యంలో ప్రతి పౌరుడికి శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ఉందని, బలప్రయోగంతో సమస్యలకు పరిష్కారం లభించదని అన్నారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్రప్రధాన్ తన పదవికి రాజీనామా చేయాలని కాంగ్రెస్ నేతలు డిమాండ్ చేశారు.ఈ డిమాండ్‌తోనే ప్రధానమంత్రి నివాసం ఎదుట ధర్నా చేపట్టినట్లు తెలిపారు.ధర్నా సందర్భంగా కాంగ్రెస్ నాయకులు,కార్యకర్తలతో పాటు ఎంపీ గడ్డం వంశీకృష్ణను కూడా పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు కాంగ్రెస్ వర్గాలు వెల్లడించాయి.యువత హక్కులను కాపాడడం ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు.

## వైద్య సేవలకు సీ.ఎం.ఆర్.ఎఫ్.ద్వారా నిధుల మంజూరు..





**సికింద్రాబాద్,జులై21(సూర్యరేఖ)**బీదల బస్తీకి చెందిన గోండా నవదీప్,అడ్డగుట్టకు చెందిన పబ్బ సంపత్ కుమార్,నార్త్ లాలగూడకు చెందిన మన్సూర్,లు ఆరోగ్య సమస్యలతో సత్యమతమవుతూ తగిన వైద్య సాయనికై సీతాఫలమండీలోని సికింద్రాబాద్ నియోజకవర్గ ఎం. ఎల్.ఏ.క్యాంపు కార్యాలయాన్ని సంప్రదించారు. వెంటనే స్పందించిన స్థానిక శాసనసభ్యులు తీగుళ్ళ పద్మారావుగౌడ్ తమ కార్యాలయం ద్వారా ముఖ్యమంత్రి కార్యాలయాన్ని సంప్రదించి నిమ్స్ ఆసుపత్రిలో చికిత్సను నిర్వహించేందుకు వీలుగా వారికి ఎల్.ఓ.సీ పత్రాలను సమకూర్చారు. ఈ ఎల్. ఓ.సీ.పత్రాలను పద్మారావుగౌడ్ మంగళవారం సీతాఫలమండీ లోని తమ కార్యాలయంలో అందించారు.మహమ్మద్ అక్రంకు రెండు లక్షలు, గొండా నవదీప్ కు రూ.75 వేలు,పబ్బ సంపత్ కుమార్ కు రూ.లక్షా50 వేల మేరకు విలువజేసే పత్రాలను అందించారు.ఈ సందర్భంగా పద్మారావు గౌడ్ మాట్లాడుతూ...సికింద్రాబాద్ నియోజకవర్గ ప్రజలకు సీతాఫలమండీలోని తమ కార్యాలయాన్ని అందుబాటులో నిలిపి వివిధ సేవలను అందిస్తున్నామని పేర్కొన్నారు.అత్యవసర సందర్భాలలో తమ కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.కార్యక్రమంలో అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# ఏఐటీయూసీ జిల్లా నాలుగవ మహాసభలను విజయవంతం చేయాలి..

మహాసభల పోస్టర్ ఆవిష్కరణలో జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు




**రాజేంద్రనగర్,జులై21(సూర్యరేఖ)** ఏఐటీయూసీ మహాసభలను ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు పిలుపునిచ్చారు.ఆగస్టు నెలలో ఈ మహాసభలు ఉండనున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరూ విస్తృతంగా సమాచారాన్ని చేరవేసి సభలకు పెద్ద ఎత్తున తరలివచ్చేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.ఏఐటీయూసీ రంగారెడ్డి జిల్లా నాలుగవ మహాసభలు ఆగస్టు 2న తుక్కుగూడలో జరగనున్న నేపథ్యంలో ఆ మహాసభల గోడపత్రికలను శంషాబాద్ పట్టణ కేంద్రంలోని ఎలైట్ హోటల్ ఆవరణలో విడుదల చేశారు.ఈ సందర్భంగా జిల్లా ప్రధాన కార్యదర్శి పానుగంటి పర్వతాలు మాట్లాడుతూ...రంగారెడ్డి జిల్లా నాలుగో మహాసభలు జిల్లా పరిధిలోని తుక్కుగూడలో జరుగుతున్నాయని అన్నారు.కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు నిర్వహిస్తున్నప్పటికీ ప్రభుత్వాలు బరితెగించి ధరలు పెంచి కార్మికుల బ్రతుకులను ఆగం చేస్తున్నాయని ఆయన విమర్శించారు.29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగా మార్చి ఎన్నో ఏళ్లు పోరాడి సాధించుకున్న చట్టాలను నిర్వీర్యం చేయడం దుర్మార్గమని ఆయన మండిపడ్డారు.ఏఐటీయూసీ ఆధ్వర్యంలో అనేక సమ్మెలు అనేక పోరాటాలు నిర్వహించినప్పటికీ నరేంద్రమోడీ ప్రభుత్వం నిస్సిగ్గుగా లేబర్ కోడులను అమలు చేస్తున్నదని విమర్శించారు. జిల్లా మహాసభలలో కార్మికుల సమస్యలపైన తీర్మానాలు చేస్తున్నట్లు తెలిపారు.కనీస వేతనాలు రూ.26 వేలు ఇవ్వాలని ఈఎస్ఐ మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రిని స్థానికంగా నిర్మాణం చేయాలని ఆయన మహాసభలలో చర్చించనున్నట్లు తెలిపారు.పరిశ్రమలలో పనిచేసే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ఉద్యోగులకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనాలు అమలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కే.రామస్వామి,జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి దత్తు నాయక్,మున్సిపల్ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వనంపల్లి జైపాల్ రెడ్డి,జిల్లా సహాయ కార్యదర్శి వడ్ల సత్యనారాయణ,కే.చందు యాదవ్,డిహెచ్ పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.వెంకటస్వామి,జిల్లా కార్యవర్గ సభ్యుడు సక్రు నాయక్,భవన నిర్మాణ కార్మిక సంఘం రాష్ట్ర సమితి సభ్యుడు నర్రగిరి,మంజుల రాములు తదితరులు పాల్గొన్నారు.

# ఢిల్లీ పార్లమెంటు సరిహద్దుల్లో నిరసనకారులపై లాఠీచార్జిని ఖండించిన పీడీఎస్ యూ

కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాకు డిమాండ్




**నారాయణపేట,జులై21(సూర్యరేఖ):** ఢిల్లీ పార్లమెంటు సరిహద్దుల్లో నిరసనకారులపై లాఠీ చార్జిని ఖండిస్తున్నట్లు,కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని పీడీఎస్ యు మాజీ జిల్లా అధ్యక్షుడు,రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎస్ సాయికుమార్ డిమాండ్ చేశారు.ప్రశ్నించే గొంతులను అణిచివేసే కేంద్ర ప్రభుత్వ నిర్బంధాన్ని వ్యతిరేకిద్దామని అన్నారు.ఇటివల ఢిల్లీలో జంతర్ మంతర్ దగ్గర నిరసనకారులపై పోలీసుల లాఠీచార్జిని ఖండిస్తూ నారాయణపేట జిల్లా కేంద్రంలోనీ పీడీఎస్ యూ ఆధ్వర్యంలో పాత బస్టాండ్ నుండి మున్సిపల్ పార్కు మీదుగా అంబేద్కర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి నిరసన తెలిపారు.ఈ నిరసన కార్యక్రమానికి జిల్లా అధ్యక్షుడు వెంకటేష్ అధ్యక్షత వహించగా ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఢిల్లీ పార్లమెంట్ సరిహద్దుల్లో నిన్న నిరసన తెలుపుతున్న కాక్రోచ్ పార్టీ,ప్రజాసంఘాల నాయకులు, విద్యార్థులు,యువకులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం ,బలప్రయోగానికి దిగడం తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు.ప్రజాస్వామ్యం లో శాంతియుత నిరసన ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని,ఆ హక్కును అణచివేయడానికి కేంద్ర ప్రభుత్వం పోలీసులను అడ్డుపెట్టుకొని నిరసనకారులపై రక్తాలు కారే విధంగా లాఠీలతో దమనకాండను ప్రయోగించడం అత్యంత దుర్మార్గమన్నారు.నీట్ పేపర్ లీకేజ్‌కు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలని,సోనం వాంగ్‌చుక్ అక్రమ అరెస్టు,ఢిల్లీలో విద్యార్థులు,యువత ,ప్రజాసంఘాల నాయకులపై పోలీసుల దమనకాండను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడి ఉన్న నీట్ పరీక్ష పేపర్ లీకేజ్ దేశ విద్యా వ్యవస్థపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తిందని లక్షలాది మంది విద్యార్థులు సంవత్సరాల పాటు కష్టపడి సిద్ధమయ్యే పరీక్షలో ఇలాంటి అవకతవకలు జరగడం అత్యంత దురదృష్టకరమని అన్నారు.ఈ ఘటనకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని ఆయన డిమాండ్ చేశారు.పర్యావరణ పరిరక్షణ,ప్రజల హక్కుల కోసం శాంతియుతంగా ఉద్యమిస్తున్న సోనం వాంగ్‌చుక్‌ను అక్రమంగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆయన విమర్శించారు. భిన్నాభిప్రాయాలను అణచివేయడానికి అరెస్టులను ఆయుధంగా ఉపయోగించడం సరైన విధానం కాదని పేర్కొన్నారు.సోనం వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేసి,ప్రజాస్వామ్య హక్కులను కాపాడే విధంగా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ప్రజల గొంతును అణచివేసే విధానాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే విరమించుకోవాలని,సోనం వాగ్ చుక్,కాక్రోచ్ పార్టీ,విద్యార్థులు, యువత,ప్రజాసంఘాల నాయకుల డిమాండ్లను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మహేష్,మాజీ జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్,నాయకులు వంశీ,నరేష్,నావదీప్ ,మోనేష్,అలాకానంద, మహేశ్వరీ, ప్రవీన,శ్రీవిద్య ,మోహన్ ,వెంకటేష్ ,అర్చన,వైష్ణవి, అనీల్ తో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

## మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

.స్వల్ప కాలంలో ఎక్కువ లాభాలపై ఆశలు వద్దు

.తెలియని వ్యక్తులకు డబ్బులు,వ్యక్తిగత వివరాలు ఇవ్వొద్దు.

.మోసాలకు గురైతే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి.

– జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్




**నారాయణపేట,జులై21(సూర్యరేఖ):** ప్రస్తుత సమాజంలో వివిధ రూపాల్లో జరుగుతున్న మోసాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ డాక్టర్ వినీత్ ఒక ప్రకటనలో తెలిపారు.అమాయక ప్రజలను లక్ష్యంగా చేసుకుని కొందరు వ్యక్తులు ఉద్యోగాలు,పెట్టుబడులు,రుణాలు, బంగారం, స్థలాలు,ఆన్‌లైన్ వ్యాపారాలు,లక్కీ డ్రాలు,విదేశీ ఉద్యోగాల పేరుతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.ముఖ్యంగా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు,సులభంగా లోన్,తక్షణ ఉద్యోగం,లాటరీ గెలుపు వంటి ఆశాజనక మాటలతో ప్రజలను నమ్మబలికి డబ్బులు వసూలు చేస్తున్నారని పేర్కొన్నారు.అలాంటి ప్రకటనలు,సోషల్ మీడియా పోస్టులు,ఫోన్ కాల్స్,మెసేజ్‌లను నమ్మి ఎవరూ మోసపోవద్దని హెచ్చరించారు.ఇటీవల కొందరు ఫేక్ డాక్యుమెంట్లు,నకిలీ రిజిస్ట్రేషన్ పత్రాలు చూపించి స్థలాలు,ఇళ్లు అమ్ముతున్నట్లు నటిస్తూ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు.ఆస్తుల కొనుగోలు సమయంలో సంబంధిత పత్రాలను పూర్తిగా పరిశీలించి,అధికారిక ధృవీకరణ తీసుకున్న తర్వాతే లావాదేవీలు చేయాలని సూచించారు.అలాగే సోషల్ మీడియా ద్వారా పరిచయాలు పెంచుకుని డబ్బులు అడగడం,ఫేక్ అకౌంట్లతో మోసాలు చేయడం,క్యూఆర్ కోడ్ స్కాన్ చేయమని చెప్పి బ్యాంకు ఖాతాల నుంచి డబ్బులు దోచుకోవడం వంటి ఘటనలు పెరుగుతున్నాయని తెలిపారు.అపరిచితులపై నమ్మకం ఉంచి ఆర్థిక లావాదేవీలు చేయవద్దని సూచించారు.విద్యార్థులు,యువత ఉద్యోగాల కోసం ప్రయత్నించే సమయంలో ప్రభుత్వ గుర్తింపు ఉన్న సంస్థలను మాత్రమే సంప్రదించాలని,ముందస్తుగా డబ్బులు అడిగే సంస్థల పట్ల జాగ్రత్తగా ఉండాలని పేర్కొన్నారు.మహిళలు బంగారం,చిట్‌ఫండ్లు,ఆన్‌లైన్ షాపింగ్ వంటి విషయాల్లో ప్రత్యేక అప్రమత్తతతో వ్యవహరించాలని సూచించారు .ప్రజలు ఎవరైనా మోసాలకు పాల్పడుతున్నట్లు గుర్తిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని కోరారు.చీటింగ్ కేసులపై జిల్లా పోలీస్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుందని,మోసగాళ్లను చట్టపరంగా శిక్షిస్తామని తెలిపారు.ప్రజల అప్రమత్తతే మోసాలకు అడ్డుకట్ట వేయగలదని,అనుమానం వచ్చిన వెంటనే పోలీసులను సంప్రదించాలి అని జిల్లా ఎస్పీ పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొని ఓటు హక్కును పరిరక్షించుకోవాలి:

ఎమ్మెల్యే తీగుళ్ల పద్మారావుగౌడ్



**సికింద్రాబాద్,జూలై21(సూర్యరేఖ)** ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రెవిషన్)ప్రక్రియలో ప్రతి అర్హ ఓటరు తప్పనిసరిగా పాల్గొనడం ద్వారానే తమ ఓటు హక్కును పరిరక్షించుకోగలరని సికింద్రాబాద్ శాసనసభ్యులు ,మాజీ డిప్యూటీ స్పీకర్ తీగుళ్ల పద్మారావు గౌడ్ అన్నారు.మంగళవారం అడ్డగుట్ట ప్రాంతంలో బీఆర్ఎస్ నాయకులు ఏర్పాటు చేసిన ఎస్ఐఆర్ సహాయ శిబిరాలను ఆయన సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ...బూత్ లెవల్ సహాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని,అర్హులైన ఓటర్ల పేర్లు జాబితా నుంచి తొలగిపోకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఓటర్లకు అవసరమైన సహాయ సహకారాల కోసం సీతాఫల్‌మండిలోని ఎమ్మెల్యే కార్యాలయాన్ని సంప్రదించాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ లింగని ప్రసన్న లక్ష్మీశ్రీనివాస్, బీఆర్ఎస్ యువనాయకులు తీగుళ్ల రామేశ్వర్ గౌడ్, రాజాసుందర్,తదితరులు పాల్గొన్నారు.

## ఎల్ నినో వల్ల నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్



**నారాయణపేట,జులై21(సూర్యరేఖ):**నారాయణ పేట జిల్లా వ్యాప్తంగా ఎల్ నినో వల్ల రైతులు సరి అయిన సమయంలో వర్షాలు రాక నష్టపోయిన రైతులను ప్రభుత్వం గుర్తించి ఆదుకోవాలని సామాజిక కార్యకర్త రాము ముదిరాజ్ కోరారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ ..పత్తి ,ఆముదం,కంది,పెసర విత్తనాలు మొలువక చాలా నష్టపోయారని ,తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలన్నారు.ఖరీఫ్ లో వర్షాలు కురవకపోవడం వలన ఒక్కొక్క రైతు రెండు,మూడు సార్లు పత్తి,కంది,పెసర,ఆముదం విత్తనాలు నాటి సుమారు ఎకరాకు రూ.15000 నష్టపోయారని గుర్తు చేశారు.మొలకలు సరిగ్గా మొలవకపోవడం వలన మొన్న,నిన్న కురిసిన వానలకు జిల్లాలో చాలా గ్రామాలలో పంటలు చెడిపి ఆముదలు,పత్తి పెట్టినట్లు తెలిపారు.ధన్వాడ మండలం కంసాన్ పల్లి రైతు మరాఠి నర్సిములు 5 ఎకరాలు మొదట పత్తి పెడితే సరిగ్గా మొలవకపోవడం వలన చెడిపి నిన్న ఆముదలు పెట్టినట్లు చెప్పారని తెలిపారు.ఈ రైతుకు రూ.45 వేలు నష్టం వచ్చిందని అన్నారు.అదే గ్రామానికి చెందిన మరొక రైతు వెంకటయ్య 5 ఎకరాలలో పత్తి వేసి సరిగా మొలవక పోవడం వలన మొత్తం చెడిపి మళ్ళీ పత్తి విత్తనాలు పెట్టడం వలన రూ.60 వేలు నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఈ పరిస్థితి పేట జిల్లాలోని రైతులు అందరికీ ఉంది కావున వ్యవసాయ అధికారులు ఈ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకొని పోయి రైతులను ఆదుకోవడం కోసం కృషి చేయాలని కోరారు.ఈ సంవత్సరం పంట పొలాలు చూస్తే పెట్టుబడి కూడా వచ్చే పరిస్థితి లేదు కావున తెలంగాణ ప్రభుత్వం పేట జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించి పంటలు నష్టపోయిన రైతులను ఆదుకొనుటకు యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## గుడుంబా స్వాధీనం..మహిళపై కేసు నమోదు



**మందమర్రి,జూలై21 (సూర్యరేఖ)**పట్టణంలోని ప్రశాంతి నగర్‌లో పోలీసులు నిర్వహించిన తనిఖీల్లో 5లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు.ప్రశాంతి నగర్‌కు చెందిన మానుపాటి ఎల్లమ్మ ఇంట్లో తనిఖీ నిర్వహించగా అక్రమంగా నిల్వ ఉంచిన 5లీటర్ల గుడుంబా లభ్యమైనట్లు మందమర్రి ఎస్సై గోపతి నరేష్ తెలిపారు.స్వాధీనం చేసుకున్న గుడుంబాను సీజ్ చేసి,ఎల్లమ్మపై సంబంధిత చట్టాల ప్రకారం కేసు నమోదు చేసినట్లు ఆయన వెల్లడించారు. అక్రమ మద్యం తయారీ,నిల్వ,విక్రయాలపై ప్రత్యేక నిఘా కొనసాగుతుందని,ఇలాంటి కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో గుడుంబాను పట్టుకున్న బ్లూ కోర్టు కానిస్టేబుళ్లు రాజేందర్ ,కుమారస్వామిలను ఉన్నతాధికారులు అభినందించారు.

Printed and Published Mekkonda Premraj onbehalf of MPR Publications and Printed at H.No. 5-4-23,
Bhavanicolony, Premavathipet, Rajendranagar, Rangareddy,Telangana 500030,RNI NO.TGTEL/25/A1713